اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచిక 9 ఏప్రిల్ 2013 రూ. 17/-



పరిణామవాదులు కల్పించిన

## రాతి యుగం

ఓ చారిత్రక అబద్ధం

## ఫిఖ్

ప్రత్యేక వ్యాసం

## ఇమామ్ బాధ్యతలు

## విశ్వాసుల మధ్య సంప్రదింపులు

## వేసవి శలవులు

تبٰرَکَ اسۡمُ رَبِّکَ ذِی الۡجَلٰلِ وَالۡاِکۡرَامِ

మహిమాన్వితుడు మరియు పరమదాత అయిన నీ ప్రభువు పేరే
ఎంతో శుభదాయకమైనది (ఖుర్'ఆన్ 55:78)

సృష్టికర్త

الله

అల్లాహ్

ذِی الۡجَلٰلِ
وَالۡاِکۡرَامِ

జిల్ జలాలి
వల్ ఇక్రామ్

మహిమాన్వితుడు
మరియు
పరమదాత

OWNER OF
MAJESTY AND
HONOUR

BLESSED IS THE NAME OF YOUR LORD, OWNER OF MAJESTY AND HONOUR
(Qur'an 55:78)

**ముఖ్య గమనిక : శాంతిబాట లోగో రిజిష్టర్ చేయబడింది.** *శాంతిబాట పేరుకు దగ్గరగా ఉండే విధంగా శాంతిబాటను అనుకరిస్తూ, శాంతిబాటతో సంబంధం ఉందని ప్రజలు బావించే విధంగా ఎవరైనా శాంతిబాట వ్యాసాలను గాని, మా సొసైటీచే ప్రచురించబడిన పుస్తకాలలోని విషయాలను గాని పబ్లిష్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.* ***మా దగ్గర నుండి వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండా, వీటిలోని ఏదైనా భాగాన్ని ఎవరైనా ప్రచురించడం లేదా జెరాక్స్ కాపీలు తీసి అమ్మడం చేస్తే ఇన్షా అల్లాహ్ వారిపైకూడా చట్టపరంగా ప్రొసీడ్ కావడం జరుగుతుంది.*** *మా వెబ్‌సైట్ నుండి శాంతిబాట సంచికలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ఎవరైనా చదువుకునే అవకాశాన్ని మాత్రమే కల్పించాముగాని, వీటిలోని విషయాలను* ***ప్రచురించు కోవడానికి ఎవరికీ ఎటువంటి హక్కులు ఇవ్వలేదు.*** *ఈ రాష్ట్రంలోనే కాదు, ఇండియాలోని ఏ రాష్ట్రంలోని ఏ పబ్లిషర్స్‌తోనూ మాకు ఎటువంటి సంబంధాలు లేవు. ఒకవేళ మా పాఠకులు అటువంటి ప్రచురణలను చూడటం జరిగితే, వెంటనే* ***మాకు తెలియజేయమని మనవి.*** *శాంతిబాటలో ప్రచురించబడుతున్న శీర్షికలను ఇన్షా అల్లాహ్ పుస్తకాలుగా* ***తెలుగు, English, ఉర్దూ****లో విడుదల చేయడానికి ప్రయత్నిస్తాము.*


# శాంతిబాట

**మాసపత్రిక** రూ.17/-

సంపుటి 4 సంచిక 9 ఏప్రిల్, 2013

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

**www.saanthibaata.net**

**www.saanthibaata.com**

Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**



**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri



**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Publishing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar, Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## ఏప్రిల్ 2013 (జుమాద అల్-అవ్వల్ - జమాద అల్ ఆఖిర్ హి. 1434)


5 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 60 - 64 ఆయత్‌లు ...

9 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** విశ్వాసుల మధ్య సంప్రదింపులు ...

12 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** తన సహచరులలో విశ్వాస పునాది ...

17 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం - **ఫాతిమా బిన్త్ అసద్**(రజి)

21 **బాలబాలికలకు ప్రత్యేకం :** ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మా'ఈల్(అ) ...

25 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని... (క్రిందటి సంచికతో పూర్తయ్యాయి)

28 **ఫిఖ్ :** ఫిఖ్ పట్ల సరియైన అవగాహన ఏర్పడితే, సూక్ష్మ బేధాలతో దూరంగా ఉన్న వారంతా దగ్గరౌతారు. ముస్లిములు ఐక్యంగా ఉండ గలుగుతారు.

35 **రాతియుగం - ఓ చారిత్రక అబద్ధం:** ఇప్పటి మన నాగరికతకు సంబంధించి ఏమి మిగిలి ఉంటాయి? ...

37 **మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు - 4 :** ఇమామ్ బాధ్యతలు



**సంవత్సర చందా :**

**రూ. 200/-**

(వివరాలకు పేజీ నెం. 34 చూడండి)

**Velugubaata**
**Educational Society**

D.No. 2-8-31, Kota Bazar

SAMALKOT - 533440

**East Godavari District**


మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ : **9491103017**

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*

**(ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )**

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

లేదా పై నంబర్‌కి **SMS** ద్వారా తెలియజేయండి



**ప్రచురించిన విషయాలపై సద్విమర్శలు గాని, అభిప్రాయాలు గాని ఫోన్‌లో స్వీకరించబడవని మనవి చేస్తున్నాము. వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపగలరు.**

***We don't accept any fund from within India and from abroad except from our team members and close friends who have Taqwa and whose money is earned in Halaal way as instructed by Our Holy Prophet <u>Muhammad</u>(s). We don't ask financial help from anybody at any time, except from <u>ALLAH</u>. If anybody wants to help us, they can try to increase our subscribers by joining their friends and relatives or can buy a fixed number of copies every month.***

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# వేసవి శలవులు

సంవత్సరం పాటు హైస్కూల్స్‌కి లేదా కాలేజీలకు వెళ్ళి చదువుకుని, పరీక్షలు పూర్తిచేసుకున్న తరువాత వచ్చే ఈ వేసవి శలవులంటే విద్యార్థులందరికీ చాలా ఇష్టం. పాఠ్య పుస్తకాలకు దూరంగా ఆటలలో లీనమై పోతారు. ఈ వేసవి శలవులలో కూడా డ్రాయింగ్, పెయింటింగ్, స్కేటింగ్ మొదలైన షార్ట్ టర్మ్ కోర్సులు ఎన్నింటినో నిర్వహిస్తున్నారు. కొద్ది సమయాన్ని వాటికి కూడా కేటాయించే వారున్నారు. ఈ శలవులు విద్యార్థులకే కాదు, వారి తల్లిదండ్రులకు కూడా ఇష్టమే. ఉదయమే గబగబా టిఫిన్లు, భోజనాలు తయారుచేసి కారియర్లు కట్టడం, స్కూల్ యూనిఫామ్‌లు ఉతికి సిద్ధం చేయడం, బూట్లకు పాలిష్ చేయడం, హోమ్ వర్క్ పూర్తి అయ్యేలా చూడటం మొదలైన ఎన్నో టెన్షన్ల నుండి తల్లులకు కూడా ఈ శలవులు ఎంతో రిలీఫ్ నిస్తాయి.

స్కూల్స్‌లో నేర్చుకునే జ్ఞానం చాలా అవసరమే. అయితే అది **చాలా అసంపూర్ణంగా ఉంది.** సమాజంలో ఎన్నో ఘోరాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఆలోచనలో పడింది. నైతిక విద్యను చిన్నతనం నుండి హైస్కూలు వరకూ బోధించాలని భావిస్తుంది. ఆలస్యమైనప్పటికీ తాము అందించే విద్య అసంపూర్ణంగా ఉందని అర్థం చేసుకుంది.

మన స్కూళ్లలో, కాలేజీల్లో నేర్పే చదువు నీతిని నేర్పడం లేదు. గొప్ప చదువు చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించుకుని కూడా సంతోషంగా బ్రతకలేక పోతున్నారు. ప్రజలలో అభద్రతాభావం చోటు చేసుకుంది. ఈ మధ్యనే తెనాలిలో జరిగిన సంఘటన సమాజ పరిస్థితికి దర్పణం పడుతుంది.

నిర్భయ ఉదంతం గురించి ఢిల్లీలో తీవ్ర ఆందోళన జరిగిన తరువాత కూడా అక్కడ అత్యాచారాలు ఆగలేదు. ఇంకా పెరిగినట్లు అనిపిస్తుంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలో కూడా రోజూ ఇటువంటివి ఎన్నో జరుగుతున్నాయి.

సైన్స్ అండ్ టెక్నాలజీ శీఘ్రంగా అభివృద్ధి చెందుతుంది. అదే వేగంతో సమాజంలో అరాచకాలు తగ్గడానికి బదులు అవి ఎందుకు పెరుగుతున్నాయి? క్రూరంగా ప్రవర్తించే వారిలో కూడా అత్యున్నత చదువులు చదివిన వారున్నారు.

అల్లాహ్ మనపై **'మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడం'** అనే ఓ ముఖ్యమైన బాధ్యతను ఉంచారు. మంచి అంటే ఏమిటి? చెడు అంటే ఏమిటి? ఈ విషయాలు తెలియని స్థితిలో ఉన్నారు సమాజంలోని అత్యధికులు. వారిలో విద్యావంతులూ ఉన్నారు. మరి మనం ఏమి చేయాలి? వారిని విమర్శిస్తూ గడిపేయడమేనా? మార్పు కోసం ప్రయత్నం చేయక్కర్లేదా?

రాత్రికి రాత్రే మార్పు వచ్చేయదు కదా! ఇప్పటి నుండి ప్రయత్నిస్తే కొన్ని సంవత్సరాలకైనా మంచి మార్పు రావచ్చు. కొన్ని సంవత్సరాలు అంటే ఎన్ని? చరిత్రలో స్వల్పకాలంలో జరిగిన ఓ యదార్థాన్ని ఇక్కడ చెప్పాలి.

1400 సంవత్సరాల క్రితం జరిగిన సంగతి. అనాగరిక స్థాయిలో అజ్ఞానంతో జీవించేవారు మరియు ప్రపంచంలోని ఇతర ప్రజలచే చులకన గావించబడిన వారు కేవలం 40 సంవత్సరాల లోపే ప్రపంచాన్ని జ్ఞానంతోనూ మరియు నైతిక విలువలతోనూ పరిపాలించే స్థాయికి చేరుకోగలిగారు. మానవీయతకు మారుపేరుగా నిలిచి, మనుషులనే కాకుండా జంతువుల క్షేమాన్ని కూడా పట్టించుకున్నారు.

ఈ యదార్థం గురించి స్పష్టంగా తెలిసాక కూడా, నేటి సమాజాన్ని సంస్కరించడం కోసం ఏమి చేయాలని ఆలోచించనవసరం ఏమైనా ఉందా? ఆ జాతి అనుసరించిన విధానాన్నే మనమూ అనుసరిస్తే సరిపోతుంది. ఆ జాతి అరబ్బు జాతి. మనదేశంలోని మలబారు ప్రాంతంతో వారికి వ్యాపార సంబంధాలు వందల సంవత్సరాలుగా ఉన్నాయి. ముహమ్మద్(స)వారు ఇస్లామ్ జీవన విధానాన్ని తెలియజేయడానికి పూర్వం, ఈ అరబ్బులు మలబారుకి వస్తున్నారని తెలియగానే, మలబారు ప్రజలు తమ స్త్రీలను ఇండ్లల్లో దాచేవారు. సంపదను భూమిలో పాతేవారు.

అయితే ముహమ్మద్(స)వారి ఇస్లామ్ బోధన ప్రారంభమైన కొన్ని సంవత్సరాల తరువాత వ్యాపారం కోసం వచ్చిన అరబ్బులను చూసి మలబారు ప్రజలు ఆశ్చర్యపోయారు. వారి సంస్కారం ప్రజలను నిశ్చేష్టులను చేసింది. స్త్రీల ముందు వారు తమ చూపులు దించుకునేవారు. సౌమ్యంగా మాట్లాడేవారు. వ్యాపార లావాదేవీలలో చాలా నిజాయితీగా వ్యవహరించేవారు. వారిలోని ఆ మార్పుకు మరియు ప్రపంచంలో అత్యున్నత స్థాయికి వారు చేరడానికి గల కారణం ఒక్కటే - అల్లాహ్ ప్రసంగం - ఖుర్'ఆన్.

**అదే ఖుర్'ఆన్ నేడు మన మధ్య కూడా ఉందిగా.** మరి అటువంటి అద్భుతం ఇప్పుడెందుకు జరగడం లేదు? **ఇన్షా అల్లాహ్ జరుగుతుంది!** ఖుర్'ఆన్‌ను తెరిచి దానిలో అల్లాహ్ మనందరినీ ఉద్దేశించి చెప్పిన విషయాలను అర్థం చేసుకుని, ఆయన ఆదేశాల ప్రకారం మన జీవన విధానాన్ని సరిచేసుకుంటే తప్పకుండా 1400 సంవత్సరాల క్రితం జరిగిన అద్భుతం తిరిగి జరుగుతుంది, ఇన్షా అల్లాహ్!

ఖుర్'ఆన్ కళ్ళ ఎదురుగా పెట్టుకుని దానిని విశ్వసించకుండా ఉంటే మార్పు ఎలా సంభవిస్తుంది? ఖుర్'ఆన్ ఆయత్‌ల విషయమై

మునాఫిక్‌లు వాదన చేస్తుంటే, మౌనంగా కూర్చున్న ముస్లిమ్ సమాజం సంక్షేమ దిశలో ఎలా పయనించ గలదు?

అన్నీ వదిలేసుకుని సన్యాసం స్వీకరించమని ఇస్లామ్ బోధించ లేదు. కష్టపడి పనిచేసుకుని, తద్వారా లభించిన దానితో చేసే భోజనం ఉత్తమమైనదని బోధించింది. కష్టపడి పనిచేసేవారి వల్లనే ఏ జాతైనా పురోగమిస్తుంది. సోమరిపోతులై పరాన్న జీవులుగా బ్రతికేవారి వలన సమాజానికి తీవ్ర నష్టం కలుగుతుంది.

**ప్రవక్త(స) చెప్పారు, "మీలో ఒకరు అడుక్కుంటూనే ఉంటాడు అతడు తన ముఖంపై కొంచెం కూడా మాంసం లేకుండా అల్లాహ్‌ను కలిసే వరకూ".**
**(సహీహ్ ముస్లిమ్, 2396, పుస్తకం 12 అధ్యాయం 35, సంపుటి 3)**

ధర్మాన్ని బోధించే బాధ్యత ఇస్లామ్‌లో ప్రతి ఒక్కరిపై ఉంది. కాబట్టి జ్ఞానాన్ని నేర్చుకోవాలి మరియు ఇతరులకు మనం నేర్పాలి. ధర్మాన్ని వ్యాపారంగా చేసుకుని ధర్మప్రచారం అంటూ ధర్మానికేదో మేలు చేసేస్తున్నట్లు, త్యాగం చేసేస్తున్నట్లు ఫోజులిచ్చేసి ఒకరి ముందు చేయిచాచడాన్ని మరియు జకాత్‌ని (పేదల సంక్షేమ నిధిని) లాక్కోవడాన్ని ఇస్లామ్ ఎంతమాత్రం బోధించ లేదు.

**ఈ వేసవి శలవులు మీ జీవితంలో ఓ ముఖ్య మార్పుకి ఇన్షా అల్లాహ్ కారణం కావాలని కోరుకుంటున్నాము.** కొత్త సైకిల్ కావాలనో, కొత్త డ్రెస్ కావాలనో లేదా కొత్త సెల్‌ఫోన్ కావాలనో మీ తల్లిదండ్రులను అడగడానికి బదులు, ఈ సంవత్సరం ఖుర్‌ఆన్ గ్రంథం కొనమని చెప్పండి. వీలైతే తఫ్సీర్ ఇబ్నె కసీర్‌ను కొనిమ్మమని అడగండి. మీరు దానిని చదవండి. మీ కుటుంబ సభ్యులకు చదివి వినిపించండి. సందేహాలను మీ మస్జిద్ ఇమామ్‌గారిని  అడిగి నివృత్తి చేసుకోండి.

**ఖుర్‌ఆన్‌లో యదార్థగాథలు ఎన్నో ఉన్నాయి. మీరు రొటీన్‌గా చదివే ఎన్నో కథల పుస్తకాలు ఇవ్వలేని గొప్ప అనుభవాన్ని ఖుర్‌ఆన్ ఇస్తుంది. హదీస్ గ్రంథాలలో వేల సంఖ్యలో ముహమ్మద్(స)వారి బోధనలున్నాయి.**

మీ తల్లిదండ్రులు రైతులైతే, పంటలపై జకాత్ ఎలా ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వాలి మొదలైన విషయాలు తెలుసుకుని వారికి వివరించండి. ఆ విధంగా ఆచరిస్తే పంటలను ఎన్నో కీడుల నుండి రక్షించుకోవచ్చని వారికి అర్థమౌతుంది. ముహమ్మద్(స)వారు వ్యవసాయ విషయంలో ఏయే రకమైన లావాదేవీల నుండి నిరోధించారో తెలుసుకోండి.   ఒకవేళ మీ తల్లిదండ్రులు వ్యాపారస్థులు అయితే వ్యాపారాలు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ప్రకారం ఎలా చేయాలో, ఏయే వ్యాపార లావాదేవీలకు దూరంగా ఉండాలని ముహమ్మద్(స)వారు స్పష్టంగా బోధించారో ఆ విషయాలను తెలుసుకుని మీ పేరెంట్స్‌కి తెలియజేయండి.

ప్రవక్త(స)వారి మంచి నడవడిక గురించి హదీస్‌ల నుండి తెలుసుకుని, వాటిని ఆచరణలో పెడితే, మీ తోటి విద్యార్థులు మీ పట్ల ఆకర్షితులౌతారు. అల్లాహ్ మార్గం గురించి అప్పుడు మీరు వారికి వివరించవచ్చు. అదే దావా. అంతేగాని దావా కొరకు ప్రత్యేకంగా ఏ కోర్సులూ అవసరం లేదు. కావలిసింది జ్ఞానం. అది ఖుర్‌ఆన్‌లో  మరియు హదీస్‌లలో ఉంది.

ప్రతీ రోజూ మీరు టీచర్ పర్యవేక్షణలో ఒక సిలబస్ ప్రకారంగా కొద్దికొద్దిగా ఓ క్రమంలో ఎలా విద్య నేర్చుకుంటున్నారో, అదే విధంగా ఉత్తమ జీవన విధానాన్ని ఖుర్‌ఆన్ నుండి నేర్చుకోండి. రోజూ కాస్సేపు మీ ఇంటిలో లేదా మీ మస్జిద్‌లో చదువుతూ ఉంటే, అల్లాహ్ మీకు జ్ఞానాన్ని అనుగ్రహించి మేలు చేయవచ్చు.

'ఖుర్‌ఆన్' పట్ల జ్ఞానం మీ స్థాయిని పెంచుతుంది. ఖుర్‌ఆన్‌ను వినడంతోనే సరిపెట్టుకోవద్దు. ప్రతీరోజు చదవడం అలవాటు చేసుకోండి. మీ జ్ఞానానికి తగిన స్థాయిలో అర్థమౌతుంది. అర్థంకాని విషయాలు, మీ పరిధిలో లేని విషయాల గురించి వర్రీ కావద్దు. అల్లాహుతాలా ఖుర్‌ఆన్ ద్వారానే సన్మార్గాన్ని (మంచి మార్గాన్ని) ఇస్తారు. మనకు ఇతర మత గ్రంథాల అధ్యయనం అవసరం లేదు.

"... **ఆయన** (అల్లాహ్) **దీనితో** (ఖుర్‌ఆన్‌తో) **తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు** ..." (ఖుర్‌ఆన్ 39:23)

"ఏమీ? వాస్తవానికి మేము నీపై అవతరింప జేసిన **ఈ గ్రంథం (ఖుర్‌ఆన్) వారికి వినిపించ బడుతుంది కదా! ఇది వారికి చాలదా?** నిశ్చయంగా ఇందులో విశ్వసించే ప్రజలకు కారుణ్యం మరియు హితబోధలున్నాయి." (ఖుర్‌ఆన్ 29:51)

ఖుర్‌ఆన్ సరిపోతుంది. ఖుర్‌ఆన్ పఠిస్తే, మీరు పఠించే ప్రతీ అక్షరానికి సవాబ్ లభిస్తుంది. **మీ చదువులు నిర్లక్ష్యం చేసుకోవద్దు** (శాంతిబాట జూలై 2012 సంచిక చూడండి) సైన్స్ అండ్ టెక్నాలజీ కానివ్వండి, ఇంజినీరింగ్, మెడిసిన్ ఏదైనా కానివ్వండి, **చదువులో ఉన్నత స్థాయిని లక్ష్యంగా చేసుకుని చదవండి.** ఖుర్‌ఆన్ మరియు సున్నత్ జ్ఞానంతో మీ చదువును **పరిపూర్ణం చేసుకోండి.** అప్పుడు మీరు చదివిన చదువును సరియైన విధానంలో ఉపయోగించుకో గలుగుతారు. సమయాన్ని వృథా చేసుకోవద్దు. ప్రోగ్రామ్‌ల అవసరం లేదు.

ఈ శలవులలో క్రమం తప్పకుండా మస్జిద్‌లకు వెళుతూ ఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేయండి. తదనుగుణంగా ఆచరించండి. ఇన్షా అల్లాహ్, **ఈ వేసవి శలవులు మీలో ఓ గొప్ప మార్పును తీసుకువస్తాయి.**

**శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

29

البقرة

## ఖుర్'ఆన్ తఫ్సీర్

**2. సూరహ్ అల్-బఖరా**

( గత సంచిక తరువాయి )

ఇస్రాయీలీయులు అల్లాహ్ ఆదేశించిన 'హిత్తతున్' పదాన్ని మార్చినందుకు శిక్షింపబడ్డారు. మరియు ఆ పదానికి బదులుగా తమ స్వంత పదాలను ఉపయోగించారు, అంటే దాని అర్థాన్నే వక్రీకరించేసారు. ముస్లిమ్ విద్వాంసుల (ఫుఖహా) అభిప్రాయాన్ని బట్టి, దివ్య ఖుర్'ఆన్ లోని ఓ పదంగాని, హదీస్‌లలోని ఓ పదంగాని లేక దివ్యాదేశానికి చెందిన ఏ పదాన్ని అయినా మార్చడానికి లేదా దాని యొక్క అసలు అర్థం మారే విధంగా వక్రీకరించడానికి అనుమతి లేదు.

అర్థం మారకపోయినా సరే, వాటి స్థానంలో వేరే పదాలను ఉపయోగించ కూడదు. ఉదాహరణకు 'అజాన్'లో మన స్వంత పదాలు చేర్చడానికి లేదు. హదీస్‌లో ఎలా చెప్పబడిందో అలాగే చెప్పాలి. అదే విధంగా సలాత్ (నమాజ్)లో 'సనా', 'అత్తహియ్యాతు', 'ఖునూత్' మొదలైన వాటిలో రుకూ, సజ్దాలో అల్లాహుతాలను కీర్తించే పదాలు హదీస్‌లలో ఎట్లా చెప్పబడ్డాయో అదే విధంగా చెప్పాలి.

కాబట్టి ఈ నియమం ఖుర్'ఆన్‌లోని ప్రతీ పదానికి వర్తిస్తుంది. అంతేకాకుండా ఖుర్'ఆన్ పఠించేవారికి, వారు పఠించే ప్రతీ అక్షరానికి పుణ్యం లభిస్తుందని తెలిసిన విషయమే. కాబట్టి అల్లాహ్ ప్రసంగమైన ఖుర్'ఆన్ పదాలను యథాతథంగా చదవాలి.

ఒక సందర్భంలో ఓ హదీస్‌లో 'నబీ' అనే పదానికి బదులుగా 'రసూల్' అని ఓ వ్యక్తి పలికినప్పుడు, ప్రవక్త(స)వారు 'నబీ' అనే చెప్పమని చెప్పారు.

మనం ఒక హదీస్‌ను తెలిపేటప్పుడు అందులోని పదాలు ఎలా ఉన్నాయో అలాగే చెప్పాలి. అది చెప్పిన తరువాత మనం చెప్పే వివరణలో మన భాషలో లేదా వినేవారి భాషలో చెప్పవచ్చు.

కొన్ని ప్రసంగాలలో 'ఇమామ్'లు హదీస్‌లలో ఉండే సంభాషణలను యథాతథంగా కాకుండా స్వంతంగా చెబుతుంటారు. వాస్తవానికి హదీస్‌లో సంభాషణ ఒక విధంగా ఉంటే, వీరు తమ స్వంత డైలాగులు చెబుతుంటారు. అరబీ పదాలకు వేరే భాషలో అనువాదం చేయవచ్చు. కాని ఒరిజనల్‌లో లేని పదాలను పలక కూడదు. హదీస్‌లో ప్రస్తావించ బడిన ప్రత్యక్ష సంభాషణలను, వివరణలో పరోక్షంగా (Indirect) చెప్పవచ్చు. భావం ఒక్కటే కాదు, ఒరిజినాలిటీ పోకూడదు.

### 60వ ఆయత్ నుండి 64వ ఆయత్ వరకూ

**60.మరియు మూసా తన ప్రజలకు నీటి కొరకు ప్రార్థించినప్పుడు, మేము : "నీవు ఆ బండను నీ కర్రతో కొట్టు!" అని ఆదేశించాము. అప్పుడు దాని నుండి పన్నెండు ఊటలు ప్రవహించ సాగాయి. ప్రతీ తెగవారు తమ నీరు త్రాగే స్థలాన్ని కనుగొన్నారు. "అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆహారాన్ని తినండి త్రాగండి కానీ, భూమిలో కల్లోలం రేపుతూ దౌర్జన్యపరులుగా తిరగకండి."**

| اضْرِب | فَقُلْنَا | لِقَوْمِهِ | سْتَسْقَىٰ مُوسَىٰ | وَإِذِا |
|---|---|---|---|---|
| కొట్టు | (కావున) మేము అన్నాము | తన ప్రజల కొరకు | మూసా అడిగారు నీటి (కొరకు) | మరియు అప్పుడు |

| عَيْنًا | اثْنَتَا عَشْرَةَ | مِنْهُ | فَانْفَجَرَتْ | الْحَجَرَ | بِّعَصَاكَ |
|---|---|---|---|---|---|
| ఊటలు | పన్నెండు | దాని నుండి | అప్పుడు ప్రవహించాయి | ఆ రాతిని | నీ కర్రతో |

61. మరియు అప్పుడు మీరు : "ఓ మూసా! మేము ఒకే రకమైన ఆహారం తింటూ ఉండలేము. కావున భూమిలో ఉత్పత్తి అయ్యే ఆకు కూరలు, దోసకాయలు, వెల్లుల్లి, ఉల్లిగడ్డలు, పప్పుదినుసులు మొదలైనవి మా కొరకు పండించమని నీ ప్రభువును ప్రార్థించు" అని అన్నారు. దానికాయన : "ఏమీ? శ్రేష్ఠమైన దానికి బదులుగా అల్పమైన దానిని కోరుకుంటు న్నారా? మీరు ఏదైనా నగరానికి తిరిగిపొండి. నిశ్చయంగా, అక్కడ మీరు కోరేదంతా దొరుకుతుంది" అని అన్నాడు. మరియు వారు, తీవ్ర అవమానం మరియు దారిద్ర్యానికి గురి అయ్యారు. అదంతా వాస్తవానికి వారు, అల్లాహ్ సూచన (ఆయత్)లను తిరస్కరించిన దాని మరియు ప్రవక్తలను అన్యాయంగా చంపిన దాని ఫలితం. ఇదంతా వారు చేసిన ఆజ్ఞోల్లంఘన మరియు హద్దులు మీరి ప్రవర్తించిన దాని పర్యవసానం.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| وَاشْرَبُوْا | كُلُوْا | مَّشْرَبَهُمْ ؕ | اُنَاسٍ | كُلُّ | قَدْ عَلِمَ | | |
| మరియు త్రాగండి | తినండి | నీరు త్రాగేందుకు తమ స్థలాన్ని | ప్రజలు | అందరు | తెలుసు కున్నారు | | |
| الْاَرْضِ | فِي | تَعْثَوْا | وَلَا | اللّٰهِ | رِّزْقِ | مِنْ | |
| భూమి | లో | మరియు దౌర్జన్యం చేయవద్దు | | అల్లాహ్ ప్రసాదించిన జీవనోపాధి | | నుండి | |
| لَنْ | يٰمُوْسٰى | قُلْتُمْ | وَاِذْ | ٦٠ | مُفْسِدِيْنَ | | |
| ఎన్నడూ | ఓ మూసా! | నీవు చెప్పావు | మరియు అప్పుడు | 60 | కల్లోలాన్ని వ్యాపించేవారు | | |
| يُخْرِجْ | رَبَّكَ | لَنَا | فَادْعُ | وَّاحِدٍ | طَعَامٍ | عَلٰى | نَّصْبِرَ |
| ఉత్పత్తి జేయమని | నీ ప్రభువును | మా కొరకు | కావున ప్రార్థించు | ఒకటే (రకం) | ఆహారం | పై | సహిస్తూ ఉండలేము |
| وَقِثَّآئِهَا | بَقْلِهَا | مِنْ | الْاَرْضُ | تُنْۢبِتُ | مِمَّا | لَنَا | |
| మరియు దాని దోసకాయలు | దాని ఆకుకూరలు | నుండి | భూమి | పండించేవి | దాని నుండి | మా కొరకు | |
| اَتَسْتَبْدِلُوْنَ | قَالَ | وَبَصَلِهَا ؕ | وَعَدَسِهَا | وَفُوْمِهَا | | | |
| మీరు మార్చుకోవాలను కుంటున్నారా? | ఆయన అన్నారు | మరియు దాని ఉల్లిగడ్డలు | మరియు దాని పప్పుదినుసులు | మరియు దాని వెల్లుల్లి | | | |
| مِصْرًا | اِهْبِطُوْا | خَيْرٌ ؕ | هُوَ | بِالَّذِيْ | اَدْنٰى | هُوَ | الَّذِيْ |
| పట్టణాని (కి) | వెళ్ళండి | మేలైనది | అది | (దాని)తో ఏదైతే | అల్పమైన (దో) | అది | ఏదైతే |
| عَلَيْهِمُ | وَضُرِبَتْ | سَاَلْتُمْ ؕ | مَّا | لَكُمْ | فَاِنَّ | | |
| వారిపై | మరియు కొట్టబడ్డారు (గురయ్యారు) | మీరు అడిగినది | ఏది | మీ కొరకు | కావున నిశ్చయంగా | | |
| مِّنَ اللّٰهِ | | وَبَآءُوْ بِغَضَبٍ | وَالْمَسْكَنَةُ ۗ | الذِّلَّةُ | | | |
| అల్లాహ్ | నుండి | మరియు వారు పైకి తెచ్చుకున్నారు ఆగ్రహాన్ని | మరియు దారిద్ర్యం | తీవ్ర అవమానం | | | |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| اللّٰهِ | بِاٰيٰتِ | يَكْفُرُوْنَ | كَانُوْا | بِاَنَّهُمْ | ذٰلِكَ | | |
| అల్లాహ్ యొక్క | సూచనలను | తిరస్కరించేవారు | చేసేవారు | ఎందుకంటే వారు | అది | | |
| بِمَا | ذٰلِكَ | الْحَقِّ | بِغَيْرِ | النَّبِيّٖنَ | وَيَقْتُلُوْنَ | | |
| ఎందుకంటే | అది | ఆ హక్కు | లేకుండా | ప్రవక్తలు | మరియు చంపేవారు | | |
| اٰمَنُوْا | الَّذِيْنَ | اِنَّ | ﴿٦١﴾ | يَعْتَدُوْنَ | وَّكَانُوْا | عَصَوْا | |
| విశ్వసించారో | ఎవరైతే | నిశ్చయంగా (61) హద్దు మీరేవారు | | | మరియు అయ్యారు | అవిధేయత చూపారు | |
| اٰمَنَ | مَنْ | وَالصّٰبِـِٕيْنَ | وَالنَّصٰرٰى | هَادُوْا | وَالَّذِيْنَ | | |
| విశ్వసించి | నుండి | మరియు సాబిఈన్లు | మరియు నసారాలు | యూదులు అయ్యారో | మరియు ఎవరైతే | | |
| اَجْرُهُمْ | فَلَهُمْ | صَالِحًا | وَعَمِلَ | الْاٰخِرِ | وَالْيَوْمِ | بِاللّٰهِ | |
| వారి ఫలితం | కావున వారికొరకు | సత్కార్యాలు | మరియు ఆచరించారో | అంతిమ | మరియు ఆ దినం | అల్లాహ్ పట్ల | |
| ﴿٦٢﴾ | يَحْزَنُوْنَ | هُمْ | وَلَا | عَلَيْهِمْ | خَوْفٌ | وَلَا | عِنْدَ رَبِّهِمْ |
| (62) | దు:ఖ పడేవారు | మరియు లేదు | వారిపై | భయం | మరియు లేదు | వారి ప్రభువు | వద్ద |
| خُذُوْا | الطُّوْرَ | فَوْقَكُمُ | وَرَفَعْنَا | مِيْثَاقَكُمْ | اَخَذْنَا | وَاِذْ | |
| పట్టుకోండి | తూర్ పర్వతాన్ని | మీ మీదకు | మరియు మేము లేపాము | మీ వాగ్దానాన్ని | మేము తీసుకున్నాము | మరియు అప్పుడు | |
| لَعَلَّكُمْ | فِيْهِ | مَا | وَّاذْكُرُوْا | بِقُوَّةٍ | اٰتَيْنٰكُمْ | مَآ | |
| బహుశా వారు | దానిలో | ఏది | మరియు జ్ఞాపకం చేసుకోండి | ధృఢంగా | మేము మీకు ఇచ్చాము | ఏది | |
| مِّنْۢ بَعْدِ | تَوَلَّيْتُمْ | ثُمَّ | ﴿٦٣﴾ | تَتَّقُوْنَ | | | |
| తరువాత | మీరు విముఖులై పోయారు | తరువాత | (63) | తఖ్వా కలవారు (కావచ్చు) | | | |

62. నిశ్చయంగా, విశ్వసించినవారు (మోమిన్లు) గాని, యూదులు గాని, క్రైస్తవులు గాని, సాబిఈన్లు గాని అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారికి, వారి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం ఉంటుంది మరియు వారికి ఎలాంటి భయమూ ఉండదు. మరియు వారు దు:ఖపడరు కూడా!

63. మరియు మేము తూర్ పర్వతాన్ని ఎత్తి మీపై నిలిపి, మీ చేత చేయించిన గట్టి వాగ్దానాన్ని, అప్పుడు మేము : "మీకు ప్రసాదిస్తున్న దానిని (గ్రంథాన్ని) ధృఢంగా పట్టుకోండి. అందులో ఉన్నదంతా జ్ఞాపకం ఉంచుకోండి. బహుశా మీరు భయభక్తులు గలవారు కావచ్చు!" అని అన్నాము.

64. ఆ తరువాత కూడా మీరు వెనుతిరిగి పోయారు.

అయినప్పటికీ అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు ఆయన కరుణ మీపై లేకుంటే, మీరు నష్టానికి గురియైన వారిలో చేరేవారు.

| ذٰلِكَ | فَلَوْلَا | فَضْلُ اللّٰهِ | عَلَيْكُمْ | وَرَحْمَتُهٗ |
|---|---|---|---|---|
| అది | కావున లేనట్లయితే | అల్లాహ్ యొక్క అనుగ్రహం | మీపై | మరియు ఆయన కారుణ్యం |
| لَكُنْتُمْ | مِّنَ | الْخٰسِرِيْنَ ٦٤ | | |
| నిశ్చయంగా మీరు అయి ఉండేవారు | నుండి | నష్టానికి గురియైనవారు (64) | | |

## సూరహ్ అల్-బఖరా (60 నుండి 64 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 449. నీటి కొరకు అడిగారు / ప్రార్థించారు | اِسْتَسْقٰى | 469. పెంచాలి / పండించాలి | تُنْبِتُ (ن ب ت) |
| 450. కొట్టు | اِضْرِبْ | 470. ఆకులు / కాయగూరలు | بَقْلٌ |
| 451. కర్ర | عَصًا | 471. దోసకాయలు | قِثَّآءٌ |
| 452. శిల, రాయి | حَجَرْ | 472. గోధుమలు | فُوْمٌ |
| 453. ముందుకు ప్రవహించాయి | اِنْفَجَرَتْ (ف ج ر) | 473. ఒకరకమైన పప్పుదినుసులు | عَدَسٌ |
| 454. పన్నెండు | اِثْنَتَا عَشْرَةَ | 474. ఉల్లిపాయలు | بَصَلٌ |
| 455. నీటి ఊట | عَيْنًا (عُيُوْنٌ) | 475. మీరు మార్పిడి చేస్తున్నారు | تَسْتَبْدِلُوْنَ (ب د ل) |
| 456. తప్పనిసరిగా | قَدْ | 476. అల్పం (స్థాయిలో) | أَدْنٰى |
| 457. తెలుసు | عَلِمَ (ع ل م) | 477. మేలైనది, మంచిది | خَيْرٌ |
| 458. అంతా / అందరూ | كُلُّ | 478. పెద్ద పట్టణం, నగరం | مِصْرٌ |
| 459. ప్రజలు | أُنَاسٌ | 479. మీరు కోరినది / అడిగినది | سَأَلْتُمْ |
| 460. త్రాగు స్థలం, నీటి కొరకు స్థలం | مَشْرَبٌ | 480. కప్పబడింది / కొట్టబడింది | ضُرِبَتْ (ض ر ب) |
| 461. తినండి | كُلُوْا | 481. తీవ్ర అవమానం | ذِلَّةٌ |
| 462. త్రాగండి | اِشْرَبُوْا (ش ر ب) | 482. పేదరికం | مَسْكَنَةٌ |
| 463. దౌర్జన్యం చేయకండి | لَا تَعْثَوْا (ع ث و) | 483. వారే స్వయంగా | بَآءُوْا |
| 464. ఆహారం | طَعَامٌ | 484. చంపారు | يَقْتُلُوْنَ (ق ت ل) |
| 465. ఒకటి | وَاحِدٌ | 485. ప్రవక్తలు | نَبِيّٖنَ |
| 466. కాబట్టి ప్రార్థించు | فَادْعُ (د ع و) | 486. వారు అవిధేయత చూపారు | عَصَوْا |
| 467. మా కొరకు | لَنَا | 487. హద్దు మీరేవారు | يَعْتَدُوْنَ (ع د و) |
| 468. తీయండి | يُخْرِجْ (خ ر ج) | 488. యూదులుగా మారారు | هَادُوْا |

| | |
|---|---|
| **489.** నసారా | نَصَارٰی |
| **490.** సాబియన్లు | صَابِئِيْنَ |
| **491.** అంతిమ దినం | يَوْمُ الْاٰخِرَةِ |
| **492.** చేయుట | عَمِلَ |
| **493.** మంచి పనులు, సత్కార్యాలు | صَالِحًا |
| **494.** వారి ఫలితం | أَجْرُهُمْ |
| **495.** ప్రభువు వద్ద | عِنْدَ رَبٌ |
| **496.** దు:ఖపడటం | حَزِنَ |
| **497.** మేము తీసుకున్నాము | أَخَذْنَا |
| **498.** వాగ్దానం | مِيْثَاقٌ |
| **499.** మేము లేపాము | رَفَعْنَا (ر ف ع) |
| **500.** పై, మీద | فَوْقَ |
| **501.** తూర్ అని పిలవబడే పర్వతం | طُوْرٌ |
| **502.** మీరు విముఖులయ్యారు | تَوَلَّيْتُمْ |
| **503.** అయితే, బహుశా | لَوْ |

## పాఠకులకు మనవి

**వచ్చే నెలలో** (మే, 2013) **శాంతిబాట ప్రచురించబడదు.**

బదులుగా రెండు నెలల సంచికలను కలిపి ఒక సంయుక్త సంచిక (మే-జూన్, 2013)

రమదాన్ ప్రత్యేక సంచికగా జూన్, 2013 రెండవ వారంలో విడుదల చేయబడుతుంది, ఇన్షా అల్లాహ్.

---

ధనవంతుల ఐశ్వర్యంలో ఉంచబడిన పేదవాని అమానత్

## జకాత్

**ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో ఒకటి.**

తొలి ఖలీఫా అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు జకాత్ ఇవ్వడానికి నిరాకరించిన ముస్లిములపై యుద్ధాన్ని ప్రకటించారు.

సమాజం నుండి పేదరికాన్ని నిర్మూలించే జకాత్,
మన దేశంలో అల్లాహ్ ఆదేశించినట్లు మరియు ముహమ్మద్(స)వారు ఆచరించి చూపిన విధంగా పంపిణీ కావడం లేదు. ఈ విధంగా ఎన్నో దశాబ్దాలుగా జరుగుతుంది. స్వార్థపరులు తమ జేబులలో వేసుకుంటున్నారు.

కొంతమంది జ్ఞానులు ముస్లిమ్ సమాజాన్ని తప్పుదోవ పట్టించారు.

ఈ ఘోరం గురించి తెలిసిన చాలామంది బలహీన జ్ఞానులు మౌనంగా ఉన్నారు.

# జకాత్

మూడు భాషలలో విడివిడిగా **(తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్)**

వెల : 15/-

(ఎక్కువ సంఖ్యలో పుస్తకాలు కావలిసినవారు మే 31, 2013 లోపు సంప్రదించండి)

**ఎంత ఐశ్వర్యం ఉంటే జకాత్ చెల్లించాలి? ఎవరికి చెల్లించాలి? ఏ విధంగా దానిని పంపిణీ చేయాలి? జకాత్‌లో మినహాయించ బడేవి ఏమిటి? ఏ విధంగా చెల్లించాలి? ఎవరికి ఇవ్వకూడదు? మొదలైన ఎన్నో విషయాలను స్పష్టమైన ప్రామాణిక ఆధారాలతో సగటు ముస్లిమ్‌కి అర్థమయ్యేలా ఓ చిరుపుస్తకాన్ని ఇన్షా అల్లాహ్ జూన్, 2013లో విడుదల చేస్తున్నాము.**

ఇది 'శాంతిబాట' ప్రచురణ. ప్రచురణ పూర్తయ్యాక ప్రచురణకైన ఖర్చును బట్టి, ఇన్షా అల్లాహ్ ధర తగ్గవచ్చు. ఇది ప్రజా ప్రయోజనం కోసం ప్రచురించ బడుతుంది. మా పాలసీ ప్రకారంగానే ఈ పుస్తకం కొరకు ఎవరి ఆర్థిక సహాయం తీసుకోలేదు.

**అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా, సున్నత్ ప్రకారం ఈ జకాత్ పంపిణీ జరిగేలా చేసుకోగలిగితే,**
**ఇన్షా అల్లాహ్ ముస్లిమ్ సమాజానికి మేలు జరుగుతుంది.**

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

రజి అల్లాహుతాలా అన్‌హు

13

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(క్రిందటి సంచిక తరువాయి ...)

## విశ్వాసుల మధ్య సంప్రదింపులు ...

అబూబక్ర్(రజి)వారికి మరియు ఉమర్(రజి)వారికి మధ్య సంప్రదింపులు జరుగుతుండేవి. ముఖ్యమైన నిర్ణయాల విషయంలో అందరినీ సంప్రదించేవారు. ఉమర్(రజి)వారి వంటి సహచరుడు తనతో ఉండటం అబూబక్ర్(రజి)వారికి పరిపాలనలో ఎంతో ప్రయోజనం చేకూర్చింది.అదే విధంగా అబూబక్ర్(రజి)వారు తొలి ఖలీఫాగా వేసిన పునాది ఉమర్(రజి)వారికి తన పరిపాలనా కాలంలో చాలా మేలు చేసింది.

ముహమ్మద్(స)వారు తన ఉమ్మత్‌ను ఉద్దేశించి, ఖుర్ఆన్ మరియు సున్నత్‌తో పాటు, సన్మార్గం పొందిన ఖలీఫాలను అనుసరించమని చెప్పారు. ముహమ్మద్(స)వారు చెప్పిన ఆ మాటల అర్థం వీరిద్దరినీ చూస్తే బోధపడుతుంది.

కొన్ని నిర్ణయాల పట్ల ఒకరినొకరు నిలదీసుకున్న సందర్భాలు ఉన్నాయి. వాటిని ఒకరినొకరు విభేదించుకున్నట్లుగా ఎవరైనా భావించవచ్చు. కాని ధర్మం విషయంలో ఏ చిన్న పొరపాటు రాకుండా ఉండేందుకు వీరిద్దరూ ఒకరినొకరు సహకరించుకునేవారని ఆలోచించే వారికి అర్థమౌతుంది.

ఉమర్(రజి)వారిని అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఒక సందర్భంలో మందలించడాన్ని ఇదివరకే చెప్పుకున్నాం. ఇప్పుడు మరో సంఘటనను చెప్పుకుందాం. అహంకారం ఏ కోశానా లేని నాయకులుగా వీరిద్దరూ ఎలా వ్యవహరించారో, వారి ఔన్నత్యం ఏ స్థాయిలో ఉండేదో ఈ సంఘటన మనకు స్పష్టం చేస్తుంది.

అల్-అఖ్రా బిన్ హాబిస్(రజి) మరియు 'ఉయైనహ్ బిన్ హిస్న్(రజి) ఉపయోగంలో లేని ఓ ప్రభుత్వ భూమిపై తమకు యాజమాన్యం హక్కులు కల్పించమని ఖలీఫా అబూబక్ర్(రజి)వారిని అభ్యర్థించారు.

'ఓ రసూలుల్లాహ్(స)వారి ఖలీఫా! మేము పల్లంలో ఉన్న చిత్తడినేల ప్రక్కన నివశిస్తున్నాము. దానిలో గడ్డి లేదు. మరియు అది ఉపయోగం లోకి తేబడలేదు. మీరు గనుక అలా చేయడం సరియైనదని భావిస్తే, మీరు ఆ భూమిపై మాకు యాజమాన్యాన్ని ఇస్తే, మేము దానిని దున్నడానికి లేదా దానిలో పంటలు పండించడానికి ఇక ఇక్కడి నుండి, బహుశా అల్లాహ్ ఆ భూమిని ఉపయోగకరంగా చేయవచ్చు."

తనతోపాటు ఉన్నవారితో అబూబక్ర్(రజి)వారు అన్నారు, "ఆ భూమి వాస్తవానికి చిత్తడి నేల అయితే, మరియు అది ఏ ప్రయోజనం కొరకూ ఉపయోగించ బడనిది అయితే, ఈ ఇద్దరూ చెప్పిన విషయానికి సంబంధించి మీరేమి చెబుతారు?"

ఉపయోగంలో లేని ఓ భూమిని, అల్లాహ్ ఈ రోజు నుండి ఉపయోగం లోకి తేవచ్చని భావించి వారు కూడా ఆ ఇద్దరి వ్యక్తులకు ఆ భూమిపై యాజమాన్యాన్ని ఇవ్వడానికి సమ్మతించారు. వారు కోరినట్లు ఆ ఇద్దరికీ అబూబక్ర్(రజి) యాజమాన్యాన్ని ఇచ్చారు. మరియు దాని నిమిత్తం ఓ దస్తావేజు తయారు చేయించారు, అయితే ఓ షరతు పెట్టారు. దానిపై మొట్టమొదట సాక్షి సంతకం ఉమర్(రజి)వారు చేయాలి.

అక్కడ హాజరైనవారిలో ఉమర్(రజి)వారు లేరు. కాబట్టి ఆ ఇద్దరు వ్యక్తులు ఉమర్(రజి)వారు ఎక్కడున్నారో వెదకడానికి బయలుదేరారు. ఆ భూమి తమ స్వంతం కాబోతుందనే ఉత్సాహంలో ఉన్నారు వారు.

వారు ఉమర్(రజి)వారిని చేరేసరికి, ఆయన తన ఒంటెకు దేనినో పూస్తున్నారు.

వారు అన్నారు, "నిశ్చయంగా, అబూబక్ర్(రజి)వారు ఈ దస్తావేజు లోని విషయాలపై మిమ్మల్ని సాక్షిగా ఉండటాన్ని కోరారు. మమ్మల్ని వినిపించ మంటారా? లేక మీరు చదువుతారా?"

ఉమర్(రజి)వారు ఇలా సమాధానం చెప్పారు: "మీరు నేను ఉన్న పరిస్థితిని చూస్తున్నారు కాబట్టి, కావాలనుకుంటే, నా కొరకు మీరు చదవవచ్చు. మరియు కావాలనుకుంటే, నేను (పని) పూర్తిచేసుకునే వరకూ ఆగండి మరియు నేను మీకొరకు గట్టిగా చదువుతాను."

ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పని పూర్తి చేసుకోవాలనే తపనలో ఉన్నారు వారిద్దరు. కాబట్టి వారు అన్నారు, "బదులుగా, మేమే దానిని చదువుతాము."

ఉమర్(రజి)వారు ఆ పత్రాన్ని చదవడం వినిన తరువాత, ఆయన వారి చేతుల నుండి దానిని లాక్కొని మరియు దానిపై వ్రాసిన దానిని తన ఉమ్మితో చెరిపేసారు.

వారిద్దరూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు. అంతేకాకుండా ఆయనతో కఠినంగా మాట్లాడారు. ఉమర్(రజి) చెప్పారు, **"నిశ్చయంగా రసూలుల్లాహ్(స) మీకు ఐశ్వర్యాన్ని ఏర్పాటు చేసి ఉండేవారు మీరు నిజాయితీగల ముస్లిములుగా ఉండేలా ప్రోత్సహించ డానికి. అప్పట్లో ఇస్లామ్ బలహీనంగా ఉండేది. మరో విధంగా చెప్పాలంటే, ఈ రోజు అల్లాహ్ ఇస్లామ్‌కి గౌరవం కలుగజేశారు మరియు దానిని బలంగా చేశారు. కాబట్టి వెళ్ళి కష్టపడి పనిచేయండి."**

ఆ ఇద్దరూ అబూబక్ర్(రజి)వారి దగ్గరికి వెళ్ళి ఫిర్యాదు చేశారు మరియు ఆయనతో "అల్లాహ్ సాక్షి! మాకు తెలియడం లేదు ఖలీఫా ఎవరో, మీరు? లేక ఉమర్?" అన్నారు.

వారి మాటలకు జవాబుగా అబూబక్ర్(రజి)వారు ఇలా చెప్పారు.

**"లేదు. ఆయన కోరి ఉంటే, ఆయనే ఖలీఫా అయి ఉండేవారు."**

ఏమి ఔన్నత్యం!

అబూబక్ర్(రజి)వారు కోపగించలేదు. నాయకుడిని నేనా? లేక నీవా? అని ఉమర్(రజి)వారిని మందలిస్తారని వారు భావించారో లేదో మనకు తెలియదు గాని ఇన్షా అల్లాహ్ **నేటి మన నాయకులు అయితే మాత్రం నిస్సందేహంగా అలాగే అంటారు.**

ఆ ఇద్దరు వ్యక్తులు ఫిర్యాదు చేసిన తరువాత ఉమర్(రజి)వారు అక్కడికి వచ్చారు. ఆయన కోపంగా ఉన్నారు. ఆయన అబూబక్ర్(రజి)తో చెప్పారు, "నాకు చెప్పండి ఈ ఇద్దరికి మీరు ఇచ్చిన భూమి గురించి. అది ప్రత్యేకంగా మీకు చెందినదా లేక అది ఉమ్మడిగా ముస్లిము లందరికీ స్వంతమైనదా?"

అబూబక్ర్(రజి) : "నేను ఆ సమయంలో నాతో ఉన్న వీరిని సంప్రదించాను మరియు నేను భూమిని ఈ ఇద్దరికీ ఇవ్వవచ్చని వారు సలహా ఇచ్చారు."

ఉమర్(రజి) : "మీరు ఆ సమయంలో మీతో ఉన్న వారిని సంప్రదించి నప్పటికీ, ముస్లిములంతా వారి సలహాతో సంతోషిస్తారా?"

అబూబక్ర్(రజి) : **"వాస్తవానికి నేను మీకు చెప్పాను, మీ బలంతో, మీరే ఎక్కువగా సరిపోతారు ఈ పదవికి (ఖలీఫాగా) నా కంటే, కాని మీరు దానిని నాపై బలవంతంగా ఉంచారు"**

ఇస్లామీయ పరిపాలనలో మెజార్టీ అభిప్రాయం కంటే, సరియైన అభిప్రాయం ఒకరు చెప్పినా, ఆ ఒకరి మాటనే స్వీకరించడం జరుగుతుంది. ప్రజాస్వామ్య పరిపాలనను ప్రజలకు ప్రయోజనకారిగా ఉండేలా పరిపాలించారు ఖలీఫాలు.

**మరి నేటి మన నాయకులు ఖలీఫాల నుండి ఎంత నేర్చుకున్నారు?**

వారు నేర్చుకోక పోయినా, ప్రజలైనా వారికి నేర్పించాలి.

వీరిద్దరి సంప్రదింపుల నుండి ఒక విషయం స్పష్టంగా అర్థమౌతుంది. చిన్న చిన్న పొరపాట్ల నుండి వీరిద్దరూ ఒకరినొకరు ఎలా కాపాడుకున్నారో!

ఇద్దరి సంకల్పమూ ఒక్కటే - ధర్మాన్ని సరియైన విధంగా ఆచరణలో పెట్టాలి. ఆ విధంగా రాబోవు పరిపాలకులకు ఉదాహరణలుగా నిలిచారు. ముహమ్మద్(స)వారు వీరిద్దరికీ ఎంత గొప్ప శిక్షణ ఇచ్చారో వీరి పరిపాలన మనకు తెలియజేస్తుంది.

సత్కార్యాలు చేయడంలో ఈ ఇద్దరూ ఎలా పోటీ పడేవారో వచ్చే సంచికలో ఇన్షా అల్లాహ్ చెప్పుకుందాం. ఎందుకంటే ఉమర్(రజి)వారి పరిపాలనపై అబూబక్ర్(రజి)వారి ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఇవి అవసరం.

ముందుగా ఒక ముఖ్య విషయం ఇక్కడ చెప్పవలసి ఉంది. అది అబూబక్ర్ మరియు ఉమర్ (రజి అల్లాహు అన్‌హుమా) తీసుకున్న నిర్ణయం. ఇస్లామీయ చరిత్రలో ముహమ్మద్(స)వారి మరణం తరువాత ఆయన(స)కు బాగా ప్రియమైన సన్నిహిత అనుచరులిద్దరూ తీసుకున్న నిర్ణయం - 'ఖుర్ఆన్'ను ఒక పుస్తక రూపంలో సేకరించడం.

ముహమ్మద్(స)వారు జీవించి ఉండగా ఖుర్ఆన్ పుస్తక రూపంలో లేదు. చివరి ఖుర్ఆన్ ఆయత్ అవతరించిన కొంత కాలానికే ప్రవక్త(స)వారి మరణం సంభవించింది.

ఆయన(స) జీవించి ఉండగా ఏదైనా ఆయత్ అవతరించినప్పుడు, జిబ్రీల్(అ)వారు ఆ ఆయత్‌ను ఏ సూరహ్‌లో ఏ ఆయత్ క్రింద ఉంచాలో తెలిపేవారు. ఆ విధంగా ఖుర్ఆన్ ఒక క్రమంలో సంపూర్ణంగా ఎందరో కంఠస్థం చేశారు.

ముహమ్మద్(స)వారి మరణం తరువాత మార్గభ్రష్టులతో జరిగిన యుద్ధం గురించి ఇప్పటికే వివిధ వ్యాసాల ద్వారా తెలపడం జరిగింది. మార్గభ్రష్టులతో జరిగిన ఆ యుద్ధంలో ఖుర్ఆన్‌ను కంఠస్థం చేసిన సహాబాలు ఎందరో చంపబడ్డారు. ఇదే విధంగా యుద్ధాలలో ఖుర్ఆన్ కంఠస్థం చేసినవారు (ఖుర్రా) చంపబడితే జరగబోవు ప్రమాదం గురించి మొట్టమొదట అర్థం చేసుకున్నవారు - ఉమర్(రజి)వారు.

ఉమర్(రజి)వారు అబూబక్ర్(రజి)వారితో ఖుర్ఆన్‌ను ఒక పుస్తక రూపంలో సేకరించడానికి ఆదేశించమని కోరారు. మొదట ఆయన దానికి ఇష్టపడలేదు. తరువాత దాని ప్రాముఖ్యత ఆయనకు అర్థమైంది.

ఈ విషయానికి సంబంధించి ఒక హదీస్‌ను దిగువున ఇస్తున్నాము.

జైద్ బిన్ సాబిత్(రజి)వారి ఉల్లేఖనం.

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు నాకు కబురు పంపారు, యమామ ప్రజలు (ముసైలమాకు వ్యతిరేకంగా యుద్ధం చేసిన చాలామంది సహాబాలు) చంపబడినప్పుడు. మరియు ఆయనతో ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు కూర్చుని ఉండటాన్ని చూశాను.

అబూబక్ర్(రజి)వారు అప్పుడు చెప్పారు: "ఉమర్ నా దగ్గరకు వచ్చారు మరియు చెప్పారు : 'యమామ యుద్ధం రోజున ఖుర్ఆన్‌ను కంఠస్థం చేసినవారిలో (ఖుర్రాలో) మరణాలు భారీగా ఉన్నాయి మరియు నేను భయపడుతున్నాను ఇతర యుద్ధరంగాలలో ఖుర్రాలో ఇంకా ఎక్కువ మరణాలు సంభవించవచ్చు. ఆ విధంగా ఖుర్ఆన్‌లోని చాలాభాగం కోల్పోవచ్చు. కాబట్టి నేను మీకు సలహా ఇస్తున్నాను - ఖుర్ఆన్‌ను సేకరించడానికి ఆదేశించమని.'

నేను చెప్పాను ఉమర్(రజి)తో, 'మీరెలా చేయగలరు రసూలుల్లాహ్(స) చేయనిదానిని?'

ఉమర్(రజి) అన్నారు : "అల్లాహ్ సాక్షి! అది చేయవలసిన మంచిపని"

ఉమర్(రజి)వారు అడుగుతూనే ఉన్నారు తన ప్రతిపాదనని అంగీకరించమని, అల్లాహ్ నా హృదయాన్ని దాని కొరకు తెరిచే వరకూ. మరియు ఉమర్(రజి) అర్థం చేసుకున్న ఆ ఆలోచనలో ఉన్న మంచిని అర్థం చేసుకోవడం ప్రారంభించాను."

తరువాత (నాతో అబూబక్ర్ సిద్దీఖ్-రజి) అన్నారు : "నీవు తెలివైన యువకుడివి మరియు నీ గురించి మాకెటువంటి అనుమానం లేదు మరియు రసూలుల్లాహ్(స)వారి కొరకు దివ్య సందేశాన్ని నీవు వ్రాస్తుండే వాడివి . కాబట్టి నీవు వెదకాలి ఖుర్ఆన్ (వ్రాత ప్రతులు భాగాలను) మరియు దానిని సేకరించాలి (ఒకే పుస్తకంగా)"

అల్లాహ్ సాక్షి! ఒకవేళ వారు నన్ను పర్వతాలలో ఒకదానిని కదపమని చెబితే, అది నాకు భారమయ్యేది కాదు నన్ను ఖుర్ఆన్‌ను సేకరించమని ఆదేశించడం కంటే.

తరువాత నేను అబూబక్ర్(రజి)వారికి చెప్పాను, "మీరు ఎలా చేస్తారు రసూలుల్లాహ్(స)వారు చేయనిదానిని?"

అబూబక్ర్(రజి) జవాబిచ్చారు : 'అల్లాహ్ సాక్షి! ఇది చేయవలసిన మంచి పని."

అబూబక్ర్(రజి)వారు తన ప్రతిపాదనను అంగీకరించమని నాకు చెబుతూనే ఉన్నారు, అల్లాహ్ నా హృదయాన్ని తెరిచే వరకూ దేని కొర్కైతే అబూబక్ర్ మరియు ఉమర్(రజి)వారి హృదయాలు తెరిచారో. కాబట్టి నేనే మొదలు పెట్టాను ఖుర్ఆన్ కొరకు చూడటం మరియు దానిని సేకరించాను, (ఖుర్ఆన్ ఆయత్‌లు వ్రాయబడిన) ఖర్జూరపు ఆకుల తొడిమల నుండి, సన్నటి తెల్లటి రాళ్ళు మరియు కంఠస్థం చేసినవారి నుండి, సూరహ్ అత్-తౌబా చివరి ఆయత్ అబీ ఖుజైమా అన్సారీ దగ్గర నుండి. మరియు నేను అది (ఆ ఆయత్) ఎవరి దగ్గర కనుగొనలేదు.

ఆ ఆయత్ "9:127-128" తరువాత పూర్తి ఖుర్ఆన్ వ్రాతప్రతి అబూబక్ర్ (రజి)వారి దగ్గర ఉండేది, ఆయన మరణించే వరకూ. తరువాత ఉమర్(రజి)వారి దగ్గర ఆయన జీవితకాలం చివరి వరకూ మరియు తరువాత ఉమర్ (రజి)వారి కుమార్తె హఫ్సా(రజి)వారి దగ్గర (ఆ ఖుర్ఆన్ ప్రతి) ఉండేది.

ముహమ్మద్(స)వారు చదవడం, వ్రాయడం నేర్చుకోలేదు గనుక, ఏదైనా ఆయత్ అవతరించినప్పుడు జైద్ బిన్ సాబిత్(రజి) వంటి లేఖకులను ఆయన(స) పిలిపించి వ్రాయించేవారు. దానిని ఇతరులు కూడా జంతు చర్మాల భాగాలపై, ఒంటె యొక్క పెద్ద ఎముకులపై, పలుచటి రాళ్ళపై వ్రాసుకోవడమో, వ్రాయించు కోవడమో చేసేవారు.

ముహమ్మద్(స)వారు స్వయంగా తన హస్తాలతో వ్రాసి ఇవ్వలేదు.

జైద్ బిన్ సాబిత్(రజి)వారు ప్రతీ ఆయత్‌కి సంబంధించి ఎవరెవరి దగ్గర వ్రాతపూర్వకంగా ఉన్నాయో వాటిని సేకరించారు. అన్ని ఆయత్‌లకు ఎక్కువ వ్రాతపూర్వక ప్రతులు లభ్యమయ్యాయిగాని, సూరహ్ అత్-తౌబా చివరి ఆయత్ మాత్రం వ్రాత పూర్వకంగా ఒకే ఒక్కరి దగ్గర ఉంది. అయితే ఆ ఆయత్ ఎందరి చేతనో కంఠస్థం చేయబడింది.

కాబట్టి ఖుర్ఆన్‌కు పుస్తక రూపం తేవడం ఎంత ముఖ్యమైనదో అర్థమైంది.

ఖుర్ఆన్ అరబీ భాషలో అవతరించింది. ఈ భాష సెమిటిక్ భాషలలో ఒకటి. అంటే ఇందులో అన్నీ హల్లులే ఉంటాయి గాని, అచ్చులు ఉండవు. అచ్చులకు బదులుగా కొన్ని గుర్తులు ఉపయోగిస్తారు. అచ్చులు లేకపోయినా అరబ్బులు చదవగలరు. కాని అరబ్బేతరులు సరియైన ఉచ్ఛారణతో ఖుర్ఆన్ చదవడం కష్టం కాబట్టి, జబర్, జేర్, పేష్ వంటి గుర్తులను ఉపయోగించారు.

అయితే ఈ గుర్తులు ఖుర్ఆన్‌లో భాగం కాదు. ఖుర్ఆన్ ఉచ్ఛారణ సరిగ్గా ఉండటానికి మనకు సహాయపడే గుర్తులు మాత్రమే.

జైద్ బిన్ సాబిత్(రజి)వారు ముహమ్మద్(స)వారు చెప్పిన వాటిలో ఏ ఒక్కటీ తీయకుండా మరియు ఏ ఒక్కటీ కలపకుండా యధాతథంగా ఒక ప్రతిని వ్రాసి ఖలీఫాకు అందించారు.

అలీ(రజి)వారు అన్నారు, అల్లాహుతాలా అబూబక్ర్(రజి)వారిని కరుణించుగాక! ఖుర్ఆన్ రెండు పలకల మధ్య (అంటే రెండు అట్టల మధ్య) ఏదైతే ఉందో దానిని ప్రోగు చేసిన మొదటి వ్యక్తి ఆయన.

(ఖుర్ఆన్ విషయంలో మరికొన్ని ముఖ్య విషయాలున్నాయి. అయితే వాటి గురించి ఇంతకు పూర్వమే శాంతిబాటలో ప్రచురించడం జరిగింది. కాబట్టి వాటిని ఇక్కడ ఇవ్వడం లేదు. ఆసక్తి గలవారు ఏప్రిల్-మే, 2010 శాంతిబాట సంచిక 64 నుండి 66 పేజీలు చదవండి)

**(మరికొంత భాగం వచ్చే సంచికలో ఇన్షా అల్లాహ్)**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

# సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

(క్రిందటి సంచిక తరువాయి ...)

17

## విశ్వాస పునాది మరియు శిక్షణ
## (ముహమ్మద్(స)వారి అనుచరులలో)

విశ్వాసులకిచ్చే శిక్షణలో స్వర్గనరకాలపై అవగాహనకున్న అత్యంత ప్రాముఖ్యత గురించి క్రిందటి సంచికలో చెప్పుకున్నాము. నరకం గురించి ఈ వ్యాసంలో అందిస్తున్నాము. నరకం ఎలా ఉంటుంది? నరకంలో ఆహార పానీయాలు, దుస్తులు ఏ విధంగా ఉంటాయి? మొదలైన ఎన్నింటి గురించో మక్కాలో అవతరించబడిన ఖుర్ఆన్ ఆయత్‌లు స్పష్టం చేస్తాయి. ఆ ఆయత్‌లను బాగుగా అర్థం చేసుకునేందుకు, ముందుగా కొన్ని హదీస్‌లను తెలియజేస్తున్నాము.

### పునరుత్థాన దినం తరువాత మరణం ఉండదు

తీర్పుదినం తరువాత మరణం ఉండదు. **శాశ్వత జీవితమే!** స్వర్గవాసులు శాశ్వతంగా స్వర్గ భోగాలు అనుభవిస్తే, నరకాగ్నివాసులు శాశ్వత నరకశిక్షలను అనుభవిస్తారు.

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు, “స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించినప్పుడు మరియు నరకవాసులు అగ్ని (నరకం)లో ప్రవేశించినప్పుడు, మరణం ముందుకు తీసుకురాబడుతుంది. మరియు అగ్ని(నరకం)కి మరియు స్వర్గానికి మధ్య ఉంచబడుతుంది. మరియు తరువాత అది జిబహ్ చేయబడుతుంది మరియు పిలిచేవాడు పిలుస్తాడు : “ఓ స్వర్గవాసులారా! ఇక మరణం లేదు! ఓ నరకవాసులారా! ఇక మరణం లేదు!” కాబట్టి స్వర్గవాసుల సంతోషానికి అదనంగా సంతోషం మరియు నరకవాసుల విచారానికి అదనంగా విచారం కలుపబడుతుంది .” **(సహీహ్ బుఖారీ, 6548, పుస్తకం 81, అధ్యా. 51, సంపుటి 8)**

**తిర్మిజీ హదీస్ (2557)**లో చివరి భాగం :

“మరణం దాని మెడపట్టుకొబడి ముందుకు తీసుకురాబడుతుంది మరియు అది స్వర్గవాసుల మరియు నరకవాసుల మధ్య గోడపై నిలుచుండ పెట్టబడుతుంది. అప్పుడు ఇది చెప్పబడుతుంది : “ఓ స్వర్గవాసులారా!” భయపడుతూ వారు దగ్గరగా వస్తారు. తరువాత ఇది చెప్పబడుతుంది : “ఓ నరకవాసులారా!” వారు సంతోషంగా వస్తారు, సిఫారసు యొక్క ఆశతో. అప్పుడు స్వర్గ వాసులకు మరియు నరకవాసులకు చెప్పబడుతుంది : “మీరు దీనిని గుర్తుపడతారా?” కావున వారు, ఇరువైపులవారు, చెప్పారు: “మేము గుర్తుపట్టాము. ఇది చావు దీనికి మాపై బాధ్యత ఇవ్వబడింది.” తరువాత అది క్రింద పెట్టబడి మరియు గోడపై ఏదైతే స్వర్గం మరియు నరకం మధ్యలో ఉందో (ఆ గోడపై) జిబహ్ చేయబడుతుంది. తరువాత ఇది చెప్పబడుతుంది: “ఓ స్వర్గవాసులారా! శాశ్వత జీవితం మరణం లేకుండా! మరియు ఓ నరకవాసులారా! శాశ్వత జీవితం మరణం లేకుండా!”

(మరణం గొర్రెపిల్ల రూపంలో వ్యక్తపరచబడుతుంది. స్వర్గవాసుల భయానికి కారణం ఏమిటంటే మరణం వలన తిరిగి తమకు లభించిన అనుగ్రహాలు పోతాయేమోనని. నరకవాసులకు మాత్రం సంతోషం కలుగుతుంది. మరణం సంభవిస్తే వేడుకోలుకి అవకాశం ఉంటుందని. కాని ఇక మరణం లేదు. ఇరువైపుల వారు మరణాన్ని గుర్తు పట్టారు. స్వర్గవాసుల సంతోషం అధికమవుతుంది మరియు నరకాగ్ని వాసుల దు:ఖం మరింత పెరుగుతుంది.)

### తీర్పుదినాన నరకం తీసుకురాబడుతుంది

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : “ఆ రోజున (తీర్పుదినాన) 70,000 కళ్ళాలు కలిగియున్న నరకం ముందుకు తీసుకురాబడుతుంది మరియు ప్రతీ కళ్ళెంతో 70 వేల మంది అల్లాహ్ యొక్క దూతలు దానిని ఈడుస్తారు.” **(తిర్మిజీ, 2573, సహీహ్, పుస్తకం 37, అధ్యా.1, సంపుటి 4)**

## నరకాగ్ని

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: "ఆదమ్ సంతానం వెలిగించిన ఈ మీ అగ్ని, నరకం వేడి యొక్క 70 భాగాలలో ఒక భాగం." వారు అడిగారు : "అల్లాహ్ సాక్షి! అది సరిపోదా ఓ రసూలల్లాహ్(స)?!" ఆయన అన్నారు: "అది 69 భాగాలు ఎక్కువ - వాటిలోని అన్ని ఒకేలా ఉంటాయి వేడిలో." **(తిర్మిజీ, 2589, సహీహ్, పుస్తకం 37, అధ్యా.7, సంపుటి 4)**

## నరకం లోతు

అల్-హసన్ చెప్పారు : ఆయన మింబర్‌పై ఉండగా - బస్రా మింబర్ - 'ఉత్బా బిన్ ఘజ్వాన్ ఉల్లేఖించారు. ప్రవక్త(స)వారు చెప్పారు : "వాస్తవానికి ఒక పెద్ద రాయి నరకం అంచునుండి విసరబడగలదు. మరియు అది దానిలో పడుతూనే ఉంటుంది 70 సంవత్సరాలుగా దాని అడుగు భాగాన్ని ఇంకనూ చేరకుండా." అతడు చెప్పారు : "ఉమర్(రజి)వారు చెబుతుండేవారు : 'నరకాగ్ని జ్ఞాపకాన్ని అధికం చేసుకోండి. ఎందుకంటే దాని వేడి అత్యంత తీవ్రం, దాని అడుగుభాగం చాలా దూరం మరియు దాని కొరడాలు ఇనుపవి.' " **(తిర్మిజీ, 2575, సహీహ్, పుస్తకం 37, అధ్యా.2, సంపుటి 4)**

## స్వర్గనరకాలలో మన రూపాలు, పరిమాణాలు (సైజులు) ఇక్కడిలా ఉండవు

### కాఫిర్ భుజాల మధ్య దూరం

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : ఒక కాఫిర్ (రెండు) భుజాల మధ్య దూరం (నరకంలో) వేగంగా ప్రయాణించే రౌతు మూడు రోజుల (ప్రయాణ) దూరానికి సమానం. **(సహీహ్ బుఖారీ, 6551, పుస్తకం 81, అధ్యా. 51, సంపుటి 8)**

### దంతాలు, తొడ, కూర్చునే స్థానం యొక్క సైజులు

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : "సత్యతిరస్కారి (కాఫిర్) దంతాలు పునరుత్థాన దినమున ఉహుద్ (పర్వతం) వలే ఉంటాయి, అతని తొడ అల్-బైదా' మరియు అతని కూర్చునే స్థానం నరకాగ్నిలో అర్రబదా వంటి 3 దూరాలకు సమానంగా ఉంటుంది. **(తిర్మిజీ, 2578, హసన్, పుస్తకం 37, అధ్యా.1, సంపుటి 4)**

అర్రబదా అంటే మదీనా మరియు రబదా మధ్య ఉండేంత దూరం మరియు అల్-బైదా అంటే ఉహుద్ వంటి పర్వతం.

### త్రాగడానికి ఇవ్వబడే ఆహారం మరియు పానీయం :

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు ఈ ఆయత్ పఠించారు (3:102) "ఓ విశ్వసించిన జనులారా! భయపడండి అల్లాహ్‌కు, హక్కు (ఆయనకే ఉంది) మీరు భయపడటానికి మరియు మరణించకండి మీరు ముస్లిములుగా ఉండగా తప్ప." మరియు రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: "అజ్-జఖ్ఖూమ్ యొక్క ఒక్క చుక్క (ద్రవం) ఒకవేళ ప్రపంచంలో పడితే, అది ప్రజల జీవనోపాధిని నాశనం చేస్తుంది, (నరకంలో ఉండే) ఆ వ్యక్తి గురించి ఏమిటి, ఎందుకంటే అదే అతని ఆహారం కనుక?" **(తిర్మిజీ, 2585, సహీహ్, పుస్తకం 37, అధ్యా.5, సంపుటి 4)**

అబూ ఉమామ ఉల్లేఖనం అల్లాహ్ ఆయత్‌కి సంబంధించి : (14:16,17) ప్రవక్త(స)వారు చెప్పారు : అది అతని నోటి ముందుకు తేబడుతుంది మరియు అతడు దానిని ఇష్టపడడు. కాబట్టి ఎప్పుడు అది అతని సమీపానికి తేబడుతుందో, అది అతని ముఖాన్ని కరిగిస్తుంది. మరియు అతని శిరస్సు యొక్క చర్మం దానిలో పడిపోతుంది. తరువాత ఎప్పుడైతే అతడు దానిని త్రాగుతాడో అతని ప్రేవులు ఛిద్రం అవుతాయి క్రింది రంధ్రం నుండి బయటకి వచ్చేవరకూ." అల్లాహుతాలా చెప్పారు : "47:15" మరియు ఆయన చెప్పారు : "18:29" **(తిర్మిజీ, 2583, హసన&, పుస్తకం 37, అధ్యా.4, సంపుటి 4)**

### నరకంలో తేలికపాటి శిక్ష :

పాదాల క్రింద ఉంచిన అగ్నికి మెదడు ఉడకడం.

స్వర్గ వాసుల యొక్క ఆహారం, దుస్తులు, సౌకర్యాలు అమోఘంగా ఉంటే, నరకాగ్నివాసుల ఆహారపానీయాలు మరియు దుస్తులతో పోలిస్తే, ఈ భూమిపై కడు దారిద్ర్యంతో జీవించిన అత్యంత నికృష్ట జీవి కూడా అత్యంత సుఖంగా బ్రతికినట్లు అనిపిస్తుంది. నరకాగ్ని వాసుల ఆహారపానీయాలు మరియు దుస్తుల విషయంలో ఖుర్ఆన్‌లో క్లుప్తంగా ఇవ్వబడిన విషయాలలో కొన్ని దిగువున ఇస్తున్నాము.

ముత్తఖూన్‌లకు (అల్లాహ్ పట్ల భయభక్తులు గలవారికి) వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క ఉదాహరణ ఇలా వుంది : అందులో వాసన మరియు రంగుమారని నీటి సెలయేళ్ళు ఉంటాయి. మరియు రుచిమారని పాలకాలవలు ఉంటాయి మరియు అందులో త్రాగేవారికి మధురంగా వుండే మద్యపానపు కాలువలు ఉంటాయి మరియు అందులో శుద్ధమైన తేనె కాలువలు ఉంటాయి. మరియు వారి కొరకు అందులో అన్ని రకాల మంచి ఫలాలు మరియు వారి ప్రభువు నుండి క్షమాపణ కూడా ఉంటాయి. ఇలాంటివాడు - **నరకాగ్నిలో శాశ్వతంగా ఉండి సలసల కాగే నీటిని త్రాగేందుకు ఇవ్వబడి, దానితో ప్రేగులు కోయబడినట్లు బాధపడేవానితో** - సమానుడు కాగలడా? (ఖుర్ఆన్ 47:15)

వారికి చేదు ముళ్ళ గడ్డ (దరీ'అ) తప్ప మరొక ఆహారం ఉండదు. అది వారికి బలమూ నియ్యదు మరియు ఆకలీ తీర్చదు! **(ఖుర్'ఆన్ 88:6,7)**

నిశ్చయంగా **జఖ్ఖూమ్ వృక్షఫలం.** పాపులకు ఆహారంగా ఇవ్వబడు తుంది. మరిగే నూనె వలే, అది వారి కడుపులో మరుగుతుంది. సలసల కాగే నీటి లాగ! **(ఖుర్'ఆన్ 44:43-46)** (చూడండి తిర్మిజీ, **2585**)

ఏమీ? ఇలాంటి ఆతిథ్యం మేలైనదా? లేక జముడు ఫలపు ఆతిథ్యమా? **(ఖుర్'ఆన్ 37:62)**

ఇది నిశ్చయంగా మార్గభ్రష్టులైన ఓ అసత్యవాదులారా! మీరు జఖ్ఖూమ్ చెట్టు (ఫలాలను) తింటారు. దానితో కడుపులు నింపు కుంటారు. తరువాత దాని మీద సలసల కాగే నీరు త్రాగుతారు. వాస్తవానికి మీరు దానిని దప్పిక గొన్న ఒంటెలవలే త్రాగుతారు. **(ఖుర్'ఆన్ 56:51,55)**

మరియు వారితో అను : "ఇది మీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. కావున ఇష్టపడినవారు దీనిని విశ్వసించవచ్చు మరియు ఇష్టపడనివారు దీనిని తిరస్కరించవచ్చు!" నిశ్చయంగా, మేము దుర్మార్గుల కొరకు నరకాగ్నిని సిద్ధపరచి ఉంచాము, దాని జ్వాలలు వారిని చుట్టుకుంటాయి. అక్కడ వారు నీటి కొరకు మొర పెట్టుకున్నప్పుడు, వారికి ముఖాలను మాడ్చే నూనెవంటి నీరు (అల్-ముహ్ల్) ఇవ్వబడుతుంది. అది ఎంత చెడ్డ పానీయం మరియు ఎంత చెడ్డ (దుర్భరమైన) విరామ స్థలం! **(ఖుర్'ఆన్ 18:29)**

అతని ముందు నరకం అతనికై వేచి ఉంటుంది మరియు అక్కడ సలసల కాగే **చిక్కని చీము వంటి నీరు** త్రాగడానికి ఇవ్వబడు తుంది. దానిని అతడు గుటకలు గుటకలుగా బలవంతంగా గొంతులోకి దింపడానికి ప్రయత్నిస్తాడు. కాని దానిని మ్రింగలేడు. అతనికి ప్రతివైపు నుండి మరణం ఆసన్నమవుతుంది, కాని అతడు మరణించ లేడు మరియు అతని ముందు భయంకరమైన శిక్ష వేచి ఉంటుంది. **(ఖుర్'ఆన్ 14:16,17)**

ఇదే అది! కావున వారు దాని రుచి చూస్తారు, సలసల కాగే నీరు మరియు చీము **(ఖుర్'ఆన్ 38:57)**

## శిక్షలు

మరియు ఆ రోజు అపరాధులకు సంకెళ్ళలో, కూడబెట్టి, బంధించి ఉంచటాన్ని నీవు చూస్తావు. వారి వస్త్రాలు 'తారు'తో చేయబడి ఉంటాయి మరియు అగ్నిజ్వాలలు వారి ముఖాలను క్రమ్ముకుని ఉంటాయి. **(ఖుర్'ఆన్ 14:49,50)**

ఆ నరకాగ్ని! వారు దాని యెదుటకు ఉదయమూ మరియు సాయంత్రమూ రప్పింపబడుతూ ఉంటారు. మరియు (పునరుత్థాన) దినపు ఘడియ వచ్చినప్పుడు : 'ఫిర్'ఔన్ జనులను తీవ్రమైన శిక్షలో పడవేయండి!" అని ఆజ్ఞ ఇవ్వబడుతుంది. **(ఖుర్'ఆన్ 40:46)**

ఎవరైతే సత్యాన్ని తిరస్కరించి అల్లాహ్ మార్గం నుండి నిరోధించారో వారికి, మేము వారు చేస్తూ ఉండిన దౌర్జన్యాలకు శిక్ష మీద శిక్ష విధిస్తాము. **(ఖుర్'ఆన్ 16:88)**

మరియు ఎవడికి అల్లాహ్ మార్గదర్శకత్వం చేస్తాడో అతడే సన్మార్గం పొందుతాడు. మరియు ఎవడిని ఆయన మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడో వాడికి, ఆయన తప్ప, ఇతరుల నెవ్వరినీ నీవు సంరక్షకులుగా పొందలేవు. మరియు వారిని మేము పునరుత్థాన దినమున గ్రుడ్డివారుగా, మూగవారుగా, మరియు చెవిటి వారుగా చేసి, వారి ముఖాల మీద బోర్లా పడవేసి లాగుతూ ప్రోగుచేస్తాము. వారి ఆశ్రయం నరకమే! అది చల్లారినప్పుడల్లా మేము వారిపై అగ్ని జ్వాలను తీవ్రం చేస్తాము. **(ఖుర్'ఆన్ 17:97)**

మరియు చెడుపనులు చేసి వచ్చినవారు నరకాగ్నిలోకి బోర్లా త్రోయబడతారు. 'మీకు ఇవ్వబడే ప్రతిఫలం మీ కర్మలకు భిన్నంగా ఉండగలదా?" **(ఖుర్'ఆన్ 27:90)**

అగ్ని వారి ముఖాలను కాల్చి వేస్తుంది. వారి పెదవులు బిగించుకు పోయి పళ్ళు బయటపడతాయి. **(23:104)**

నిశ్చయంగా, పాపాత్ములు మార్గభ్రష్టత్వంలో ఉన్నారు మరియు వారు నరకాగ్నిలో కాలుతారు. ఆ రోజు వారు తమ ముఖాల మీద నరకాగ్నిలోకి ఈడ్చబడతారు. "నరకాగ్ని స్పర్శను చవి చూడండి" అని అనబడుతుంది. **(ఖుర్'ఆన్ 54:47,48)**

ఎవరైతే ఈ గ్రంథాన్ని అసత్యమని తిరస్కరించారో మరియు మేము మా సందేశహరులకు ఇచ్చి పంపిన దానిని (తిరస్కరించారో), వారు తప్పక త్వరలోనే తెలుసుకుంటారు ఎప్పుడైతే వారి మెడలలో సంకెళ్ళు మరియు గొలుసులు వేయబడతాయో మరియు వారు ఈడ్చబడతారో. సలసల కాగే నీళ్ళలోకి, తరువాత నరకాగ్నిలో కాల్చబడటానికి. **(ఖుర్'ఆన్ 40:70-72)**

మరియు పాపకార్యాలు చేసినవారికి, వారి పాపాలకు తగినట్టి ప్రతిఫలం లభిస్తుంది మరియు వారికి ప్రతిఫలం లభిస్తుంది మరియు వారిని అవమానం క్రమ్ముకుంటుంది. అల్లాహ్ నుండి వారిని రక్షించే వాడెవ్వడూ ఉండడు. వారి ముఖాలు చీకటి రాత్రి యొక్క నల్లటి తెరల వంటి వాటితో కప్పబడి ఉంటాయి. అలాంటివారు నరకాగ్ని వాసులు. అందులో వారు శాశ్వతంగా

ఉంటారు. **(ఖుర్'ఆన్ 10:27)**

నరకమే వారి పాన్పు మరియు వారి దుప్పటి అవుతుంది. మరియు ఈ విధంగా మేము దుర్మార్గులకు ప్రతిఫలమిస్తాము **(ఖుర్'ఆన్ 7:41)**

ఆ రోజు, శిక్ష వారి పైనుండి మరియు వారి పాదాల క్రింద నుండి వారిని కమ్ముకున్నప్పుడు, వారితో ఇలా అనబడుతుంది: "మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలితాన్ని చవిచూడండి." **(ఖుర్'ఆన్ 29:55)**

వారిని, వారిపై నుండి అగ్ని జ్వాలలు కమ్ముకుంటాయి మరియు వారి క్రింద నుండి క్రమ్ముకుంటాయి. ఈ విధంగా, అల్లాహ్ తన దాసులను భయపెడుతున్నాడు : **"ఓ నా దాసులారా! నా పట్ల మాత్రమే భయభక్తులు కలిగి ఉండండి."** (ఖుర్'ఆన్ 39:16)

ఎంతమాత్రం కాదు! అతడు తప్పకుండా అణగద్రొక్కబడే నరకాగ్ని లో వేయబడతాడు. ఆ నరకాగ్ని అంటే ఏమిటో నీకు తెలుసా? అల్లాహ్ యొక్క అగ్ని తీవ్రంగా ప్రజ్వలింప జేయబడినది. అది గుండెల దాకా చేరుకుంటుంది. **(ఖుర్'ఆన్ 104:4-7)**

నిశ్చయంగా, మేము సత్యతిరస్కారుల కొరకు సంకెళ్ళను, మెడలో పట్టాలను మరియు భగభగ మండే నరకాగ్నిని (స'ఈరా) సిద్ధపరచి ఉంచాము. **(ఖుర్'ఆన్ 76:4)**

నిశ్చయంగా, మా వద్ద వారికొరకు సంకెళ్ళు మరియు భగభగ మండే నరకాగ్ని ఉన్నాయి. మరియు గొంతులో ఇరుక్కుపోయే ఆహారం మరియు బాధాకరమైన శిక్ష (ఉన్నాయి). **(ఖుర్'ఆన్ 73:12,13)**

మరియు బలహీనులైనవారు దురహంకారులైన నాయకులతో ఇలా అంటారు. "అలా కాదు! ఇది మీరు రాత్రింబవళ్ళు పన్నిన కుట్ర. మీరు మమ్మల్ని - అల్లాహ్‌ను తిరస్కరించి - ఇతరులను ఆయనకు సాటి కల్పించమని ఆజ్ఞాపిస్తూ ఉండేవారు." మరియు వారు శిక్షను చూసినప్పుడు, తమ పశ్చాత్తాపాన్ని దాస్తారు. మరియు మేము సత్యతిరస్కారుల మెడలలో సంకెళ్ళు వేస్తాము. వారు తమ కర్మలకు తగిన ప్రతిఫలం తప్ప మరేదైనా పొందగలరా? **(ఖుర్'ఆన్ 34:33)**

ఎప్పుడైతే వారి మెడలలో సంకెళ్ళు మరియు గొలుసులు వేయ బడతాయో మరియు వారు ఈడ్చబడతారో! **(ఖుర్'ఆన్ 40:71)**

"అతన్ని పట్టుకోండి మరియు అతని మెడలో సంకెళ్ళు వేయండి. తరువాత అతనిని భగభగమండే నరకాగ్నిలో వేయండి. ఆ తరువాత అతనిని డబ్భయి మూరల పొడవుగల గొలుసుతో బంధించండి". **(ఖుర్'ఆన్ 69:30-32)**

"నిశ్చయంగా, మీరు మరియు అల్లాహ్‌ను వదిలి మీరు ఆరాధించే వారూ, నరకాగ్నికి ఇంధనమవుతారు! (ఎందుకంటే) మీరు అక్కడికే పోవలసి ఉంది. ఒకవేళ ఇవన్నీ ఆరాధ్యదైవాలే అయివుంటే, అవన్నీ అందులో ప్రవేశించి ఉండేవి కావు కదా! కాని మీరంతా అందులో శాశ్వతంగా ఉంటారు" **(ఖుర్'ఆన్ 21:98,99)**

మరియు ఎవడైతే కరుణామయుని స్మరణ విషయంలో అంధుడిగా ప్రవర్తిస్తాడో అతనిపై మేము ఒక షైతాన్‌ను నియమిస్తాము. ఇక వాడు వాని సహచరుడు (ఖరీనున్) అవుతాడు. మరియు నిశ్చయంగా, వారు వారిని మార్గం నుండి ఆటంక పరుస్తారు మరియు వారేమో నిశ్చయంగా, తాము సరైన మార్గ దర్శకత్వంలోనే ఉన్నామని భావిస్తారు! చివరకు అతడు మా వద్దకు వచ్చినప్పుడు ఇలా అంటాడు : "అయ్యో! నా దౌర్భాగ్యం! నీకూ నాకూ మధ్య తూర్పుపడమరల మధ్య ఉన్నంత దూరం ఉండి వుంటే ఎంత బాగుండేది! ఎందుకంటే నీవు అతి చెడ్డ సహచరుడివి! మరియు మీరు దుర్మార్గం చేశారు. కావున, ఈ రోజు మీరంతా ఈ శిక్షలో కలిసి ఉండటం మీకు ఏ మాత్రం లాభదాయకం కాదు. **(ఖుర్'ఆన్ 43:36-39)**

మరియు దుర్మార్గం చేసిన ప్రతి వ్యక్తి వద్ద ఒకవేళ వాస్తవానికి భూమిలో ఉన్న ధనమంతా ఉన్నా, దానిని అంతా పరిహారంగా ఇవ్వటానికి సిద్ధపడతాడు. మరియు వారు ఆ శిక్షను చూసినప్పుడు లోలోపల పశ్చాత్తాప పడతారు. మరియు వారి మధ్య తీర్పు న్యాయంగా జరుగుతుంది. మరియు వారి కెలాంటి అన్యాయం జరగదు. **(ఖుర్'ఆన్ 10:54)**

ఇక తన కర్మపత్రం వీపు వెనుక నుండి ఇవ్వబడినవాడు. అప్పుడు అతడు తన నాశనాన్నే కోరుకుంటాడు. మరియు అతడు మండుతున్న నరకాగ్నిలో పడిపోతాడు. **(ఖుర్'ఆన్ 84:10-12)**

మరియు దానిలోని ఒక ఇరుకైన స్థలంలో, వారు బంధింపబడి, త్రోయబడినప్పుడు వారక్కడ తమ చావును పిలవడం ప్రారంభిస్తారు. "ఈ రోజు మీరు ఒక్క చావును పిలవకండి. ఎన్నో చావుల కొరకు అరవండి." **(ఖుర్'ఆన్ 25:13-14)**

## నరకవాసుల ఆర్తనాదాలు

మరియు దాని (నరకం)లో ఇలా మొరపెట్టుకుంటారు : "ఓ మా ప్రభూ! మమ్మల్ని బయటకి తీయి. మేము పూర్వం చేసిన కార్యాలకు భిన్నంగా సత్కార్యాలు చేస్తాము." "ఏమీ? గుణపాఠం నేర్చుకోదలచినవాడు గుణపాఠం నేర్చుకోవడానికి, మేము తగినంత వయస్సును ఇవ్వలేదా? మరియు మీ వరకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చాడు కదా? కావున మీరు (శిక్షను) రుచి చూడండి.

ఇక్కడ దుర్మార్గులకు సహాయపడేవాడు ఎవ్వడూ లేడు." (ఖుర్'ఆన్ 35:37)

ఇంకా వారు ఇలా అంటారు: "ఒకవేళ మేము విని ఉంటే లేదా గ్రహించి ఉంటే, మేము మండే అగ్ని జ్వాలలలో పడివుండే వారిలో చేరేవారం కాము కదా!" (ఖుర్'ఆన్ 67:10)

వారిలా అంటారు : "ఓ మా ప్రభూ! మా దురదృష్టం మమ్మల్ని క్రమ్ముకుని ఉండింది. మేము మార్గభ్రష్టులమైన వారుగా ఉండేవారం! ఓ మా ప్రభూ! మమ్మల్ని దీని నుండి బయటకి తీయి. ఒకవేళ మేము మరల (పాపాలు) చేస్తే, మేము నిశ్చయంగా, దుర్మార్గులమే!" ఆయన అంటాడు : "దానిలోనే పరాభవంతో పడి ఉండండి మరియు నాతో మాట్లాడకండి!" (ఖుర్'ఆన్ 23:106-108)

మరియు (పునరుత్థాన దినమున) ఈ అపరాధులు, తమ ప్రభువు సమక్షంలో, ఏ విధంగా తమ తలలు వంచుకుని నిలబడి ఉంటారో, నీవు చూడగలిగితే! వారు :

**"ఓ మా ప్రభూ! మేమిప్పుడు చూశాము మరియు విన్నాము. కావున మమ్మల్ని తిరిగి (భూమి పైకి) పంపించు. మేము సత్కార్యాలు చేస్తాము. నిశ్చయంగా, మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది"**

అని అంటారు. మరియు, మేము కోరినట్లయితే, ప్రతి వ్యక్తికి దాని మార్గదర్శకత్వం చేసి ఉండేవారము. కాని, నేను : "నిశ్చయంగా జిన్నాతులు మరియు మానవులందరితో నరకాన్ని నింపివేస్తాను." అని పలికిన నా మాట సత్యమయ్యింది. కావున మీరు మీ యొక్క ఈనాటి సమావేశాన్ని మరచిపోయిన దాని ఫలితాన్ని రుచి చూడండి. నిశ్చయంగా మేము కూడా మిమ్మల్ని మరచిపోయాము. మరియు మీరు మీ కర్మల ఫలితమైన ఈ శాశ్వత శిక్షను రుచి చూడండి!" (ఖుర్'ఆన్ 32:12-14)

మరియు నరకాగ్నిలో పడివున్నవారు, నరకపు రక్షకులతో : "మా శిక్షను కనీసం ఒక్కరోజు కొరకైనా తగ్గించమని, మీరు మా ప్రభువును ప్రార్థించండి!" అని అంటారు. వారు అంటారు : "ఏమీ? మీ వద్దకు స్పష్టమైన సూచనలు తీసుకుని మీ ప్రవక్తలు రాలేదా?" అప్పుడు వారంటారు: "అవును" వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది : "అయితే మీరే ప్రార్థించండి" కాని సత్య తిరస్కారుల ప్రార్థన నిష్ఫలమే అవుతుంది. (ఖుర్'ఆన్ 40:49-50)

మరియు వారిలా మొర పెట్టుకుంటారు : "ఓ నరక పాలకుడా (మాలిక్)! నీ ప్రభువును మమ్మల్ని అంతం చేయమను." అతను అంటాడు:"నిశ్చయంగా మీరిక్కడే (ఇదే విధంగా) పడి ఉంటారు." వాస్తవానికి మేము మీ వద్దకు సత్యాన్ని తీసుకు వచ్చాము, కాని మీలో చాలామంది సత్యమంటేనే అసహ్యించుకునేవారు. (ఖుర్'ఆన్ 43:77,78)

కావున మీరు ఆయనను వదిలి మీకు ఇష్టమైన వారిని ఆరాధించండి. ఇంకా ఇలా అను : "పునరుత్థాన దినమున తమకు తాము మరియు తమ కుటుంబం వారికి నష్టం కలిగించుకున్న వారే, నిశ్చయంగా నష్టపడ్డవారు. వాస్తవానికి అదే స్పష్టమైన నష్టం!" (ఖుర్'ఆన్ 39:15)

ఇన్షా అల్లాహ్ మనం, మన కుటుంబాలు స్పష్టమైన నష్టంలో పడకూడదు. స్వర్గం మరియు నరకాల గురించి ముహమ్మద్(స) వారి అనుచరులకు మంచి అవగాహన ఉండేది.

అపార సైనిక బలగంతో ఉన్న రోమన్లపై అమ్ర్ బిన్ ఆస్(రజి)వారు కేవలం 4వేల మంది సైన్యంతో దండయాత్రకు ధైర్యంగా బయలు దేరగలిగారంటే, వారి ముందున్న లక్ష్యం స్వర్గం మాత్రమే.

ఈ వ్యాసంలో నరకం గురించి తెలిపిన ఆయత్‌లు కొన్ని మాత్రమే. సలాత్‌లో ఈ ఆయత్‌లు పఠించేటప్పుడు సహాబాలు స్పృహ తప్పి పడిపోయేవారు. వారి తఖ్వా అటువంటిది. స్వర్గ శుభవార్తను అందుకున్న సహాబాల పరిస్థితి కూడా అదే విధంగా ఉండేది.

## మరణం ఒక్కసారే!

మరణించిన తరువాత పునరుత్థాన దినమున లేపబడిన తరువాత మరణం ఉండదు. శాశ్వత జీవితం. దురదృష్టవశాత్తు నరకంలోకి విసిరి వేయబడితే, ఆ నరకవాసి శాశ్వతంగా ఘోరశిక్ష అనుభవిస్తూనే ఉండాలి. తిరిగి భూమిపైకి పంపితే సత్కార్యాలు చేస్తామని ఎంత వేడుకున్నా ఫలితం ఉండదు.

కాని మనందరికి ఇన్షా అల్లాహ్ సత్కార్యాలు చేయడానికి ఇంకా అవకాశం ఉంది. కాబట్టి అదృష్టం మనకు ఇంకా దగ్గరలోనే ఉంది. తఖ్వాతో ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ను పాటించడం కష్టమైన పని కాదు.

నరకవాసులు చేసిన తప్పు మనం చేయకుండా, ఇన్షా అల్లాహ్ 'ముత్తఖూన్'గా జీవిద్దాం! ముత్తఖూన్‌కు స్వర్గం వాగ్దానం చేయబడింది.

(ఇన్షా అల్లాహ్ మరికొంత భాగం వచ్చే సంచికలో ...)

**"నిశ్చయంగా మేము మానవులందరి కొరకు, ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింప జేశాము. కావున సన్మార్గంపై నడిచేవాడు, తన మేలు కొరకే అలా చేస్తాడు. మరియు నిశ్చయంగా, మార్గభ్రష్టుడైనవాడు తన కీడు కొరకే మార్గభ్రష్టుడు అవుతాడు. మరియు నీవు వారి కొరకు బాధ్యుడవు కావు."** (ఖుర్'ఆన్ 39:41)

20

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### *నవ ముస్లిమ్?* | *New Muslim?*

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. గత ఆరు సంచికల నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించడం జరిగింది. **క్రిందటి సంచికలో అస్మా (రజి) వారి గురించి, ఆమె విశిష్ఠత గురించి క్లుప్తంగా తెలియజేశాము.**

# ఫాతిమా బిన్త్ అసద్ (రజి)

**• అబూతాలిబ్‌గారి సతీమణి • ముహమ్మద్(స)వారిని పెంచిన తల్లి • అలీ(రజి) మరియు జాఫర్(రజి)వారి మాతృమూర్తి • ఫాతిమా బిన్త్ ముహమ్మద్(రజి)వారి అత్తయ్యగారు • తొలినాళ్ళలో ఇస్లామ్ స్వీకరించిన ముస్లిములలో ఒకరు**

**"ఓ ప్రియమైన మాతృమూర్తి! అల్లాహ్ నిన్ను తన రక్షణలో ఉంచుగాక! చాలాసార్లు నీవు ఆకలితో ఉండేదానివి నాకు తినిపించడానికి. నీవు నాకు తినిపించావు మరియు నాకు తొడిగించావు మృదువైనవి వాటిని నీ కొరకు కాదనుకుని. అల్లాహుతాలా నిశ్చయంగా నీవు చేసిన వాటికి సంతోషిస్తారు. మరియు నీ ఉద్దేశాలు నిశ్చయంగా అల్లాహ్ యొక్క దయ మరియు సంతోషాన్ని మరియు పరలోకంలో సాఫల్యాన్ని గెలుచుకుంటాయి."**

ఫాతిమా బిన్త్ అసద్ బిన్ హాషిమ్ బిన్ అబ్ద్ మునాఫ్ బిన్ ఖాసి హాష్మి - ఈమె వంశావళి. అబ్దుల్ ముత్తలిబ్‌గారు ఈమెను తన కుమారుడు అబూతాలిబ్ గారికిచ్చి వివాహం చేశారు. అబూతాలిబ్‌గారు ముహమ్మద్(స)వారి బాబాయి. కాబట్టి ఈమె ముహమ్మద్(స)వారి పిన్నమ్మగారు. ఈమెకు నలుగురు కుమారులు - తాలిబ్, అఖీల్(రజి), జాఫర్(రజి) మరియు అలీ(రజి). కుమార్తెలు - ఉమ్మె హని(రజి), జుమ్‌నా(రజి), రబ్‌తా.

ముహమ్మద్(స)వారి మాతృమూర్తి మరణించిన తరువాత, ఆయన (స) తాతయ్యగారైన అబ్దుల్ ముత్తలిబ్‌గారి సంరక్షణలో పెరిగారు. ఆయన కూడా మరణించాక, బాలుడుగా బాబాయి అబూతాలిబ్‌గారి సంరక్షణలోకి తీసుకోబడ్డారు. ఆయన భార్య ఫాతిమా బిన్త్ అసద్(రజి) ముహమ్మద్(స)వారిని తన స్వంత బిడ్డలాగే చూసుకున్నారు. ముహమ్మద్ (స) గుర్తు చేసుకునేవారు, తనకు తినిపించడానికి ఆమె ఆకలితో ఉండేవారని. ఈమె అంటే ముహమ్మద్(స)వారికి ఎంతో గౌరవం. ఎప్పుడైనా ఆమె ముహమ్మద్(స)వారి దగ్గరకు వస్తే, ఆయన లేచి ఆమెను ప్రేమతో సాదరంగా ఆహ్వానించేవారు, అమ్మా! అని సంబోధిస్తూ.

ముహమ్మద్(స)వారి బాబాయిగారికి కూడా ముహమ్మద్(స)వారంటే అమితమైన ప్రేమ. ప్రవక్త(స)వారు చిన్నతనం నుండి మంచి సంస్కారం తోనూ మరియు తన వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో ఎంతో శ్రద్ధగా ఉండేవారు. అబూతాలిబ్ గారు ఆయన(స)ను తన సంతానానికి ఉదాహరణగా చూపేవారు. ఇతర బాలురవలే, ఆటల వలన దుమ్ము ధూళితో ఉండకుండా ఎల్లప్పుడూ హుందాగా శుభ్రంగా ఉండేవారు.

అబూతాలిబ్‌గారు పిల్లలంతా కలిసి తినడాన్ని ఇష్టపడేవారు, ఎందుకంటే ముహమ్మద్(స)వారు పిల్లలతో కలిసి ఎప్పుడు భోజనం చేసినా, ఆ ఆహారం అందరికీ సరిపోయేదని మరియు విడివిడిగా తిన్నప్పుడు ఆకలితో ఉండేవారని అనుభూతి చెందేవారు.

అబూతాలిబ్‌గారు తన సోదరుని కుమారునితో తరచుగా చెబుతుండే వారు ఆయన ప్రత్యేకంగా అనుగ్రహించబడ్డారని. చిన్నతనంలో తన బాబాయితో సిరియాకు వ్యాపార నిమిత్తం వెళ్ళినప్పుడు ఎన్నో అసాధారణ మరియు వింత సంఘటనలు ప్రయాణంలో చోటుచేసుకున్నాయి. అబూతాలిబ్‌గారు తిరిగి వచ్చిన తరువాత ఆ విషయాలన్నీ భార్యకు వర్ణించి చెప్పారు.

ఆమె కూడా చాలా గాఢంగా ప్రభావితమయ్యారు.

ముహమ్మద్(స)వారు అల్లాహ్ ఆదేశానుసారం ఇస్లామ్‌వైపు ప్రజలను ఆహ్వానించడం ప్రారంభించారు. ఫలితంగా వారు హింసా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. కాని ముహమ్మద్(స)వారికి హాని చేయడానికి ఎవరూ సాహసించేవారు కాదు. కారణం అబూతాలిబ్‌గారు ముహమ్మద్(స)వారికి దన్నుగా ఉండేవారు. అబూతాలిబ్‌గారు ఖురైష్ నాయకుడు.

భర్త అబూతాలిబ్‌గారితో ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు అన్యోన్యంగా ఉండేవారు. ముహమ్మద్(స)వారి క్షేమాన్నే కోరుతూ, తల్లిగా ఆమె చాలా శ్రద్ధ తీసుకునేవారు.

మక్కాలో విశ్వాసులపై హింసా దౌర్జన్యాలు పెరగడంతో, ముహమ్మద్(స)వారి ఆదేశం మేరకు మొదటి గ్రూపు ముస్లిములు అబిసీనియాకు వలస వెళ్ళారు. ఆ గ్రూపుకు నాయకుడు - జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)వారు. ఈయన ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారికి ప్రియమైన కుమారుడు. ఎందుకంటే జాఫర్(రజి)వారు ముహమ్మద్(స) వారిని పోలివుండేవారు. అంతేకాకుండా ఆయన మంచి వక్త. భాషపై మంచి పట్టు ఉండేది. ఆయన ప్రసంగం ప్రజల హృదయాలను గెలుచుకునేది. ఆ నైపుణ్యంతోనే ఆయన అబిసీనియా రాజు నజాషీ దర్బారులో ప్రసంగించి అల్లాహ్ అనుగ్రహంతో రాజు హృదయాన్ని గెలవగలిగారు. అల్లాహ్ నజాషీ హృదయాన్ని ఇస్లామ్‌వైపు తెరిచారు.

జాఫర్(రజి)వారి ప్రసంగాన్ని తెలుసుకోగోరేవారు ఇదే శీర్షికలో అందజేసిన 'అమ్ర్ బిన్ ఆస్(రజి)' వ్యాసంలో చదవగలరు.

తన ప్రియకుమారుడు మరియు కోడలు అస్మా బిన్త్ ఉమైస్(రజి) అబిసీనియాకు వలస వెళ్ళిపోవడంతో, వారి ఎడబాటును ఆమె సహిస్తూ మక్కాలోనే ఉండిపోయారు.

ముహమ్మద్(స)వారు బంధువులతో సహా 3 సంవత్సరాలు వెలివేయబడటం, ఆ మూడు సంవత్సరాలు వారంతా పడిన ఘోర బాధలు గురించి ఇదివరకే ఎన్నోసార్లు శాంతిబాటలో వివరించడం జరిగింది. ఆ విధంగా ఆ మూడు సంవత్సరాలు కష్టాలు అనుభవించిన వారిలో ఒకరు - ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు. ఆమె ఆ మూడు సంవత్సరాల కాలాన్ని స్థైర్యంతో మరియు సహనంతో భరించారు.

ఆ వెలి పూర్తయిన తరువాత ముహమ్మద్(స)వారిని ప్రాణంగా చూసుకుంటూ ఆయనకు దన్నుగా ఉన్న ప్రియ సతీమణి 'ఖదీజా'(రజి) వారు మరణించారు. మరి కొన్ని రోజులకు ప్రాణంగా చూసుకునే బాబాయి అబూతాలిబ్‌గారు కూడా మరణించారు. ఇస్లామీయ చరిత్రలో అది శోక సంవత్సరంగా మిగిలిపోయింది.

ముహమ్మద్(స)వారు ముస్లిములను మక్కా నుండి మదీనా వలస వెళ్ళమని ఆదేశించారు. మక్కానుండి మదీనా వలస వెళ్ళిన ముస్లిములలో ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు కూడా ఉన్నారు.

ముహమ్మద్(స)వారి కుమార్తెయైన ఫాతిమా(రజి)వారితో అలీ(రజి) వారికి వివాహం జరిగింది. ఆ విధంగా అలీ(రజి)వారి కుటుంబంలో ఇద్దరు ఫాతిమాలు ఉన్నారు. అత్తాకోడళ్ళు ఇద్దరిపేరు ఒకటే.

ఒక ఉల్లేఖనం ప్రకారం, ఒకసారి ఓ పెద్ద వస్త్రాన్ని ముహమ్మద్(స) వారు అలీ(రజి)వారికి ఇచ్చి ఫాతిమాల నడుమ పంచమన్నారు. అప్పటికి ఆ కుటుంబంలో 4 గురు ఫాతిమాలు ఉన్నారు.

ఫాతిమా బిన్త్ అసద్(రజి)

ఫాతిమా బిన్త్ ముహమ్మద్(రజి)

ఫాతిమా బిన్త్ హమ్జా(రజి)

ఫాతిమా బిన్త్ షైబహ్(రజి) - అఖీల్(రజి)వారి భార్య

అనస్ బిన్ మాలిక్(రజి)వారు చెప్పిన దానిని బట్టి, ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు మరణించిన సంగతి ముహమ్మద్(స)వారికి తెలిసినప్పుడు ఆయన(స) వెంటనే ఆమె ఇంటికి వెళ్ళారు. ఆమె పక్కనే కూర్చుని ఆమె కొరకు అల్లాహ్‌ను వేడుకున్నారు :

"ఓ ప్రియమైన మాతృమూర్తి! అల్లాహ్ నిన్ను తన రక్షణలో ఉంచుగాక! చాలాసార్లు నీవు ఆకలితో ఉండేదానివి నాకు తినిపించడానికి. నీవు నాకు తినిపించావు మరియు నాకు తొడిగించావు మృదువైనవి వాటిని నీ కొరకు కాదనుకుని. అల్లాహుతాలా నిశ్చయంగా నీవు చేసిన వాటికి సంతోషిస్తారు. మరియు నీ ఉద్దేశాలు నిశ్చయంగా అల్లాహ్ యొక్క దయ మరియు సంతోషాన్ని మరియు పరలోకంలో సాఫల్యాన్ని గెలుచుకుంటాయి."

సమాధి గావించడానికి జన్నతుల్ బఖీకి వెళ్ళి గొయ్యిని తవ్వమని ఉసామా బిన్ జైద్(రజి)వారిని మరియు అబూ అయూబ్ అన్సారీ(రజి) వారిని ముహమ్మద్(స)వారు ఆదేశించారు. గొయ్యి యొక్క పై భాగం తవ్విన తరువాత ప్రవక్త(స)వారు క్రిందిభాగాన్ని తవ్వారు. మరియు ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారిని అందులో ఉంచారు. మరియు అల్లాహ్‌ను ప్రార్థించారు.

**"ఓ అల్లాహ్! నా తల్లిని క్షమించు మరియు ఆమె సమాధిని విశాలంగా చేయి."**

సమాధి నుండి బయటకి వచ్చాక, ప్రజల ముఖాలపై ఆశ్చర్యాన్ని చూసి ప్రవక్త(స)వారు ఇలా చెప్పారు :

**"అబూతాలిబ్‌గారి తరువాత నన్ను కరుణతో చూసుకున్నది ఆమెయే! నేను నా చొక్కాను ఆమెకు కఫనుగా చేశాను, ఆమె స్వర్గంలో వస్త్రాన్ని పొందుతారని మరియు నేను ఆమెను సమాధిలో ఉంచాను ఆమె సులభంగా సమాధి కష్టాలను అధిగమించడానికి."**

ఆ విధంగా ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు, ప్రవక్త(స)వారు

స్వయంగా సమాధి స్థలాన్ని పరిశీలన గావించిన కొద్దిమంది అదృష్టవంతులలో ఒకరు అయ్యారు. వారు :

ఖదీజా(రజి)

అబ్దుల్లాహ్ బిన్ మాజూన్(రజి)

ఖదీజా(రజి) మరియు ముహమ్మద్(స)వారికి పుట్టి పసితనంలో చనిపోయిన కుమారుడు

ఫాతిమా బిన్త్ అసద్(రజి)

ఫాతిమా బిన్త్ అసద్(రజి)వారు కూడా ప్రవక్త(స)వారి ద్వారా స్వర్గ శుభవార్తను అందుకున్నారు.

పైన చెప్పుకున్న జీవిత కథ నుండి ఎన్నో విషయాలు గమనించ వచ్చు. తన భర్త ద్వారా సిరియా ప్రయాణంలో ఏమేమి వింతలు జరిగాయో తెలుసుకున్నారు. కన్నతల్లి కాకపోయినా, ఆమె ఆయన తల్లి వలే ఎంతో అపురూపంగా చూసుకున్నారు. కాబట్టి ముహమ్మద్(స)వారి మహోన్నత వ్యక్తిత్వం ఆమెకు స్పష్టంగా తెలిసింది. 3 సంవత్సరాల కాలం పాటు వెలివేయబడినప్పుడు, ప్రవక్త(స)వారి ప్రాణానికి ప్రమాదం కలుగుతుందని, ప్రవక్త(స)వారు నిద్రపోయాక, ఆయన స్థానంలో తమ కుమారులను పరుండబెట్టి, ముహమ్మద్(స)వారి పడకను మరొక చోటికి మార్చేవారు అబూతాలిబ్ గారు. తన అవసరాల కంటే ముహమ్మద్(స) వారికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు ఆ మాతృమూర్తి.

ఈ ఇద్దరూ ప్రవక్త(స)వారి వైపు ఉన్నారు. అయితే ఒకరు మాత్రమే ఇస్లామ్ స్వీకరించారు. అబూతాలిబ్‌గారు ఇస్లామ్ స్వీకరించలేదు. తన భార్యను గాని, కుమారులను గాని, కుమార్తెలను గాని ఆయన ఇస్లామ్ స్వీకరించడం నుండి నిరోధించ లేదు. సరికదా వారిని ప్రోత్సహించారు.

ఆయన సత్యాన్ని తిరస్కరించ లేదు. కాని సత్యాన్ని బహిరంగంగా స్వీకరించలేక పోయారు. ఆయనను ఇస్లామ్ స్వీకరించేలా చేయడంలో ముహమ్మద్(స)వారు విజయం సాధించలేక పోయారని అనుకోవాలా? కానే కాదు. ఒకరికి సన్మార్గం చూపేది కేవలం అల్లాహ్ మాత్రమే. ఎవరికైనా అల్లాహ్ ఖుర్ఆన్‌తోనే సన్మార్గాన్ని చూపుతాడు.

ముహమ్మద్(స)వారి బాధ్యత కేవలం సందేశాన్ని అందజేయడం వరకే! స్వీకరించడం లేదా తిరస్కరించడం విన్నవారి ఇష్టం.

**ధర్మం విషయంలో బలవంతం లేదు** (ఖుర్ఆన్ 2:256)

మరియు వారితో అను : **"ఇది మీ ప్రభువు తరపు నుండి వచ్చిన సత్యం. కావున ఇష్టపడినవారు దీనిని విశ్వసించవచ్చు మరియు ఇష్టపడనివారు దీనిని తిరస్కరించవచ్చు!"** .... (ఖుర్ఆన్ 18:29)

నిరాడంబర జీవనంతో అత్యుత్తమ పరిపాలన అందించిన ఉమర్(రజి)వారి గురించి చదివితే ఇన్షా అల్లాహ్ రాతి గుండెలో సైతం చలనం కలిగే అవకాశం ఉంది. అటువంటి ఉమర్(రజి)వారి బానిస, ఆయన కోరినట్లు 'ఇస్లామ్' స్వీకరించలేదు. ఆయన తన బానిసను బలవంతం కూడా చేయలేదు. ఉమర్(రజి)వారిది అసాధారణమైన జ్ఞానం. ఆయన ప్రసంగం కూడా చాలా స్పష్టంగా, ప్రభావం కలిగించేలా ఉంటుంది. అయినప్పటికీ బానిస ఇస్లామ్ స్వీకరించ లేదు.

ఇస్లామ్ స్వీకరించిన వారు తమ కుటుంబంలో ఎవరైనా ఇస్లామ్ స్వీకరించకపోతే, ఖుర్ఆన్ సందేశాన్ని వినిపిస్తూనే ఉండండి. అల్లాహ్‌ను వేడుకొనండి. వారిని ధర్మంలోకి తీసుకురాగల శక్తి మనకు లేదు.

కొంతమంది చెబుతుంటారు, ఫలానా వ్యక్తి ప్రసంగం వలన లేదా ఫలానా వ్యక్తి చేసిన పని వలన ఎందరో ఇస్లామ్ స్వీకరించారని. అది నిజం కాదు.

**అల్లాహ్ మార్గం వైపు ప్రజలను ఆహ్వానించండి.** ఎందుకంటే అది మనపై నున్న బాధ్యత. కాని అలా చేసినందుకు వేతనం (జీతం) తీసుకోకండి. నమాజ్ చేయడం మనపై నున్న బాధ్యతే కదా, దానికి మనమేమైనా డబ్బు తీసుకుంటున్నామా?

మీ స్థాయికి తగినట్లు, మీకున్న జీవనోపాధిని బట్టి మీ తోటివారిని ఆహ్వానిస్తూ ఉండండి. **మీరు ముస్లిమ్‌గానే పిలవబడండి.**

మీరు ఖుర్ఆన్‌ను నేర్చుకుని ఇతరులకు నేర్పండి. అది కూడా అల్లాహ్ కోసమే. ప్రాపంచిక ప్రయోజనాన్ని ఆశించి చేయకండి. క్రింది హదీస్ చూడండి.

ఉబాదహ్ బిన్ సామిత్ ఉల్లేఖనం : 'అహలుస్సుఫ్ఫహ్' వారికి నేను **ఖుర్ఆన్ మరియు వ్రాయడం నేర్పాను.** మరియు వారిలో ఒకరు నాకు విల్లు (BOW)ను ఇచ్చారు. నేను చెప్పాను : ఇది నగదు (డబ్బు)కాదు, మరియు నేను (దీనితో బాణాలను) విసరగలను అల్లాహ్ మార్గంలో. నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స)ను దీని గురించి అడిగాను మరియు ఆయన చెప్పారు : **అగ్ని కంఠాభరణాన్ని నీ మెడచుట్టూ ఉంచడం నీకు సంతోషాన్ని కలిగిస్తే, దానిని స్వీకరించు.** (ఇబ్నెమాజా, హసన్ హదీస్ నెం. 2157, పుస్తకం 12, అధ్యా. 8, సంపుటి 3)

తరువాయి రెండు సంచికలు

చందాదారులకు

**జూన్' 2013 రెండవ వారంలో**

**ప్రత్యేక సంచికగా**

పంపబడుతుంది

ఇన్షా అల్లాహ్!




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్త విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## ఇబ్రాహీమ్(అ) ఇస్మా'ఈల్(అ)

గత కొన్ని సంచికల నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందించడం ప్రారంభించాము.

**గమనిక :** ఈ వ్యాసం పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉండాలని సులభతరం చేసి అందిస్తున్నాము.

(గత సంచిక తరువాయి భాగం)

విగ్రహాలు తయారుచేసే ఆజర్ ఇబ్రాహీమ్(అ)వారి తండ్రి. ఇబ్రాహీమ్(అ)వారు తన తండ్రి మరియు ప్రజలు విగ్రహారాధన చేయడాన్ని చూసి వారిని అడిగారు.

ఇబ్రాహీమ్ : **మీరెవరిని ఆరాధిస్తున్నారు?**

ప్రజలు : **మేము విగ్రహాలను ఆరాధిస్తున్నాము మరియు మేము వాటికే ఎల్లప్పుడు భక్తులమై ఉంటాము**

ఇబ్రాహీమ్ : **మీరు వీటిని పిలిచినప్పుడు ఇవి మీ మొరఆలకిస్తాయా? లేదా, మీకేమైనా మేలు చేయగలవా? లేదా హాని చేయగలవా?''**

ప్రజలు : **మేము మా తండ్రి తాతలను, వీటినే ఆరాధిస్తూ ఉండగా చూశాము**

ఇబ్రాహీమ్ : **వాస్తవానికి, మీరు మరియు మీ తండ్రితాతలు స్పష్టంగా మార్గ భ్రష్టత్వంలో పడి ఉన్నారు. 'అలా కాదు! భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు! ఆయనే వాటి నన్నింటినీ సృజించాడు. మరియు నేను ఈ విషయం గురించి మీ ముందు సాక్ష్యమిస్తున్నాను. మరియు నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను, మీరు వెళ్ళిపోయిన తరువాత మీ విగ్రహాలకు విరుద్ధంగా తప్పక యుక్తి పన్నుతాను.**

ఇబ్రాహీమ్(అ)వారు ఒక పెద్ద విగ్రహం తప్ప మిగిలిన వాటన్నింటినీ ముక్కలు ముక్కలుగా చేశారు, బహుశా వారు దాని వైపునకు మరలుతారని! ప్రజలు ఇబ్రాహీమ్(అ)వారిని అనుమానించారు.

ప్రజలు : **ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవేనా మా ఆరాధ్య దైవాలతో ఇలా వ్యవహరించిన వాడవు?**

ఆయన ఆ పెద్ద విగ్రహం గురించి ప్రస్తావిస్తూ,

ఇబ్రాహీమ్ : కాదు కాదు! వారిలోని ఈ పెద్దవాడే ఇలా చేశాడు! అవి మాట్లాడగలిగితే వాటినే అడగండి!'

**ఏమని అడగగలరు? అవి మాత్రం ఏమని సమాధానం చెప్పగలవు?** అవి మాట్లాడలేవని ప్రజలకు స్పష్టంగా తెలుసు. ఆ విషయాన్ని వారే చెప్పారు.

ఇబ్రాహీమ్ : **"అలా అయితే! మీరు అల్లాహ్‌ను వదలి, మీకెలాంటి లాభంగానీ, నష్టంగానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తారా?"**

ప్రజలు తమ విగ్రహాల ధ్వంసం విషయంలో ఇబ్రాహీమ్(అ)వారిని కాల్చివెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆయనను కాల్చడానికి మంటను సిద్ధం చేయ దలిచారు.

నగరంలోని వారందరూ పూర్తిగా ఒక నెలరోజుల పాటు కట్టెలను సేకరించడంలో మునిగిపోయారు. ఆ కట్టెలను కాల్చి ఆ మంటలో ఇబ్రాహీమ్(అ)వారిని వేయాలని వారి నిర్ణయం. వారు కట్టెలకు నిప్పు అంటించి అది భయానకంగా మండేలా వారం రోజుల పాటు రాజేసారు. వాటి జ్వాలలు ఆకాశాన్ని అంటుకుంటాన్నాయా అనిపించేలా.

అగ్ని బాగా ప్రజ్వరిల్లినప్పుడు పూర్తి భయంకరంగా మారినప్పుడు, దానిలోకి ఇబ్రాహీమ్(అ)వారిని విసిరివేయాలని నిర్ణయించుకున్నారు. కాని ఆ అగ్ని ఎంత తీవ్రతతో మండుతున్నదంటే, ఏ ఒక్కరూ దానిని

సమీపించడానికి ధైర్యం చేయలేకపోయారు. అప్పుడు వారికి షైతాన్ ఉపాయం చెప్పాడు. తాళ్ళతో ఎగురవేయడానికి ఉపయోగించే సాధనాన్ని ఉపయోగించి మంటల్లో విసరమని.

అల్లాహ్ స్నేహితుడైన ఇబ్రాహీమ్(అ)వారిని ప్రజలు మంటల్లో తోయడానికి సన్నద్ధమవు తుండగా భూమ్యాకాశాలలోని సకల జీవులు, అల్లాహ్ దూతలు ఇబ్రాహీమ్(అ)వారి పరిస్థితికి ఒకే విధంగా కేకలు వేయడం జరిగింది. అప్పుడు ఇబ్రాహీమ్(అ)వారికి సహాయం చేయడానికి అల్లాహుతాలా వారందరికి అనుమతినిచ్చారు. తమ సహాయం ఆయనకు అవసరమా అని అల్లాహ్ దూతలు ఇబ్రాహీమ్(అ)వారిని అడిగినప్పుడు, **తనను కాపాడటానికి అల్లాహ్ చాలు అని మరియు ఆయన తనని గమనిస్తూనే ఉంటారని సమాధానమిచ్చారు.**

జిబ్రీల్(అ)వారు కూడా తాను సహాయం అందించాలా అని అడిగినప్పుడు ఇబ్రాహీమ్(అ) బదులిచ్చారు **'నాకు తప్పకుండా సహాయం అవసరం, కాని అది అల్లాహ్ నుండే (రావాలి), మీ నుండి కాదు**''.

అల్లాహ్ అగ్నిని ఇలా ఆజ్ఞాపించారు :

**'ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!'**

అల్లాహ్ ఆదేశంతో అగ్ని చల్లబడి ఆయనకు సౌకర్యంగా మారింది. అది ఆయనకు ఆహ్లాదకరంగా మారింది. అంటే మంట మంటలాగే ఉంది. ఆయన చుట్టూ ఉన్న ఇతరత్రా అన్ని కాలిపోయాయి. ఆయనకు కట్టిన తాడు కాలిపోయింది. అయినా సరే ఆ మంట ఇబ్రాహీమ్(అ)వారి శరీరాన్ని తాకలేదు.

**కొన్ని చారిత్రక ఆధారాలను బట్టి ఆయన అగ్నిలో ఏడు రోజులు ఉన్నారని, ఆయన తన పూర్తి జీవితంలో ఆ ఏడు రోజులే ఎంతో సౌకర్యాన్ని పొందిన రోజులుగా ఆయన గుర్తుచేసుకునేవారని తెలుస్తుంది.**

అల్లాహ్ సహాయం తప్ప ఇతరుల సహాయాన్ని స్వీకరించడానికి ఇబ్రాహీమ్(అ)వారు ఇష్టపడలేదు.

విశ్వాసులకు అల్లాహ్ సహాయం అందిస్తారు, ఆయన విశ్వాసులైన తన దాసులను కనిపెట్టుకుని ఉంటారు. కేవలం అల్లాహ్ సహాయాన్ని మాత్రమే అర్థించేవారికి, అల్లాహ్ ఏ విధంగా సహాయం చేస్తారో పై సంఘటన తెలియజేసింది.

ఇబ్రాహీమ్(అ)వారు విగ్రహారాధకుడైన తన తండ్రికి హితబోధ చేశారు. కాని కుమారుడి హితబోధ తండ్రి చెవికెక్కలేదు. బదులుగా ఆగ్రహించాడు.

**''ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవు నా దేవుళ్ళకు విముఖత చూపుతున్నావా? ఒకవేళ నీవిది మానుకోకపోతే నేను నిన్ను రాళ్ళు రువ్వి చంపివేస్తాను. కావున నీవు నా నుండి చాలా దూరమైపో!''**

ఇబ్రాహీమ్(అ)వారు తన తండ్రి గురించి వేడుకున్నారు. **కాని కాఫిర్లకు అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించారు.** ఇబ్రాహీమ్(అ)వారి తండ్రిని అల్లాహ్ క్షమించలేదు.

ఇబ్రాహీమ్(అ)వారికి 'శారా'వారితో వివాహం జరిగింది.

ఇబ్రాహీమ్(అ)వారు తన భార్య 'శారా'తో ఓ క్రూరుడైన రాజు పాలించే భూభాగం గుండా వెళుతున్నప్పుడు, ఆ రాజుకి సమాచారం అందింది. ఒక మనిషి అందమైన స్త్రీతో కలిసి ఉన్నారని. ఆ రాజు ఇబ్రాహీమ్(అ) వారిని తన దగ్గరికి రమ్మని కబురు పంపి 'శారా' గురించి అడిగారు, ''ఆ స్త్రీ ఎవరు?'' 'ఆమె నా చెల్లెలు' అని ఇబ్రాహీమ్(అ)వారు చెప్పారు. ఇబ్రాహీమ్(అ)వారు తన జీవితంలో అప్పటికే అల్లాహ్ కోసం రెండు అబద్ధాలు చెప్పారు. ఇది 3వ అబద్ధం. ఇవి తప్ప ఆయన ఏ అబద్ధాలు చెప్పలేదు.

ఇబ్రాహీమ్(అ)వారు ఈ అబద్ధం చెప్పడానికి ఒక కారణం ఉంది. అదేమిటంటే, ఏ స్త్రీ అయినా సరే తన తండ్రి లేదా సోదరునితో వెళ్తుంటే, ఆ స్త్రీని ఆ రాజు వదిలేసేవాడు. తన భార్య గౌరవాన్ని కాపాడటానికే ఇబ్రాహీమ్(అ) ఆ విధంగా చెప్పారు.

రాజు దగ్గర నుండి వెనక్కి వచ్చిన తరువాత, ఆయన తన భార్య దగ్గరికి వెళ్ళి చెప్పారు, **'ఓ శారా! ఈ భూభాగంపై నువ్వు మరియు నేను తప్ప విశ్వాసులు లేరు. నీ గురించి అతడు నన్ను అడిగాడు మరియు నీవు నా సోదరివి అని చెప్పాను. కాబట్టి నా మాటను ఖండించకు.'**

ఆ క్రూరుడు శారాను పిలిపించాడు మరియు ఆమె అతని దగ్గరికి వచ్చినప్పుడు ఆమెను తన చేతితో పట్టుకుందామని ప్రయత్నించాడు. కాని అతని చేయి బిగుసుకు పోయింది. అతడు శారాను అడిగాడు, తన కొరకు అల్లాహ్‌ను ప్రార్థించమని మరియు ఆమెకు హాని తలపెట్టనని. కాబట్టి శారా అల్లాహ్‌ను అర్థించారు అతనికి నయం కావాలని. అతనికి నయమైంది.

అయినాసరే వాడి ఆలోచన మారలేదు. మరలా రెండవసారి పట్టుకోవడానికి ప్రయత్నించాడు, కాని అతని చేయి ఇంతకు పూర్వం కంటే ఎక్కువగా బిగుసుకు పోయింది. మరలా తన కొరకు అల్లాహ్‌ను ప్రార్థించమని కోరాడు. ఆమె అల్లాహ్‌ను అర్థించారు. తిరిగి అతడు బాగయ్యాడు.

ఆమెను తీసుకువచ్చిన భటుడిని పిలిచి, **'నీవు నా దగ్గరికి ఓ మనిషిని తీసుకురాలేదు. ఓ దెయ్యాన్ని తీసుకు వచ్చావు'** అన్నాడు.

ఆ రాజు 'హాజర'ను 'శారా'కు బహుమతిగా ఇచ్చాడు. 'శారా' ఇబ్రాహీమ్ (అ)వారి దగ్గరకు వచ్చి జరిగింది చెప్పారు. 'శారా' వారికి పిల్లలు కలుగలేదు.

ఇబ్రాహీమ్(అ)వారు హాజర వారిని వివాహం చేసుకున్నారు. వారిద్దరికీ జన్మించిన కుమారుడు - ఇస్మా'ఈల్(అ). ఈయన ద్వారా అరబ్బు జాతి

మక్కాలో విస్తరించింది. అందుకే 'హాజర' వారిని అరబ్బులకు మాతృమూర్తి అన్నారు.

హాజర వారికి ఇస్మా'ఈల్(అ) జన్మించే సమయానికి ఇబ్రాహీమ్(అ)వారి వయస్సు సుమారు 80 సంవత్సరాలు. మొదటి భార్య 'శారా'తో ఇబ్రాహీమ్(అ)వారికి అప్పటివరకూ సంతానం కలుగలేదు.

ఇద్దరి భార్యల మధ్య ఏవో అభిప్రాయ బేధాలొచ్చాయి.

ఇబ్రాహీమ్(అ) ఆమెను మరియు చనుబాలు త్రాగే కుమారుడు 'ఇస్మాయీల్(అ)ను 'కాబా'కు దగ్గరగా ఉండే ప్రదేశానికి (ఇప్పుడు) జమ్‌జమ్ ఉన్నచోటులో చెట్టు క్రిందకు, మస్జిద్ యొక్క ఎత్తైన ప్రదేశానికి తీసుకువచ్చారు.

ఆ రోజుల్లో మక్కాలో ఎవరూ లేరు. నీరు కూడా లేదు. ఆయన ఇద్దరిని అక్కడ కూర్చోబెట్టి ఖర్జూరాలు కలిగిన తోలు సంచిని మరియు కొంచెం నీరుగల ఓ చిన్న నీటితిత్తిని వారి దగ్గరలో ఉంచారు.

నీటితిత్తి నుండి ఇస్మా'ఈల్(అ) తల్లి నీటిని త్రాగేవారు. తన బిడ్డ ఆకలి తీర్చడానికి ఆమెలో 'పాలు' పెరిగేవి.

ఇంటివైపు ఇబ్రాహీమ్(అ)వారు బయలుదేరారు.

హాజర ఆయనను అనుసరించారు.

వారు 'కదా' అనే ప్రాంతాన్ని చేరుకున్నప్పుడు, ఆమె ఆయనని వెనుక నుండి పిలిచారు:

**'ఓ ఇబ్రాహీమ్! మీరెక్కడకు వెళుతున్నారు, ఎవరి సహవాసంలో సంతోషం కలుగుతుందో అటువంటి ఎవరూ లేని, ఏదీలేని ఈ లోయలో మమ్మల్ని వదిలి?'**

అవే మాటలను ఆమె చాలా సార్లు పలికారు, కాని ఆయన ఆమె వంక వెనుతిరిగి చూడలేదు. అప్పుడు ఆమె అడిగారు :

"**ఆ విధంగా చేయమని అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారా?**".

ఆయన అన్నారు "**ఔను**".

"**అయితే ఆయన (అల్లాహ్) మమ్మల్ని నిర్లక్ష్యం చేయరు**" అని ఆమె అన్నారు.

అల్లాహ్ ఆదేశించారని తెలియగానే **ఆమెలో అల్లాహ్ పట్ల ఎంత భరోసా!** అల్లాహ్ నిర్లక్ష్యం చేయరనే భరోసా ఉన్న ఏ విశ్వాసియైనా ఎటువంటి భయానక పరిస్థితులోనైనా జీవించడం సాధ్యం అవుతుందని చెప్పడానికి ఈమె ఒక ఉదాహరణ.

వారికి కనిపించనంత దూరంలో ఉన్న సనియా అనే చోటుకి చేరుకున్నాక, ఇబ్రాహీమ్(అ) కాబా వైపు తిరిగి రెండుచేతులు ఎత్తి ఈ దు'ఆ చేశారు.

**"ఓ మా ప్రభూ! వాస్తవానికి నేను నా సంతానంలో కొందరిని నీ పవిత్ర గృహం (కాబా) దగ్గర పైరు పండని, ఎండిపోయిన కొండలోయలో నివశింపజేశాను. ఓ మా ప్రభూ! వారిని అక్కడ సలాత్ (నమాజ్) స్థాపించడానికి ఉంచాను. కనుక నీవు ప్రజల హృదయాలను, వారివైపు ఆకర్షింపజెయ్యి మరియు వారు కృతజ్ఞులై ఉండటానికి వారికి జీవనోపాధిగా ఫలాలను సమకూర్చు" (ఖుర్'ఆన్ 14:37)**

భర్తతో మాట్లాడిన తరువాత ఆమె వెనక్కి తన చోటుకు వచ్చి నీటితిత్తి నుండి నీటిని త్రాగారు. ఆమె బిడ్డ కొరకు ఆమెలో పాలు పెరిగాయి. నీటితిత్తిలోని నీరు అంతా అయిపోయాక, ఆమెకు దాహం వేసింది మరియు ఆమె బిడ్డకు కూడా దాహంగా ఉంది. ఆమె బిడ్డ వైపు ఆందోళనతో చూస్తున్నారు.

తన బిడ్డ వంక చూసి సహించే శక్తిలేక, అతనిని వదిలి అక్కడికి సఫా పర్వతం దగ్గరగా ఉందని గ్రహించి, దానిపై నిలుచుని లోయ వంక నిశితంగా చూస్తున్నారు ఎవరైనా కనిపించ వచ్చేమోనని, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

తరువాత ఆమె సఫా పర్వతాన్ని దిగి లోయను చేరుకున్నాక, ఆమె తన దుస్తులను దోపుకుని, తీవ్రమైన కష్టాలలో ఉన్న వ్యక్తిలా లోయలో పరుగెత్తారు, ఆ లోయను దాటి మర్వా పర్వతాన్ని చేరేవరకూ. అక్కడ ఆమె నిలుచుని ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నారు, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

(ఆ రెండు కొండల మధ్య) ఆమె ఇటూ అటూ చాలాసార్లు పరుగెత్తారు. అప్పుడామె స్వగతంలో చెప్పుకున్నారు, '**నేను వెళ్ళి నా బిడ్డ పరిస్థితి చూడటం మేలు**'. ఆమె వెళ్ళి, చావు బతుకులలో ఉన్నట్టున్న తన బిడ్డను చూశారు. అతని ఆ స్థితిని చూసి సహించలేక పోయారు. (తనలో) చెప్పుకున్నారు, '**నేను వెళ్ళి చూస్తే, నాకు ఎవరైనా కనిపించవచ్చు**'. ఆమె వెళ్ళి సఫా పర్వతాన్ని అధిరోహించి చాలా సేపు చూశారు.

ఆమె ఈ విధంగా ఏడుసార్లు చేశారు. (అంటే సఫా పర్వతం నుండి మర్వా పర్వతానికి మధ్య 7 సార్లు).

**ఇక్కడ అతి ముఖ్యమైన ఓ విషయాన్ని గమనించాలి. అల్లాహ్‌పై పూర్తిగా ఆమెకు భరోసా ఉంది. అయినా సరే, అల్లాహ్ పేరుతో ప్రయత్నం చేయడం మాత్రం మానలేదు. ఆమె తన శక్తి మేర ప్రయత్నించారు.**

ఆఖరిసారిగా ఆమె 'మర్వా'ను చేరుకున్నప్పుడు మరలా ఆమె (స్వగతంలో) చెప్పుకున్నారు, 'నేను వెనక్కి వెళ్ళి బిడ్డ పరిస్థితిని చూడటం మేలు'. కాని అకస్మాత్తుగా **ఓ కంఠస్వరం వినబడింది.** ఆమె తనకు తాను నిశ్శబ్దంగా ఉండాలని చెప్పుకుని శ్రద్ధగా విన్నారు. ఆమె ఆ స్వరం మరలా విని చెప్పారు, **'మీ మాటలు నాకు వినిపించాయి. మీ దగ్గర సహాయం ఉందా?'**

ఆ కంఠస్వరం అల్లాహ్ యొక్క దూతయైన జిబ్రీల్(అ) వారిది. జిబ్రీల్(అ) నేలను తన కాలిమడమతో కొట్టారు. నీరు బయటకి ఉబికి

వచ్చింది. దాని చుట్టూ గట్టు వలే ఆమె తయారు చేశారు. ఈ విధంగా తన చేతులను ఉపయోగించి, నీటితిత్తిని తన చేతులతో నింపడం ప్రారంభించారు. మరియు దాని నుండి కొంత నీరు తోడాక నీరు బయటకు వస్తూనే ఉంది.

**ప్రవక్త(స)వారు చెప్పారు, ఇస్మా'ఈల్(అ)వారి తల్లిపై అల్లాహ్ కరుణను కురిపించుగాక! ఆమె జమ్‌జమ్‌ను అలా ఉండనిస్తే** (అంటే ప్రవాహాన్ని ఆపడానికి ప్రయత్నించకుండా లేక నీటి తిత్తిని నింపడానికి అందులోని నీటిని పైకెత్తకుండా ఉంటే), **జమ్‌జమ్ ఒక 'నది' గా మారి భూమిపై ప్రవహిస్తూ ఉండేది".**

ప్రవక్త(స)వారు చెప్పారు, 'తరువాత ఆమె (నీటిని) త్రాగారు మరియు బిడ్డచేత త్రాపించారు. జిబ్రీల్(అ) ఆమెతో చెప్పారు:

**'నిర్లక్ష్యం చేయబడ్డారని భయపడవద్దు. ఇది అల్లాహ్ యొక్క గృహం దీనిని ఈ బాలుడు మరియు అతని తండ్రి నిర్మిస్తారు మరియు అల్లాహ్ ఎన్నడూ తన ప్రజలను నిర్లక్ష్యం చేయరు'**

**అల్లాహ్ తన దాసులను నిర్లక్ష్యం చేయరు అనే విషయం ప్రతీ ముస్లిమ్ మనస్సులో స్థిరంగా నాటుకోవాలి.** అక్కడ కాబా మస్‌జిద్ పునాదులున్నాయి. ఆ పునాదిపై కాబా మస్‌జిద్ నిర్మాణాన్ని ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మా'ఈల్(అ) నిర్మిస్తారని ముందుగానే ఆ మాతృమూర్తికి సందేశం అందింది. ప్రవక్తలకు 'వహీ' అందజేసే జిబ్రీల్ (అ)వారే ఆమెకు ఆ సందేశాన్ని తెలిపారు.

ఆ సమయంలో కాబా గృహం ఎత్తైన ప్రదేశంలో ఓ చిన్న కొండను పోలి ఉంది. పెద్ద వానలు వచ్చినప్పుడు అవి గుట్టకు కుడివైపుకు మరియు ఎడమవైపుకు ప్రవహించేవి.

జుర్‌హుమ్ తెగవారు కొందరు ఆ ప్రాంతంవైపు వచ్చేవరకూ ఆమె ఆ విధంగా నివశించారు (లేక) జుర్‌హుమ్ కుటుంబం ఆమె మరియు ఆమె బిడ్డ ప్రక్కగా వెళ్ళడం జరిగింది. 'కదా' మార్గం నుండి వస్తున్నారు గనుక వారు మక్కా క్రింది భాగాన ఆగారు. **వారు ఒక పక్షిని చూశారు.**

వారు అన్నారు, "ఈ పక్షి ఖచ్చితంగా నీటి చుట్టూ ఎగురుతుంది, ఈ లోయలో నీరు లేదని మనకు తెలుసు". వారు ఒకరో ఇద్దరో దూతలను నీటిమూలాన్ని కనుగొనడానికి పంపారు. వారు నీటిని చూసి తిరిగి వచ్చారు. తరువాత వారందరూ నీటి వైపు వచ్చారు.

ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తి నీటికి సమీపంలో కూర్చుని ఉన్నారు. వారు ఆమెను అడిగారు **'మీతో ఇక్కడ ఉండటానికి అనుమతి నిస్తారా?'** ఆమె సమాధాన మిచ్చారు, 'అలాగే, కాని ఈ నీటిపై మీకు హక్కు ఉండదు'. దానికి వారు అంగీకరించారు.

ప్రవక్త(స) చెప్పారు : వారి సహచర్యం ఆమెకు సంతోషం కలిగిస్తుండడంతో, ఆ పరిస్థితులు ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తికి స్వాంతన నిచ్చాయి. వారు అక్కడే స్థిరపడిపోయారు.

తరువాత కాలంలో అక్కడ స్థిరపడినవారు తమ కుటుంబాల కొరకు కబురు పంపారు. వారు వచ్చి వీరితోపాటు స్థిరపడిపోయారు. ఆ విధంగా కొన్ని కుటుంబాల వారు (అక్కడ) శాశ్వత నివాశమేర్పరచుకున్నారు.

చూశారా! ఆమె తన బిడ్డతో అక్కడకు వచ్చేటప్పటికి నీరు లేదు, మనుష్యులు లేరు. కాని ఇప్పుడు అక్కడ నీరు ఉంది. కుటుంబాలు కూడా వచ్చి చేరాయి. ఇదే అల్లాహ్ కారుణ్యం. అల్లాహ్ విశ్వాసులను నిర్లక్ష్యం చేయరు.

ఆ బిడ్డ (ఇస్మా'ఈల్) పెరిగి పెద్దవాడయ్యారు మరియు వారి నుండి అరబీ భాష నేర్చుకున్నారు. మరియు (అతని సుగుణాల వలన) వారిచే ప్రేమించ బడ్డారు మరియు ఆయనతో పాటు వారి అభిమానమూ పెరిగింది.

ఇస్మా'ఈల్(అ)వారు సహనశీలుడని అల్లాహ్‌యే చెప్పారు.

అల్లాహ్ యొక్క సందేశం (వహీ) ప్రవక్తలకు చాలా రకాలుగా అందుతుంది. అందులో ఒకటి - కల(స్వప్నం) రూపంలో తెలియ జేయబడే వహీ.

ఇబ్రాహీమ్(అ)వారికి ఒక కలవచ్చింది. ఏమిటా కల?

*(మిగిలిన భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)*

**ఏ తప్పూ చేయకపోతే ధైర్యంగా ఉండవచ్చు**
**ఎవరికైనా ఆత్మాభిమానం చాలా ముఖ్యం**

చిన్నతనంలో ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)వారు తన స్నేహితులతో ఆడుకుంటున్నారు. వారు ఆడుకుంటుండగా అమీరుల్ మోమినీన్, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) అటువైపు వెళ్తున్నారు. ఖలీఫా గారు అటువైపు రావడం చూసి పిల్లలు వెంటనే అక్కడి నుండి పారిపోయారు. ఉమర్(రజి) అంటే వారికి భయం.

కాని అబ్దుల్లాహ్(రజి) ఉన్న స్థానంలోనే నిలబడి ఉన్నారు మరియు పారిపోలేదు. ఉమర్(రజి)వారు ఆ బాలుడిని అడిగారు :

**"నీవెందుకు (ఇతర) బాలురతో పారిపోలేదు?"**

అబ్దుల్లాహ్ : **"ఓ అమీరుల్ మోమినీన్! నేను ఎటువంటి పాపం చేయలేదు మరియు ఈ మార్గం ఇరుకుగానూ లేదు మీ కొరకు దారి ఇవ్వడానికి."**

ఈయన పెరిగి పెద్దయ్యాక కూడా ప్రతీ విషయంలో తన తల్లి అస్మా బిన్త్ అబీ బక్ర్(రజి)వారిని సంప్రదించేవారు. ఈ తల్లీ కుమారుల అపూర్వ సంభాషణ కొరకు శాంతిబాట ఫిబ్రవరి, 2013 సంచిక చూడండి.

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్వుదాం - 31

(ت اور تشدید زیادہ ہو) فَعَلَ లో అదనంగా ت మరియు ّ వచ్చినప్పుడు **تفعّل** فِعل ثلاثي مَزِيد فِيه [క్రియ యొక్క ఐదవ రూపం]

| | تَفَعُّل | مُتَفَعِّل | تَفَعَّل | يَتَفَعَّل | تَفَعَّل |
|---|---|---|---|---|---|
| **లోతుగా ఆలోచించుట** to think over; to reflect غورکرنا | గాఢాలోచన تَفَكُّر (తఫక్కుర్) | గాఢంగా ఆలోచించిన వాడు مُتَفَكِّر (ముతఫక్కిర్) | గాఢంగా ఆలోచించు تَفَكَّرْ (తఫక్కర్) | గాఢంగా ఆలోచిస్తాడు يَتَفَكَّرُ (యతఫక్కరు) | గాఢంగా ఆలోచించాడు تَفَكَّرَ (తఫక్కర) |
| **మందలించబడుట** to receive admonition نصیحت پکڑنا | تَذَكُّر (తజక్కుర్) | مُتَذَكِّر (ముతజక్కిర్) | تَذَكَّرْ (తజక్కర్) | يَتَذَكَّرُ (యతజక్కరు) | تَذَكَّرَ (తజక్కర) |
| **ఆధారపడుట** to put one's trust بھروسہ کرنا | تَوَكُّل (తవక్కుల్) | مُتَوَكِّل (ముతవక్కిల్) | تَوَكَّلْ (తవక్కల్) | يَتَوَكَّلُ (యతవక్కలు) | تَوَكَّلَ (తవక్కల) |
| **స్పష్టమగుట** to become clear ظاہر یا واضح ہونا | تَبَيُّن (తబయ్యున్) | مُتَبَيِّن (ముతబయ్యిన్) | تَبَيَّنْ (తబయ్యన్) | يَتَبَيَّنُ (యతబయ్యను) | تَبَيَّنَ (తబయ్యన) |
| **అవకాశం కోసం ఓర్పుతో ఎదురు చూచుట** انتظار کرنا to wait & watch for opportunity | تَرَبُّص (తరబ్బుస్) | مُتَرَبِّص (ముతరబ్బిస్) | تَرَبَّصْ (తరబ్బస్) | يَتَرَبَّصُ (యతరబ్బసు) | تَرَبَّصَ (తరబ్బస) |
| **విముఖమగుట** to turn away دوستی کرنا، منہ موڑنا | تَوَلٍّ (తవల్లిన్) | مُتَوَلٍّ (ముతవల్లి) | تَوَلَّ (తవల్ల) | يَتَوَلَّى (యతవల్ల) | تَوَلَّى (తవల్ల) |
| **మరణింపజేయుట** to make die جان نکالنا | تَوَفٍّ (తవఫ్ఫిన్) | مُتَوَفٍّ (ముతవఫ్ఫిన్) | تَوَفَّ (తవఫ్ఫ) | يَتَوَفَّى (యతవఫ్ఫ) | تَوَفَّى (తవఫ్ఫ) |

**تَفَاعَلَ**

(ت اور الف یعنی ا زیادہ ہو) فَعَلَ లో అదనంగా ت మరియు ا వచ్చినప్పుడు [క్రియ యొక్క ఆరవ రూపం]

| | تَفَاعُل | مُتَفَاعِل | تَفَاعَل | يَتَفَاعَل | تَفَاعَل |
|---|---|---|---|---|---|
| **శుభాన్ని పొందేవాడు** to be blessed or exalted برکت والا ہونا | تَبَارُك (తబారుక్) | مُتَبَارِك (ముతబారిక్) | تَبَارَكْ (తబారక్) | يَتَبَارَكُ (యతబారకు) | تَبَارَكَ (తబారక) |
| **ఒకరినొకరు ప్రశ్నించుకోవడం** to ask each other باہم سوال کرنا | تَسَاءُل (తసాఉల్) | مُتَسَاءِل (ముతసా'ఇల్) | تَسَاءَلْ (తసా'అల్) | يَتَسَاءَلُ (యతసా'అలు) | تَسَاءَلَ (తసా'అల) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** ***ఈ 31 నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 81.4***

ఈ నెల నేర్చుకున్న పదాలు 269 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 269 చోట్ల చూడవచ్చు) <u>source: www.emuslim.com</u>

ఈ 80శాతం పదాలను తెలిపిన పుస్తకంలో వివరణలు లేవు. కేవలం వాటి అర్థాలు మాత్రమే ఉన్నాయి. కాని సగటు ముస్లిమ్‌కి వీటిపై కనీస అవగాహన కలిగించాలనే సంకల్పంతో స్వయంగా శాంతిబాట టీమ్ ఈ రెండు పేజీలలో ఆ పదాలకు వివరణను అందిస్తుంది. ఈ వివరణకు మరియు మాతృకకు సంబంధం లేదు.

ఈ 31వ పాఠంలో క్రియ (Verb)యొక్క 5వ రూపానికి మరియు 6వ రూపానికి చెందిన పదాలు ప్రస్తావించ బడ్డాయి. ఇంతవరకూ క్రియ యొక్క 4 రూపాల గురించి ఉదాహరణ పూర్వకంగా శాంతిబాటలో వివరించడం జరిగింది.

ప్రస్తుతం ప్రస్తావించబడిన **5వ రూపం,** క్రియ యొక్క రెండవ రూపానికి చెందిన పదానికి ముందు '**త**' అనే అక్షరాన్ని కలపడం ద్వారా ఉత్పన్నమౌతుంది.

ఈ 5వ రూపం నిర్మాణంలోగాని లేదా అర్థంలోగాని రెండవ రూపాన్ని తరచుగా ప్రతిబింబిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, తనకు తాను స్వయంగా చేసే పనిని తెలుపుతుంది.

ఉదాహరణకు **అల్లమ** (عَلَّمَ) అంటే బోధించడం. **తఅల్లమ** (تَعَلَّمَ) అంటే నేర్చుకోవడం (తనకు తాను స్వయంగా బోధించుకోవడం ద్వారా). **అల్లమ** అనేది 2వ రూపానికి మరియు **తఅల్లమ** అనేది 5 రూపానికి చెందిన క్రియా పదాలు. మరో విధంగా చెప్పాలంటే, క్రియ యొక్క 5వ రూపం స్వయంగా చేసేపనిని మరియు ఆ పనియొక్క తీవ్రతను తెలియజేస్తుంది.

పాఠంలో ఇవ్వబడిన రెండవ పదం చూడండి : **తజక్కర** (تَذَكَّرَ) ఇది Past Tense (భూతకాలం) - జరిగిపోయిన దానిని సూచిస్తుంది. **<u>య</u>తజక్కర** అనే పదం వర్తమాన మరియు భవిష్యత్తు కాలాలను (Present and Future Tenses) సూచిస్తుంది.

| | | |
|---|---|---|
| 2వ రూపం - **యుజక్కిర్** | **to remind** | **జ్ఞాపకం చేయుట** |
| 5వ రూపం - **యతజక్కర్** | **to remember**<br>(to remind yourself) | **జ్ఞాపకం చేసుకొనుట**<br>**(తనకు తాను స్వయంగా జ్ఞాపకం చేయుట)** |

**యుజక్కిర్ అనే పదం ఇతరులకు జ్ఞాపకం చేయడాన్ని సూచిస్తే యతజక్కర్ అనే పదం తనకు జ్ఞాపకం చేయడాన్ని సూచిస్తుంది.**

**ఫక్కర :** (బాగా ఆలోచించుట)

వాస్తవానికి అతడు **<u>ఆలోచించాడు</u>** మరియు మనసులో ప్రణాళిక చేసుకున్నాడు. కావున (అతనిని) తాను ప్రణాళిక చేసినట్లు నాశనానికి గురికానివ్వండి!" (ఖుర్'ఆన్ 18-19)

పై పదం 'ఫక్కర' కు ముందు 'త' అనే అక్షరాన్ని కలిపితే 'తఫక్కర' అవుతుంది. అప్పుడు ఈ పదం స్వయంగా ఆలోచించడాన్ని మాత్రమే కాకుండా, చాలా లోతుగా చేసే ఆలోచనను కూడా సూచిస్తుంది. తఫక్కర - Past Tense. దీనికి ముందు 'య' తగిలిస్తే అది 'యతఫక్కర్' అవుతుంది. ఇది వర్తమాన మరియు భవిష్యత్తు కాలాలను (Present and Future Tenses) సూచిస్తుంది.

**యతఫక్కర్** (يَتَفَكَّرُ) - ఓ కారణాన్ని తెలుసుకోవడం కోసం పరిపరి విధాలా లోతుగా ఆలోచించడం.

**ఈ అర్థాన్ని ప్రాక్టికల్‌గా గ్రహించడానికి, ఈ పదం కలిగిన ఖుర్'ఆన్ ఆయత్‌లను దిగువున అందిస్తున్నాము. వాటిని చదివితే ఎటువంటి విషయాలలో గాఢంగా ఆలోచించ వలసిన అవసరం ఉందో తెలుస్తుంది.**

ఎవరైతే నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా, అన్ని వేళలా అల్లాహ్‌ను స్మరిస్తారో, భూమ్యాకాశాల నిర్మాణాన్ని గురించి **<u>ఆలోచిస్తారో!</u>** "ఓ మా ప్రభూ! నీవు ఇది వ్యర్థంగా సృష్టించలేదు. నీవు సర్వలోపాలకు అతీతుడవు. మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు." **(ఖుర్'ఆన్ 3:191)**

పై ఆయత్‌లో చెప్పబడిన భూమ్యాకాశాల నిర్మాణం గురించి అర్థం చేసుకోవడానికి చేసే ఆలోచన, సాధారణ ఆలోచన కాదు. ఆ నిర్మాణంలోని గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికై చాలా లోతుగా చేసిన ఆలోచన. అటువంటి ఆలోచన ద్వారా అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని తెలుసుకున్నవారు అల్లాహ్‌ను ఏ విధంగా ప్రార్థిస్తారో పై ఆయత్‌లో ప్రస్తావించబడింది.

**కేవలం అనువాదాలను మాత్రమే చదివేవారికి అరబీ పదాల ఔన్నత్యం పూర్తిగా అర్థం కాదు. అన్ని రకాల 'ఆలోచన' ఒకే రకమైన ఆలోచనగా అనువాదంలో చెబితే, మనపై పడే ఆ ఆయత్ యొక్క ప్రభావం పూర్తి స్థాయిలో ఉండదు.**

"..... నీవు వారికి ఈ గాథలను వినిపిస్తూ ఉంటే, బహుశా వారు **<u>ఆలోచించ వచ్చు!</u>**" (ఖుర్'ఆన్ 7:176)

"వాస్తవానికి ఈ ప్రాపంచిక జీవితాన్ని ఇలా పోల్చవచ్చు - మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా దాని నుండి భూమిలో మానవులకు మరియు పశువులకు తినటానికి, వివిధ రకాల చెట్లూ చేమలూ పెరుగుతాయి. అప్పుడు భూమి తన అలంకారంతో వర్థిల్లుతూ ఉండగా, దాని యజమానులు నిశ్చయంగా, అది తమ వశంలో ఉందను కుంటారు. అలాంటి సమయంలో అకస్మాత్తుగా రాత్రి పూటనో లేక పగటి పూటనో మా తీర్పు వస్తుంది. అప్పుడు మేము దానిని - నిన్నటి వరకు ఏమీ లేని - కోసివేసిన పంటపొలంగా మార్చివేస్తాము. ఈ విధంగా మేము మా సూచనలను **<u>ఆలోచించే</u>** ప్రజల కొరకు వివరిస్తాము." **(ఖుర్'ఆన్ 10:24)**

"మరియు ఆయనే భూమిని విశాలంగా చేసి దానిలో స్థిరమైన పర్వతాలను మరియు నదులను నెలకొల్పాడు. అందులో ప్రతి

రకమైన ఫలాన్ని, రెండేసి (ఆడ-మగ) జతలుగా చేశాడు. ఆయనే రాత్రిని పగటి మీద కప్పుతాడు. నిశ్చయంగా వీటన్నింటిలో **ఆలోచించేవారి** కొరకు సూచనలు ఉన్నాయి.'' **(ఖుర్'ఆన్ 13:3)**

''ఆయన దీని (నీటి) ద్వారా మీ కొరకు పంటలను, జైతున్ మరియు ఖర్జూరపు వృక్షాలను, ద్రాక్ష మరియు ఇతర రకాల ఫలాలను పండింప జేస్తున్నాడు. నిశ్చయంగా **ఆలోచించే** వారికి ఇందులో ఒక సూచన (నిదర్శనం) ఉంది. **(ఖుర్'ఆన్ 16:11)**

(పూర్వపు ప్రవక్తలను) మేము స్పష్టమైన నిదర్శనాలతో మరియు గ్రంథాలతో పంపాము. మరియు ఇప్పుడు ఈ జ్ఞాపికను (ఖుర్'ఆన్ను) నీపై అవతరింప జేసింది వారి వద్దకు అవతరింప జేయబడిన దానిని వారికి నీవు స్పష్టంగా వివరించడానికి మరియు బహుశా వారు **ఆలోచిస్తారేమోనని**!'' **(ఖుర్'ఆన్ 16:11)**

''తరువాత అన్ని రకాల ఫలాలను తిను. ఇలా నీ ప్రభువు మార్గాలపై నమ్రతతో నడువు.'' దాని కడుపు నుండి రంగు రంగుల పానకం (తేనె) ప్రసవిస్తుంది. అందులో మానవులకు వ్యాధి నివారణ ఉంది. నిశ్చయంగా, ఇందులో **ఆలోచించే** వారికి సూచన ఉంది. **(ఖుర్'ఆన్ 16:69)**

ఏమీ? వారు **తమలో తాము ఆలోచించ లేదా?** ఆకాశాలనూ, భూమినీ మరియు వాటి మధ్య ఉన్నదంతా, అల్లాహ్ సత్యంతో ఒక నిర్ణీత గడువు కొరకు మాత్రమే సృష్టించాడని? అయినా నిశ్చయంగా ప్రజలలో చాలా మంది తమ ప్రభువును దర్శించ వలసిన వాస్తవాన్ని తిరస్కరిస్తున్నారు. **(ఖుర్'ఆన్ 30:8)**

''మరియు ఆయన సూచనలలో : ఆయన మీ కొరకు మీ జాతి నుండియే - మీరు వారి వద్ద సౌఖ్యం పొందటానికి - మీ సహవాసులను (జీవిత భాగస్వాములను) పుట్టించి, మీ మధ్య ప్రేమను మరియు కారుణ్యాన్ని కలిగించడం. నిశ్చయంగా, ఇందులో **ఆలోచించే** వారికి ఎన్నో సూచనలున్నాయి. **(ఖుర్'ఆన్ 30:21)**

మరియు ఆయన ఆకాశాలలో మరియు భూమిలో నున్న సమస్తాన్ని, తన (అనుగ్రహంతో) మీకు ఉపయుక్తంగా చేశాడు. నిశ్చయంగా, ఇందులో **ఆలోచించేవారికి** ఎన్నో సూచన(ఆయత్) లున్నాయి. **(ఖుర్'ఆన్ 45:13)**

పై ఆయత్‌లలో అల్లాహ్ మనల్ని స్వయంగా ఆలోచించమని చెబుతున్నారు. మనకు ఆయన అనుగ్రహించిన పూర్తి వివేకాన్ని ఉపయోగించి ఆలోచించాలి. ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఆలోచించమని చెప్పే ఆయత్‌ల గురించి ఆలోచిస్తే, ఇన్షా అల్లాహ్, మనకు ఖుర్'ఆన్‌అర్థం చేసుకునే జ్ఞానం కూడా పెరుగుతుంది. పై వివరణ ద్వారా క్రియాపదం యొక్క 5వ రూపం మీకు అర్థమై ఉంటుందని భావిస్తున్నాము.

**క్రియ యొక్క 6వ రూపం :**

سَأَلَ అంటే ప్రశ్నించుట. ఈ పదాన్ని 6వ రూపంలోకి మారిస్తే, అంటే పదం ప్రారంభంలో 'త' అనే అక్షరాన్ని కలిపి మొదటి అక్షరమైన 'س' కు 'అలిఫ్'ను చేరిస్తే 'తసాఅల' (تَسَاءَلَ) అవుతుంది. ఈ పదం **'పరస్పరం ప్రశ్నించుకోవడం'** లేదా **'పరస్పరం సంప్రదించుకోవడం'** అనే అర్థాన్నిస్తుంది. క్రింది రెండు ఆయత్‌లలో ఈ పదం ఉపయోగించ బడింది.

فَعَمِيَتْ عَلَيْهِمُ الْأَنبَآءُ يَوْمَئِذٍ فَهُمْ لَا يَتَسَآءَلُونَ

ఆ రోజు వారి కారణాలన్నీ అస్పష్టమై పోతాయి. మరియు వారు ఒకరితో నొకరు సంప్రదించుకోనూ లేరు.'' (ఖుర్'ఆన్ 28:66)

فِى جَنَّٰتٍ يَتَسَآءَلُونَ

వారు స్వర్గాలలో ఉంటూ **ఒకరికొకరు ఇలా ప్రశ్నించుకుంటారు!**'' (ఖుర్'ఆన్ 74:40)

తనకు తాను స్వయంగా పని చేసుకోవడాన్ని 5వ రూపం మరియు పరస్పరం చేసే పనిని 6వ రూపం తెలియజేస్తున్నాయి.

## అరబీ భాష నేర్చుకోండి

అరబీ భాషను నేర్చుకోమని రెండవ ఖలీఫా అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు ప్రోత్సహించేవారు. ఎందుకంటే అది ఖుర్'ఆన్ యొక్క భాష. ఆయన అరబ్బులను సైతం సరియైన అరబీ నేర్చుకోమని ప్రోత్సహించేవారు.

**"అరబీ నేర్చుకోండి, ఎందుకంటే వాస్తవానికి, అది మీ మనస్సును బలోపేతం చేస్తుంది మరియు ఒకరి గౌరవం మరియు మర్యాదల స్థాయిని పెంచుతుంది."**

మరో సందర్భంలో ఇలా అన్నారు :

**"అరబీ నేర్చుకోండి మీరు సునన్** (సున్నత్‌కు బహువచనం) **మరియు ఫరాయిజ్** (తప్పనిసరిగా చేయవలసిన ఆచరణలు) **నేర్చుకున్నట్లుగా"**

మరో సందర్భంలో ఇలా అన్నారు :

**"ఖుర్'ఆన్ యొక్క వ్యాకరణ నిర్మాణాన్ని** (grammatical construction) **నేర్చుకోండి, దాని కంఠస్థాన్ని నేర్చుకున్నట్లుగా."**

అరబీ భాషలో మంచి ప్రావీణ్యం కలిగి చేయవలసిన ఉద్యోగాలు ఉండేవి. గవర్నర్లకు వారు లేఖకులుగా పనిచేసేవారు. వారు గనుక అరబీ వ్యాకరణం విషయంలో పొరపాట్లు చేస్తే, వారిని దండించేవారు.

● ముస్లిములంతా ఐక్యంగా ఉండాలి

# ఫిఖ్ الفقه

**ఫిఖ్ పట్ల సరియైన అవగాహన ఏర్పడితే, సూక్ష్మ బేధాలతో దూరంగా ఉన్న వారంతా దగ్గరౌతారు. ముస్లిములు ఐక్యంగా ఉండ గలుగుతారు.**

.... శాంతిబాట సంచికలో 'హదీస్ విజ్ఞానం' శీర్షికలో **బుఖారీ(ర)వారి సలహా** గురించి తెలియజేశాము. 'ముహద్దిస్' కావడానికై శిక్షణ కోసం వచ్చిన అల్-వలీద్ గారికి బుఖారీ(ర)వారు ఇచ్చిన సలహా అది.

ముహద్దిస్ (హదీస్‌లు సేకరించే వ్యక్తి) కావడం ఎటువంటి కష్టాలతో కూడుకున్నదో వివరించిన తరువాత, దానికంటే తక్కువకాని మరో రంగాన్ని ఆయన సూచించారు. అదే ఫిఖ్. దాని కోసం ప్రయాణాలు చేయనవసరం లేదు. ఇంట్లో కూర్చునే నైపుణ్యం సంపాదిచ్చ వచ్చని ఆయన సూచించారు.

**'హదీస్' మరియు 'ఫిఖ్'కు మధ్య ఉన్న తేడా ఏమిటి?**

హదీస్ సైన్స్ గురించి, వాటి వివిధ ప్రామాణిక రూపాల గురించి ఉదాహరణ పూర్వకంగా మొదటి రెండు సంవత్సరాలలో వివరించడం జరిగింది. **ఈ ప్రామాణిక హదీస్‌లు పరస్పరం ఖండించుకోవు.** ఇటువంటి కొన్ని వేల ప్రామాణిక హదీస్‌లు నేడు మనకు అందుబాటులో ఉన్నాయి.

ఆ విధంగా వాటిని మనకు అందుబాటులో తేవడానికి ఎందరో ముహద్దిస్‌లు జీవితాంతం శ్రమించారు. ఉదాహరణకు మాలిక్(ర)వారి 'ముఅత్తా', అహమద్(ర)వారి 'ముస్నద్ అహమద్', బుఖారీ(ర)వారి 'అల్-జామి' అస్-సహీహ్ అల్-ముస్‌నద్ మిన్-హదీస్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, వ సుననిహి వ అయ్యామిహి (సహీహ్ బుఖారీ)', సహీహ్ ముస్లిమ్, సునన్ అబూదావూద్, జామి' అత్తిర్మిజీ, సునన్ అన్-నసాయీ, సునన్ ఇబ్నెమాజా మొదలైనవి.

వీటిపై శాంతిబాట పాఠకులకు ఒక అవగాహన ఉంది. ఇక ఫిఖ్ గురించి తెలుసుకుందాం. డిక్షనరీలో 'ఫిఖ్' అనే పదానికి అర్థం - ఇల్ముల్ అహ్‌కామ్, షరీఅహ్.

ఫిఖ్‌ను ఇలా నిర్వచించవచ్చు : "**ఫిఖ్** అనేది ఇస్లామీయ ధర్మశాస్త్రం. ఇది ఇస్లామీయ న్యాయశాస్త్ర మీమాంస".

అర్థాలు : అవగాహన, అర్థం చేసుకోబడింది, జ్ఞానం మరియు ధర్మశాస్త్రం. **ఫఖీహ్** అంటే న్యాయశాస్త్ర నిపుణుడు. ఇస్లామీయ శాసనాల విషయాలలో ప్రావీణ్యం గలవాడు. ఇస్లామీయ చట్ట (షరి'అహ్) నిబంధనల పరిధిలో తీర్పునిచ్చే నైపుణ్యం గలవాడు. 'ఫఖీహ్'కు బహువచన పదం **ఫుఖహా**.

ఇస్లామీయ చట్టం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లపై ఆధారపడింది. **ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లు తెలిపిన సత్యాన్ని అర్థం చేసుకోవడమే ఫిఖ్.** కాబట్టి 'ఫిఖ్' అంటే 'జ్ఞానం'. దీని గురించి ప్రతీ ముస్లిమ్ తెలుసుకోవాలి.

ఒక భాషలో చదవడం మరియు వ్రాయడం నేర్చుకున్న వ్యక్తి, అదే భాషలో ఉన్న అన్ని పుస్తకాలను చదవగలడు. కాని అన్నింటిని అర్థం చేసుకోలేడు. ఉదాహరణకు భౌగోళిక శాస్త్రం గురించి వ్రాసిన పుస్తకాన్ని చదివాడు అనుకుందాం. అందులో ఎన్నో రకాల విషయాలు ఉంటాయి. అవి అర్థం కావాలంటే అతనికి అప్పటికే కొంత ప్రాథమిక జ్ఞానం కలిగి ఉండాలి. ఒకవేళ అటువంటి జ్ఞానం లేకపోయినా సరే భూమి ఆకారం గుడ్డు ఆకారంలో ఉంటుందని, సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయని తెలిపే కొన్ని విషయాలు స్పష్టంగానే అర్థమౌతాయి.

కాని ఏ విషయాన్ని కూడా అధ్యయనం చేయకుండా, తనకు ఎలా అర్థమైతే అదే జ్ఞానం అని అనుకుంటే, అటువంటిది స్వీకరించ బడదు.

రెండవ ఖలీఫా అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారు - 'పేదవారికి మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడాన్ని' ఇలా అర్థం చేసుకున్నారు - **పేదవారు అంటే ముస్లిములలో పేదవారు మరియు అవసరంలో ఉన్నవారు అంటే ముస్లిమేతర ధర్మాలలో ఉండే పేదవారు.** ఈయన జ్ఞానం గురించి ముహమ్మద్(స)వారు చెప్పిన విషయాలను ఇదే వ్యాసంలో తరువాయి పేజీలలో చూడండి.

ఖుర్'ఆన్, హదీస్ గ్రంథాలు, సీరత్ గ్రంథాలు, అరబీ గ్రామర్ మొదలైన వాటిని బాగా అధ్యయనం చేసినవారికి ధార్మిక జ్ఞానం ఉంటుంది. దాని ప్రకారం వారు ప్రజలకు బోధించ వలసి ఉంటుంది.

ఒకే స్కూలులో చదువుకున్న వారందరి జ్ఞానం ఒకే విధంగా ఉండదు. ఒకే స్కూలులో ఒకే టీచర్ బోధనలోనే నేర్చు కున్నప్పటికీ, విద్యార్థులకు స్వతహాగా ఉండే విషయగ్రాహణ శక్తిని బట్టి అర్థం చేసుకోగలుగుతారు.

ఒక రైతు స్కూలుకి వెళ్ళకపోయినా, అగ్రికల్చరల్ డిగ్రీ లేకపోయినా, తన తండ్రి నుండి శిక్షణ పొంది పంటలు పండించ గలుగుతాడు. కాని ఆ పని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు చేయలేక పోవచ్చు.

కాబట్టి 'జ్ఞానం' అనేది అల్లాహ్ యొక్క అనుగ్రహంగా తెలుసుకోవాలి. అల్లాహ్ ఎవరికైనా మేలు చేయాలనుకుంటే, వారికి జ్ఞానాన్ని ఇస్తారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు

(స) చెప్పారు: **ఎవరికైతే అల్లాహ్ మేలు చేయాలనుకుంటారో, అతనికి ధర్మాన్ని అర్థం చేసుకునే శక్తినిస్తాడు** (తిర్మిజీ - సహీహ్, 2645, పుస్తకం 39, అధ్యా.1, సంపుటి5)

ఇక్కడ ఈ సందర్భంగా ఓ విషయాన్ని చెప్పాలి. శాంతిబాట 4వ సంచికలో **'చిన్ని సత్కార్యం - గొప్ప ఫలితం'** అనే టైటిల్‌తో ఓ హదీస్‌ను అందించడం జరిగింది. ఆ హదీస్‌ను బట్టి, తోటివారికి ఇబ్బంది కలుగుతుందని ముళ్ళ కంపను ప్రజలు నడిచే దారి నుండి తొలగించిన వ్యక్తిని అల్లాహ్ క్షమించారు (స్వర్గాన్ని ఇచ్చారు) అని తెలుస్తుంది.

ఇంత చిన్న పనికే అంత పెద్ద బహుమానమా అని ఆశ్చర్యం కలుగుతుంది. **తోటివారికి ఇబ్బంది కలుగకూడదనే అతని సంకల్పాన్ని గొప్ప విషయంగా అల్లాహ్ మనకు స్పష్టం చేశారు.** తోటివారు అంటే కేవలం ముస్లిములే కాదు, ఏ ధర్మానికి చెందిన వారైనా సరే. ఇది ఈ హదీస్ ద్వారా అర్థమయ్యే విషయం (ఫిఖ్).

రాత్రివేళ ఆ దారిలో ఎవరైనా కాలినడకన ప్రయాణం చేయవచ్చు. వారికి దారిలో అడ్డంగా ఉన్న ముళ్ళ కంప కనిపించకపోవచ్చు. ఆ ముళ్ళ కంప పరిమాణాన్ని బట్టి, అది చిన్న గాయం లేదా అతి పెద్ద గాయానికి కారణం కావచ్చు. ఎవరి సహాయమూ అందక ఆ వ్యక్తి అలాగే రాత్రంతా ఉండి పోవచ్చు.

ఫలానా దారిలో ఫలానా గొయ్యి ఉంటుంది లేదా ఓ ముళ్ళ చెట్టు ఉంటుందని ముందుగా తెలిసినవారు జాగ్రత్త పడవచ్చుగాని కొత్తవారికి అది తెలియదు. **'తోటివారికి ఇబ్బంది కలుగ కూడదనే సంకల్పాన్ని'** తెలియజేసే పై హదీస్ విషయంపై ధార్మిక విద్యను అభ్యసించిన ఇద్దరు వ్యక్తులు రమదాన్ నెలలో ఓ మస్జిద్‌లో చేసిన వ్యాఖ్యలను ఇక్కడ ఉదాహరిస్తున్నాము.

తోటిముస్లిముల కోసం మస్జిద్‌లో ఎ.సి. మెషీన్లు ఏర్పాటు చేయడం కూడా అటువంటిదే అనే విధంగా ఒకరు వ్యాఖ్యానించడంతో, ఎ.సి. మెషీన్లు ఏర్పాటు చేశారు. అదే విద్యాలయంలో చదువుకున్న మరో వ్యక్తి దీనికి భిన్నంగా ఎ.సి. మెషీన్లు వృథా అని అదే మస్జిద్‌లో అదే నెలలో వ్యాఖ్యానించడం జరిగింది.

తొలి మస్జిద్‌ను ముహమ్మద్(స)వారు సహాబాలతో కలిసి నిర్మించారు. అది ఖర్జూరపు ఆకులు మరియు బోదెలతో నిర్మించ బడింది. ప్రజలు ఎడారులలో సలాత్ (నమాజ్) చేశారు.

ఎ.సి. మస్జిద్‌లో సలాత్ చేసుకునే ప్రతీ వ్యక్తికి తన ఇంట్లో ఎ.సి. సదుపాయం లేదు కదా! ఇంటి నుండి మస్జిద్‌కు వచ్చే దారి పూర్తిగా ఎ.సి. చేయబడ లేదు కదా! కాస్సేపు మస్జిద్‌లో ఎ.సి. లేకుండా సలాత్ చేసుకోవడం వలన కొత్తగా కలిగే ఇబ్బంది ఏమీ లేదు.

అయినా ఇటువంటి ఇబ్బందులకి మరియు హదీస్‌లో ప్రస్తావించ బడిన దానికి పోలిక లేనే లేదు. ఆ మెషీన్లకయ్యే ఖర్చుతో మరియు వాటి కరెంట్ నిమిత్తం ప్రతీ నెలా చెల్లించే సొమ్ముతో ఎంతో మంది పేదవారికి సహాయ పడవచ్చు. పేదవారికి సహాయం అందడం చూస్తే ముహమ్మద్(స)వారి ముఖం ప్రకాశించేది.

**గమనిక :** ఎ.సి. వంటి సౌకర్యాలు మస్జిద్‌లలో ఏర్పాటు చేసుకోవడం అక్కడి వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. అది ఇస్లామ్‌కి వ్యతిరేకమైన పని ఎంతమాత్రం కాదు. జ్ఞానులుగా పరిగణించబడు తున్నవారు హదీస్‌లను ఏ స్థాయిలో అర్థం చేసుకుంటున్నారో మరియు బోధిస్తున్నారో తెలపడానికి జరిగిన ఓ సంఘటనను ఇక్కడ ఉదాహరించడం జరిగింది.

## మూడు విషయాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

(మనుష్యుల హృదయాలలో లేదా ఓ సమాజంలో) ఇస్లామ్‌ను నాశనం చేసే మూడు కారణాలను ఉమర్(రజి)వారు చెప్పారు.

1. జ్ఞాని తప్పు వలన
2. ఖుర్‌ఆన్ విషయమై వాదించే మునాఫిక్ వాదన వలన
3. ప్రజలను మార్గభ్రష్టత్వం వైపు నడిపించే నాయకుల వలన.

ఈ మూడు ప్రస్తుతం మన సమాజంలో నెలకొని ఉన్నాయి.

కాబట్టి ఇస్లామ్‌ను నాశనం చేసే శక్తులను నియంత్రించ వలసిన బాధ్యత ప్రజలపై ఉంది.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ 'ఆస్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : "అల్లాహ్ ప్రజల నుండి జ్ఞానాన్ని లాక్కొని తీసేసుకోరు. ముఖ్యంగా, ఆయన జ్ఞానులను తీసుకుపోవడం ద్వారా జ్ఞానాన్ని తీసేసుకుంటారు, ఒక్క జ్ఞాని కూడా లేనంత వరకూ.

**ప్రజలు అజ్ఞానులను నాయకులుగా ఎన్నుకుంటారు.** వారు (అంటే అజ్ఞానులు) ప్రశ్నించబడతారు మరియు వారు **జ్ఞానం లేకుండానే ఫత్వాలు జారీచేస్తారు.** వారు మార్గభ్రష్టులౌతారు మరియు ఇతరులను మార్గభ్రష్టత్వం వైపు తీసుకెళతారు. **(సహీహ్ ముస్లిమ్, 6796, 47వ పుస్తకం-కితాబుల్ ఇల్మ్, అధ్యా.5, సంపుటి 7)**

## ప్రజలకు జ్ఞానం ఉందా?

తెలిసిగాని, తెలియక గాని జ్ఞానులు చేసే తప్పులను ప్రజలు స్వయంగా అర్థం చేసు కోవాలంటే **ప్రజలకు కూడా ధర్మం పట్ల కనీస అవగాహన ఉండాలి.** జ్ఞానం లేకపోతే తఖ్వా లేదు. తఖ్వా లేకపోతే స్వర్గం లేదు. అంటే అల్లాహ్ తన సృష్టికర్త అని, ఆయన సర్వం వినేవాడని, సర్వం తెలిసినవాడని, జీవనోపాధిని ఇచ్చేవాడని మొదలైన విషయాల పట్ల ఓ వ్యక్తికి జ్ఞానం లేకపోతే **తనంతట తాను స్వయంగా** 'మస్జిద్‌కే రాడు.

**మస్జిద్‌కు సలాత్ (నమాజ్) చేసుకుందామని ఒక వ్యక్తి వచ్చాడంటే, జమాత్‌తో కలిసి సలాత్ చేయాలని మరియు అల్లాహ్ ఆదేశాన్ని ఆ విధంగా పాటించాలనే జ్ఞానం ఆ వ్యక్తికి ఉన్నదని అర్థం చేసుకోవాలి.**

అయితే జ్ఞానంలో ఒకరి స్థాయి తక్కువ మరియు మరొకరి స్థాయి ఎక్కువ కావచ్చుగాని, కనీస జ్ఞానం అనేది ప్రతీ ముస్లిమ్‌కి తప్పనిసరి.

## సమాజంలో మన స్థాయిని జ్ఞానం పెంచుతుంది

ప్రతీ మనిషి జీవితంలో మంచి స్థితిని పొందడానికి ప్రయత్నాలు చేస్తుంటాడు. ఏ జ్ఞానాన్ని అతడు కలిగి ఉంటే అతని ప్రయత్నం సులభంగా ఫలిస్తుందో, అటువంటి జ్ఞానం గురించి క్రింది హదీస్ తెలియ జేస్తుంది.

నాఫి' బిన్ అబ్దుల్ హారిస్, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారిని 'ఉస్ఫాన్‌లో కలిశారు. ఉమర్ ఆయనను మక్కాలో తన గవర్నర్‌గా నియమించి నప్పుడు ఎవరిని నీవు లోయ ప్రజలపై నీ ప్రతినిధిగా నియమించావు?'' (అని అడిగారు) ఆయన చెప్పారు : ''నేను వారిపై ఇబ్నె అబ్‌జాను నియమించాను. ఉమర్(రజి) అడిగారు : ''ఎవరు ఇబ్నె అబ్‌జా?'' నాఫి' చెప్పారు: స్వేచ్ఛ పొందిన మన బానిసలలో ఒకరు''. ఉమర్(రజి) అడిగారు : **''ఒక స్వేచ్ఛ పొందిన బానిసను వారిపై మీరు నియమించారా?''** నాఫి' చెప్పారు: ''అతనికి అల్లాహ్ గ్రంథం పట్ల గొప్ప జ్ఞానం ఉంది, వారసత్వ నియమాలు (ఫరా'యిజ్)లో జ్ఞానం గలవాడు మరియు తీర్పు ఇచ్చేవాడు''. ఉమర్(రజి) అన్నారు : ''మీ ప్రవక్త(స) చెప్పలేదా?'' (స్థాయిలో) **కొంతమందిని ఈ గ్రంథం (ఖుర్'ఆన్)ద్వారా అల్లాహ్ పైకి లేపుతాడు మరియు** (కొంతమందిని) **దీని వలన క్రిందికి తీసుకువెళతాడు''** (ఇబ్నెమాజా; సహీహ్, 218)

మిడిమిడి జ్ఞానంతో ఖుర్'ఆన్ వాక్యాలపై వాదనలు చేస్తూ నాశనమైన వారెందరో ఉన్నారు.

## జ్ఞానాన్ని పొందడానికి ఉండవలసిన సంకల్పం

అల్లాహ్ కోసం జ్ఞానాన్ని సంపాదించాలి. డబ్బు సంపాదించాలనే ధ్యేయంతో కాదు. నేటి జ్ఞానులలో చాలామంది సంపాదనా ధ్యేయంతోనే ఉన్నారు.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. **"ఎవరైతే జ్ఞానాన్ని పొందుతారో వారు దానితో అల్లాహ్ సంతోషాన్ని కోరతారు. కాని ప్రాపంచిక ప్రయోజనం కోసమే దానిని పొందితే, అతడు స్వర్గ సువాసనను పునరుత్థాన దినమున ఆఘ్రానించ లేడు"** (ఇబ్నెమాజా, హసన్, 252)

కసీర్ బిన్ ఖైస్ చెప్పారు : ''డమాస్కస్ మస్‌జిద్‌లో అబూదర్దా(రజి) వారితో కూర్చుని ఉండగా ఓ వ్యక్తి అతని దగ్గరికి వచ్చి చెప్పాడు: ''ఓ అబూదర్దా! నేను మీ దగ్గరకు రసూలుల్లాహ్(స)వారి నగరం మదీనా నుండి ఓ హదీస్ కొరకు వచ్చాను (ఆ హదీస్‌ను) మీరు ప్రవక్త(స)వారి నుండి ఉల్లేఖించినట్లు నేను విన్నాను.

ఆయన (అబూ దర్దా) అడిగారు : <u>నీవు వ్యాపారం కొరకు రాలేదా?</u>

అతను చెప్పారు : **లేదు**

ఆయన అడిగారు : **<u>నీవు మరిదేనికొరకూ రాలేదు!</u>**

అతను చెప్పారు : **లేదు**

ఆయన (అబూదర్దా) అన్నారు : నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను, ''ఎవరైతే జ్ఞానం కొరకు ఓ మార్గాన్ని అనుసరిస్తారో, అల్లాహ్ అతనికి స్వర్గానికి వెళ్ళేదారిని సులభతరం చేస్తారు. దేవదూతలు తమ రెక్కలను దించుతారు జ్ఞానాన్ని అన్వేషించేవానికి నమ్మతిని తెలియజేస్తూ మరియు భూమ్యాకాశాల్లో నున్న ప్రతీదీ (అల్లాహ్‌ను) ప్రార్థిస్తుంది జ్ఞానాన్ని అన్వేషించేవానిని క్షమించమని, సముద్రంలోని చేప సైతం (అల్లాహ్‌ను ప్రార్థిస్తుంది).

జ్ఞాని యొక్క ఆధిక్యత (కేవలం) ఆరాధించేవానిపై ఎలా ఉంటుందంటే (పౌర్ణమి) చంద్రుని ఆధిక్యత ఇతర ఖగోళ పదార్థాల పై ఉండే విధంగా. **జ్ఞానులు ప్రవక్తల యొక్క వారసులు.** ప్రవక్తలు వారి వెనుక దీనార్లు గాని, దిర్హములుగాని వదిలి వెళ్ళరు ప్రధానంగా **జ్ఞానాన్ని వదిలి వెళతారు**, కాబట్టి ఎవరైతే జ్ఞానాన్ని తీసుకుంటారో, వారు గొప్ప వాటాను తీసుకున్నట్లే. **(ఇబ్నెమాజా, 223, అబూదావూద్ 3641)**

ఈ వాటాను ఎవరెంత తీసుకున్నా తరగదు. సామాన్య ముస్లిములు కూడా ఈ వాటా పొందేలా మనం ప్రయత్నించాలి.

## తమకోసం దు'ఆ చేయమని చాలామంది కోరుతుంటారు

ఇది సర్వసాధారణం. అయితే ఆ విధంగా కోరినప్పటికీ దు'ఆ చేస్తారో? లేదో? తెలియకపోవచ్చు. కాని ఎవరూ కోరకపోయినా సరే, చీమ వంటి అతి చిన్న జీవి మరియు చేపలు కూడా ఒకరి కోసం దు'ఆ చేస్తాయి. ఆ ఒకరు మీరెందుకు కాకూడదు? క్రింది హదీస్ చూడండి.

అబూ ఉమామా అల్-బాహిలీ (రజి) ఉల్లేఖనం. ''రసూలుల్లాహ్ (స)వారి దగ్గర ఇద్దరు మనుష్యులు ప్రస్తావించ బడ్డారు. వారిలో ఒకరు **ఆరాధించేవాడు** మరియు మరొకరు **జ్ఞాని**. కాబట్టి రసూలుల్లాహ్(స) చెప్పారు : ఆరాధించే వానిపై జ్ఞాని కుండే ఆధిక్యత మీలోని అందరికంటే తక్కువ వారిపై నా ఆధిక్యత ఎలా ఉంటుందో అలా ఉంటుంది. తరువాత రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, వాస్తవానికి అల్లాహ్, ఆయన దూతలు, భూమ్యాకాశాలలో ఉండేవారు, రంధ్రంలో ఉండే ఓ చీమ సైతం, చేప సైతం - ప్రజలకు మంచి చేయమని బోధించేవారిపై అల్లాహ్ అనుగ్రహాన్ని కోరుకుంటారు. **(తిర్మిజీ - హసన్, 2685, పుస్తకం 39, అధ్యా. 19, సంపుటి 5)**

పై హదీస్‌లో ఆరాధించేవాడు, జ్ఞాని అని ఇద్దరి గురించి చెప్పబడింది. ఆరాధించేవాడు అంటే అల్లాహ్‌ను ఆరాధించేవాడు. అయితే అతని కున్న జ్ఞానం తక్కువ. ఆరాధనా పద్ధతులు మాత్రమే తెలుసు. రెండవ

వ్యక్తి జ్ఞాని. ఇతడూ అల్లాహ్‌ను ఆరాధిస్తాడు. అయితే ఇతనికి జ్ఞానం ఉంది. జ్ఞానం అల్లాహ్ పట్ల భయాన్ని పెంచుతుంది. ఆ భయం వల్లనే ఎవరికీ భయపడకుండా సమాజంలో మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడం చేయగలుగుతాడు. చెడుకు దూరంగా ఇన్షా అల్లాహ్ ఉండవచ్చు. ఆరాధించేవాని విలువ తగ్గలేదు. ఆ ఆరాధించే వాడు ఎక్కువ జ్ఞానాన్ని పొందితే అతని ఆధిక్యత పెరుగుతుంది.

మస్జిద్‌లో పుస్తకాలు ఏర్పాటు చేసుకుని, ఇమామ్ పర్యవేక్షణలో జ్ఞానాన్ని పొందడం కష్టమైన పని కాదు. ఆ విధంగా ప్రజలు జ్ఞానాన్ని పొంది, స్పష్టంగా అర్థమైన జ్ఞానంతో వారు మంచి చేయమని ఇతరులకు బోధిస్తే, ఆ విధంగా బోధించే వారిని అనుగ్రహించమని **కాపట్యం లేని ఎన్నో మూగజీవులు కూడా దు'ఆ చేస్తాయి**. అంతేకాకుండా ఆ జ్ఞానం అతనిని, ఇన్షా అల్లాహ్, ఉత్తముడిగా మారుస్తుంది.

> ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. **మీలో ఉత్తమమైనవాడు** అతనే ఎవరైతే ఖుర్ఆన్ నేర్చుకుని మరియు దానిని బోధిస్తాడో" **(ఇబ్నెమాజా - సహీహ్, 212, పుస్తకం 1, అధ్యా.16, సంపుటి1)**

## హదీస్‌ను ఒకరి కంటే మరొకరు బాగా అర్థం చేసుకోవచ్చు

హదీస్‌ను అర్థం చేసుకోవడం ఫిఖ్. అయితే హదీస్‌ను ఉన్నది ఉన్నట్టుగా చెబితే, చెప్పినవాని కంటే విన్నవాడు ఎక్కువ జ్ఞానం గలవాడు అయితే, దానిని ఇంకా బాగా అర్థం చేసుకుంటాడు.

> అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స)వారు చెప్పారు : నా మాటలను విన్న వ్యక్తిని అల్లాహ్ ప్రకాశవంతం చేయుగాక! అతడు దానిని **అర్థం చేసుకుంటాడు**, దానిని జ్ఞాపకం ఉంచుకుంటాడు మరియు దానిని అందజేస్తాడు. **బహుశా అతడు ఆ ఫిఖ్‌ని తనకంటే ఎక్కువగా అర్థం చేసుకునే వ్యక్తి దగ్గరికి తీసుకువెళతాడు.** మూడు ఉన్నాయి వాటి వలన ఓ ముస్లిమ్ హృదయం మోసగింపబడదు. అల్లాహ్ కొరకు చేసే ఆచరణలలో నిజాయితీ, నసీహా, ముస్లిముల ఆఇమ్మాకు మరియు జమఅత్‌ని అంటిపెట్టుకుని ఉండటం. వాస్తవంగా పిలుపు వారి వెనుక నుండి రక్షింపబడుతుంది. **(తిర్మిజీ, సహీహ్, 2658, పుస్తకం 39, అధ్యా.7, సంపుటి 5)**

అంటే ఓ హదీస్‌ను ప్రవక్త(స)వారి నుండి విని మరొకరికి చెప్పినప్పుడు ప్రత్యక్షంగా విన్న వ్యక్తి కంటే, రెండవ వ్యక్తి దానిని బాగా అర్థం చేసుకోవచ్చు. హదీస్‌ను అర్థం చేసుకోవడం జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. జ్ఞానం అల్లాహ్ అనుగ్రహంపై ఆధారపడి ఉంటుంది.

**పై హదీస్‌కి సంబంధించి ఒక ఉదాహరణ** : ముహమ్మద్(స)వారి సతీమణి మరియు విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారు హదీస్‌లను ఏ స్థాయిలో అర్థం చేసుకునేవారో చూడండి.

- అబూహురైరా(రజి) ఉల్లేఖించిన ఒక సంఘటన ప్రకారం: ఒక స్త్రీ ఒక పిల్లిని కట్టివేసింది. దానికి తినడానికీ, త్రాగడానికీ ఏమీ పెట్టేది కాదు. ఆ పిల్లి అదే స్థితిలో ఆకలి దప్పులతో అలమటించి చనిపోయింది. ఆ కారణంగా ఆ స్త్రీ అల్లాహ్ శిక్షకు గురయింది.

  అబూహురైరా(రజి)వారు ఒకసారి ఆయిషా(రజి)వారి ఇంటికి పరామర్శకు వెళ్లారు. అప్పుడు ఆయిషా(రజి)వారు అడిగారు : "ఒక పిల్లిని హింసించినందుకుగాను ఒక స్త్రీ శిక్షకు గురయిందన్న ఉల్లేఖనాన్ని తెలిపింది మీరే కదా!". "అవును. ప్రవక్త(స) వారు చెప్పగా నేను విన్నాను" అని అబూహురైరా(రజి) అన్నారు.

  **"అల్లాహ్ దృష్టిలో ఒక విశ్వాసి వ్యక్తిత్వం అంతకన్నా ఉన్నతమైంది. ఒక పిల్లి కోసమని అల్లాహ్ ఆమెను శిక్షకు గురి చేస్తారా? ఆ స్త్రీ ముస్లిమ్ కాదు మరియు ఈ శిక్ష ఇవ్వబడింది ఎందుకంటే ఆమె అల్లాహ్‌ను తిరస్కరించినందుకు మరియు దాని తరువాత పిల్లిని చంపినందుకు. *ఓ అబూహురైరా (రజి)! ప్రవక్త(స) చెప్పిన విషయాన్ని ఉల్లేఖించే టప్పుడు మీరేం చెబుతున్నారో ఆలోచించుకోండి*"** అని ఆయిషా(రజి) అన్నారు. (పుస్తకం: షరహ్ సహీహ్ బుఖారీ. కాతిబ్: షంషుద్దీన్ సఫరీ)

  పై హదీస్‌ను ఉల్లేఖించిన అబూహురైరా(రజి)వారి కంటే ఆయిషా(రజి) వారికి అర్థం చేసుకునే జ్ఞానం ఎక్కువ అని అర్థమౌతుంది. అబూహురైరా(రజి)వారు అత్యధిక హదీస్‌లను ఉల్లేఖించిన సహాబీ.

- అబూ స'ఈద్ ఖుద్రీ(రజి) అవసాన కాలంలో కొత్తబట్టలు రప్పించుకుని వాటిని ధరించారు. కారణం అడగ్గా "ముస్లిం ఏ దుస్తుల్లో మరణిస్తే ఆ దుస్తులతోనే లేపబడతాడు" అని చెప్పారాయన. ఆయిషా(రజి)వారికి ఈ సంగతి తెలిసింది. "అబూ సయీద్‌పై అల్లాహ్ దయతలచు గాక! దుస్తులు అంటే ప్రవక్త(స) వారి దృష్టిలో **ఆచరణలు** అని భావం. ప్రజలు పునరుత్థాన దినమున నగ్న శరీరంతో, తలనుండి కాళ్ళవరకు అనాచ్ఛాదిత శరీరాలతో లేపబడతారు అని ప్రవక్త(స) స్పష్టంగా చెప్పి ఉన్నారు".

తీర్పుదినం నాడు నగ్న శరీరాలతో లేపబడతారని ప్రవక్త(స)వారు చెప్పారు గనుక, మరణించినప్పటి దుస్తులలో లేపబడతారనే విషయం ఎవరి నుండి అయినా వినినప్పుడు, రెండు హదీస్‌లను వినిన వ్యక్తి ఆలోచించాలి. నగ్న శరీరాలతో లేపబడతారనే విషయం ముహమ్మద్(స) వారి నుండి ఆయిషా(రజి)వారు వినడమే కాకుండా, ఆ విషయంపై మరిన్ని వివరాలు ఆయన నుండి అడిగి తెలుసుకున్నారు. ఆ రోజున ప్రజలు నగ్న శరీరాలతో ఉన్నప్పటికి, అవేమీ పట్టించుకోలేని స్థితిలో భయంతో ఉంటారు.

> ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "ప్రజలు సమావేశపరచ బడతారు కాళ్ళకు ఏమీ లేకుండా (చెప్పుల్లేకుండా), నగ్నంగా మరియు ఖత్‌నా చేయబడని

విధంగా. నేను అడిగాను, "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! పురుషులు మరియు స్త్రీలు పరస్పరం చూసుకుంటారా? ఆయన(స) అన్నారు, "పరిస్థితి వారికి చాలా కఠోరంగా ఉంటుంది దానిని పట్టించు కోవడానికి." (అంటే భయం యొక్క తీవ్రత చాలా ఎక్కువ ఉంటుంది ఒకరినొకరు పట్టించుకునే పరిస్థితిలో ఉండరు.) **(సహీహ్ బుఖారీ, 6527, పుస్తకం 81, అధ్యా. 45, సంపుటి 8)**

ఈ హదీస్ గురించి బహుశా అబూ స'ఈద్ ఖుద్రీ గారికి తెలిసుండక పోవచ్చు. లేదా అవసాన కాలంలో ఆ విషయం గుర్తు రాకపోయి ఉండవచ్చు. ఈ హదీస్‌ను ఇబ్నె అబ్బాస్(రజి)వారు కూడా ఉల్లేఖించారు.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. నేను విన్నాను రసూలుల్లాహ్ (స) చెబుతుండగా మింబర్‌పై ఖుత్బా ఇస్తున్నప్పుడు, "మీరు అల్లాహ్‌ను కలుస్తారు కాళ్ళకు ఏమీ లేకుండా, నగ్నంగా మరియు ఖత్‌నా చేయబడని విధంగా." **(సహీహ్ బుఖారీ, 6525, పుస్తకం 81, అధ్యా.45, సంపుటి 8)**

ఖుత్బా (శుక్రవారం ప్రసంగం)లో చెప్పారు కాబట్టి ఈ విషయం చాలామంది వినే ఉంటారు. అంతేకాకుండా ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఉల్లేఖించిన మరో హదీస్ (6526)ను బట్టి, ఆ రోజు మొట్టమొదట దుస్తులు తొడగబడేవారు - ఇబ్రాహీమ్(అ).

ఒక హదీస్‌ను చదివినప్పుడు లేదా విన్నప్పుడు మన మనస్సులో దానికి సంబంధించిన ఎన్నో విషయాలు స్ఫురణకు రావాలి. ఖుర్'ఆన్‌లో భార్యాభర్తల నుద్దేశించి వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు అని అల్లాహ్ చెప్పారు. కాబట్టి ఇక్కడ 'దుస్తులు' అనే పదానికి భాషాపరమైన అర్థం తీసుకో కూడదు.

కాబట్టి ఒక ధార్మిక విషయం మనకు బాగా అర్థం కావాలంటే, ఆ విషయానికి సంబంధించి ఖుర్'ఆన్ ఆయత్‌లు మరియు మనకు అందుబాటులో ఉండే అన్ని హదీస్‌లను అధ్యయనం చేయాలి.

## అందుబాటులో ఉండే మొత్తం హదీస్‌ల అధ్యయనం

ఈ సందర్భంగా ఇక్కడ ఒక ఉదాహరణ తెలపాలి. అయితే ముందుగా పాఠకులు ఇదివరకే శాంతిబాటలో ప్రచురించబడిన రెండు వ్యాసాలను మరొకసారి చదవాలి.

1. 'పంట భాగస్వామ్యం' విషయంలో భూమి యజమాని మరియు కౌలుదారుడు ఏయే విషయాల నుండి నిరోధించబడ్డారో ప్రామాణిక హదీస్‌లతో వివరించబడిన వ్యాసం. (శాంతిబాట, డిశంబర్, 10, పేజీ 12-13)
2. హదీస్ విజ్ఞానం శీర్షిక - ముజ్‌తరిబ్ గురించి వివరించబడిన వ్యాసం (ఫిబ్రవరి, 11, శాంతిబాట, పేజీ 9-11)

**పై రెండు వ్యాసాలలో చాలా హదీస్‌లను అందించాము.**

వ్యవసాయ భూమిని వేరొకరికి అద్దెకు ఇచ్చేటప్పుడు, దాని ఫలసాయాన్ని పంచుకునే విధంగా అద్దెకు ఇవ్వకూడదు. నగదు రూపంలో అద్దె తీసుకోవచ్చు. లేదా ఉచితంగా తన (ధార్మిక) సోదరునికి అద్దెకు ఇవ్వవచ్చు.

అప్పటి వరకూ పంటలో భాగస్వామ్యం ఉండేది. కాని ప్రవక్త(స)వారు ఆ విధానాన్ని నిరోధించారు.

ఈ నిరోధానికి సంబంధించిన హదీస్‌లు ముఖ్యంగా రాఫి' బిన్ ఖదీజ్(రజి) నుండి అందాయి. ఆ హదీస్‌లలో తనకు అందుబాటులో ఉన్న కొన్నింటిని పరిగణన లోకి తీసుకుని ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు ఆ హదీస్‌లను 'ముజ్‌తరిబ్'గా వివరించారు. అంటే ఆయన అభిప్రాయం ప్రకారం అవి స్థిరత్వం లేనివి. ఆ హదీస్‌లు స్వీకరించ కూడదు.

కాని రాఫి' బిన్ ఖదీజ్(రజి)వారి హదీస్‌లు సహీహ్ బుఖారీలో, సునన్ అబూదావూద్‌లో మరియు సునన్ అన్-నసాయీలో గ్రంథస్థం కాబడ్డాయి. వాటిని ప్రామాణిక హదీస్‌లుగా తీసుకున్నారు.

ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు పరిగణనలోకి తీసుకున్న హదీస్‌లను పరిశీలిస్తే, ఆయన ఆ విధంగా నిర్ణయానికి రావడంలో అవి అనుకూలంగా ఉన్నాయని తెలుస్తుంది. పైన తెలిపిన 2వ వ్యాసంలో ఈ విషయాలు చర్చించబడ్డాయి.

సునన్ అన్-నసాయీ గ్రంథంలో 40కి పైగా హదీస్‌లు ఈ విషయంపై ఇవ్వడం జరిగింది. వాటిలో స్పష్టంగా వివరించిన ఒక పెద్ద హదీస్ కూడా ఉంది. వాటన్నింటిని అధ్యయనం చేస్తే రాఫి' బిన్ ఖదీజ్(రజి) వారి ఉల్లేఖనాలలో అస్థిరత లేదని, అవి స్పష్టంగానే ఉన్నాయని అర్థమౌతుంది.

పై విషయాలను బట్టి, రెండు ముఖ్య విషయాలు తెలుస్తున్నాయి.

1. ప్రామాణికత విషయంలో ముహద్దిస్‌లు చాలా కఠినంగా వ్యవహరించారు. ఒక హదీస్‌ను స్వీకరించాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు.
2. ఒకే విషయంపై ఉన్న హదీస్‌లన్నింటిని పూర్తిగా అధ్యయనం చేయకుండా ఒక నిర్ణయానికి రాలేము.

## ఫిఖ్ ఎప్పుడు ప్రారంభమైంది?

చాలా పుస్తకాలలో 'ఫిఖ్' అనేది ఉమర్(రజి)వారి సృష్టి అని వ్రాశారు. అది సరికాదు. 'ఫిఖ్' అంటే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను అర్థం చేసుకోవడం కనుక, ఇది తొలి నుండీ ఉంది. ఆయిషా(రజి)వారికి ఓ ఖుర్'ఆన్ ఆయత్ విషయంలోగాని, ఓ హదీస్ విషయంలోగాని పూర్తి అవగాహన కలిగే వరకూ ముహమ్మద్(స) వారిని అడిగి తెలుసుకునే వారు. ఉమర్(రజి)వారు కూడా అదే విధంగా ప్రతీ విషయాన్ని ముహమ్మద్(స)వారి నుండి క్షుణ్ణంగా తెలుసుకునేవారు. కాబట్టి **ఫిఖ్ తొలి నుండే ఉంది.**

حَدَّثَنَا ابْنُ أَبِي عُمَرَ: حَدَّثَنَا سُفْيَانُ عَنْ عَبْدِ المَلِكِ بْنِ عُمَيْرٍ، عَنْ عَبْدِ الرَّحمٰنِ بْنِ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ يُحَدِّثُ عَنْ أَبِيهِ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ : ((نَضَّرَ اللهُ امْرَءًا سَمِعَ مَقَالَتِي فَوَعَاهَا وَ حَفِظَهَا وَبَلَّغَهَا، فَرُبَّ حَامِلِ فِقْهٍ إِلَى مَنْ هُوَ أَفْقَهُ مِنْهُ. ثَلَاثٌ لَا يُغَلُّ عَلَيْهِنَّ قَلْبُ مُسْلِمٍ : إِخْلَاصُ العَمَلِ للهِ، وَمُنَاصَحَةُ أَئِمَّةِ المُسْلِمِينَ، وَلُزُومِ جَمَاعَتِهِمْ، فَإِنَّ الدَّعْوَةَ تُحِيطُ مِنْ وَرَائِهِمْ)).

అంతేకాకుండా, **'ఫిఖ్' అనేది కొత్త పదం కూడా కాదు.** ముహమ్మద్(స)వారు ఆ పదాన్ని పలికారు. పై హదీస్ చూడండి : ఫిఖ్ అనే పదం అండర్‌లైన్ చేయబడింది.

పై హదీస్ ద్వారా ప్రవక్త(స)వారే చెప్పారు, ఒకరు అర్థం చేసుకున్న దానికంటే మరొకరు ఎక్కువగా అర్థం చేసుకునే అవకాశం ఉందని. జ్ఞానం పెరిగే కొద్దీ అర్థం చేసుకునే శక్తి కూడా పెరుగుతుంది.

ఉమర్(రజి)వారు ఖలీఫా అయిన తరువాత విజ్ఞాన కేంద్రాలను వివిధ నగరాలలో ప్రారంభించారు. ముస్లిమ్ సామ్రాజ్యం పెరుగుతూ ఉంది. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఇస్లామ్‌లో ప్రవేశిస్తున్నారు. వారికి జ్ఞానాన్ని అందించవలసిన బాధ్యత సాధారణంగా నాయకునిపైనే ఉంటుంది. కాబట్టి ప్రజలకు జ్ఞానాన్ని నేర్పించేందుకు విద్యాలయాలను ఉమర్(రజి)వారు నెలకొల్పారు. మదీనా నగరాన్ని గొప్ప విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దారు.

ఒక్క మదీనాలోనే 130మంది సహచరులు ముఫ్తీలుగా ఉండేవారు. వారందరిలో బాగా ముఖ్యులు : 1. ఉమర్(రజి) 2. అలీ(రజి) 3. అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) 4. ఆయిషా(రజి) 5. జైద్ బిన్ సాబిత్ (రజి) 6. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) 7. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)

అరేబియాలోని అందరి జ్ఞానం త్రాసులోని ఒక పళ్ళెంలో మరియు రెండవ పళ్ళెంలో ఉమర్(రజి)వారి జ్ఞానాన్ని ఉంచితే, ఉమర్(రజి)వారి జ్ఞానమే ఎక్కువ బరువు ఉంటుందని అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి) వారు అన్నారు.

ఉమర్(రజి)వారి జ్ఞానానికి సంబంధించి ముహమ్మద్(స)వారు చెప్పిన మూడు విషయాలు ఇక్కడ గుర్తుచేస్తున్నాము.

## జ్ఞానం

హమ్జా యొక్క తండ్రిగారి ఉల్లేఖనం:
అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "నేను పడుకుని ఉండగా, నన్ను నేను (పానీయం) త్రాగుతున్నట్లుగా చూశాను మరియు నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే దాని యొక్క తడి నా గోళ్ళ నుండి బయటికి వస్తున్నట్లుగా గమనించాను. తరువాత నేను (పానీయాన్ని) ఉమర్‌కు ఇచ్చాను. వారు (ప్రవక్త(స)వారి అనుచరులు) అడిగారు, "(ఈ కల యొక్క) అర్థమేమిటి?" ఆయన చెప్పారు, "**అది జ్ఞానం**".**(సహీహ్ బుఖారీ, 3681, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

## దీన్

"నేను నిద్రలో ఉండగా, (కలలో) చూశాను ప్రజలు నాకు చూపించ బడటాన్ని. వారు చొక్కాలు ధరించి ఉన్నారు మరియు వారిలోని కొందరి చొక్కాలు తమ ఛాతీని చేరుకున్నాయి. (అంటే అవి మెడ నుండి ఛాతీ భాగాన్ని మాత్రమే కప్పుతున్నాయి) మరియు కొందరి చొక్కాలు దాని కంటే క్రిందికి ఉన్నాయి. తరువాత ఉమర్(రజి) నాకు చూపబడ్డారు మరియు ఆయనపైన చొక్కా ఉంది దానిని అతను నేలపై ఈడుస్తున్నారు."

ఆ కల యొక్క అర్థం గురించి సహచరులు అడిగారు. రసూలుల్లాహ్ (స)వారు చెప్పారు : "**దీన్ (ధర్మం)**"

నేలపై ఈడుస్తూ నడిచినప్పుడు, నేలపై ఆనవాళ్ళు పడతాయి. ఆ ఆనవాళ్ళు ఆయన మరణం తరువాత వదిలి వెళ్ళిన మంచి ఆచరణలకు మరియు ప్రతిపాదించి సాధించినవాటికి ఉపమానంగా కొందరు వ్యాఖ్యానించారు.

## పరిపాలన

అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "నేను స్వప్నంలో బకెట్ (చేద)తో బావి నుండి నీరు తోడుతున్నట్లుగా చూశాను. తరువాత అబూబకర్ వచ్చి ఒకటో, రెండో బకెట్ల (నీటిని) తోడారు. మరియు అతను నీటిని తోడటంలో కొంత బలహీనత కనిపించింది. అల్లాహ్ ఆయనని క్షమించుగాక! తరువాత ఉమర్ బిన్ ఖత్తాబ్ వచ్చారు మరియు ఆ బకెట్ అతని చేతులలో పెద్దదై పోయింది. అంతగా కష్టపడి పనిచేసే అతని వంటి బలమైన వ్యక్తిని నేనెన్నడూ చూడలేదు. ఆయన చాలా ఎక్కువ నీటిని తోడారు ప్రజలు తృప్తిగా త్రాగారు మరియు అక్కడే కూర్చున్న వారి ఒంటెలకు త్రాపించారు."
**(సహీహ్ బుఖారీ, 3682, పుస్తకం 62, అధ్యా. 6, సంపుటి 5)**

మరో ఉల్లేఖనం(3676) చివరిలో ఇలా ఉంది: వహ్బ్, వారిలోని ఓ ఉల్లేఖకుడు చెప్పారు, వారి ఒంటెలు త్రాగి మరియు కూర్చునేవరకూ.

ఇది ఆయన పరిపాలనను సూచిస్తుంది. ప్రవక్త(స)వారి ద్వారా తెలుసుకున్నాము. అప్పటి వరకూ అటువంటి వ్యక్తిని చూడలేదంటే, ఉమర్(రజి)వారి ఖలీఫత్ సమయం వరకూ ఆ విధంగా అంత భూభాగాన్ని పరిపాలించినవారు మరియు సకల జీవులు తృప్తిగా ఉండేలా పరిపాలించినవారు రాలేదని అర్థమౌతుంది.

ఉమర్(రజి)వారి గురించి ముహమ్మద్(స)వారు ముందస్తుగా చెప్పిన

విషయాలను బట్టి ఉమర్(రజి)వారు ధర్మంలో, జ్ఞానంలో మరియు మంచి పరిపాలన అందించడంలో మేటి అని అర్థమౌతుంది.

ఆయన పై మూడింటికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వీరులతో పాటు వయస్సులో చిన్నవాడైన ఇబ్నె అబ్బాస్(రజి)వారిని సమావేశాలలో కూర్చుండ బెట్టేవారు. ఆ కుర్రవానిని చూసి అసూయ చెందేవారికి ఒకసారి ఖుర్'ఆన్‌లోని ఒక సూరహ్ యొక్క సరియైన అర్థాన్ని ఇబ్నె అబ్బాస్(రజి)వారి ద్వారా వినిపించి జ్ఞానం వయస్సుపై ఆధారపడదని అర్థమయ్యేలా చేశారు. (ఇబ్నె అబ్బాస్(రజి) వారి గురించి అందించిన ప్రత్యేక వ్యాసం పాత సంచికలలో చూడండి)

ఎవరైనా తమ స్వంత అభిప్రాయాలను ప్రవక్త(స)వారికి ఆపాదించ వచ్చని, అలా జరగకుండా హదీస్ ప్రామాణికత విషయంలో ఆయన చాలా శ్రద్ధ తీసుకున్నారు. ప్రామాణిక హదీస్‌ల పట్ల శ్రద్ధ తీసుకోవడం మాత్రం ఈయనే ప్రారంభించారు.

హదీస్‌లను, సీరత్ గ్రంథాలను అధ్యయనం చేస్తున్నప్పుడు, ఫిఖ్ పట్ల ఎక్కువ ఆసక్తిగల ముగ్గురు గురించి తరచూ గమనించవచ్చు. ఆ ముగ్గురు - ఉమర్(రజి), ఆయిషా(రజి) మరియు ఇబ్నె అబ్బాస్(రజి).

ఓ హదీస్‌ను అర్థం చేసుకున్న వ్యక్తి, ఆ హదీస్ గురించి మీకు చెప్పినప్పుడు, మీకు అతనికంటే ఎక్కువగా ఆ హదీస్ అర్థం కావచ్చు. ఫిఖ్ జ్ఞానంపై ఆధారపడి ఉంది.

ఫిఖ్ గురించి ఉమర్(రజి)వారు ప్రోత్సహించారు. తాబఈన్ల కాలంలో ప్రోత్సహించబడింది. తబే తాబఈన్ల కాలంలో ప్రోత్సహించ బడింది. నేటి కాలంలో ఫిఖ్ ఇంకా సులువైంది. కంప్యూటర్ సౌకర్యం ఉంది. హదీస్ గ్రంథాలన్నీ ముద్రించ బడటమే కాకుండా, అరబీలో ఇంటర్‌నెట్‌లో అందుబాటులో కూడా ఉన్నాయి.

ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను అర్థం చేసుకోవడం ఫిఖ్. ఆ విధంగా అర్థం చేసుకున్న జ్ఞానులు హదీస్ క్రింద తమకు అర్థమైన విషయాలను వ్యాఖ్యానంలో పొందుపరిచారు. ఆ వ్యాఖ్యానాన్ని చదివాక మీరు కూడా ఆలోచిస్తూ ఉండండి. హదీస్‌లను అధ్యయనం చేస్తూ ఉండండి. ఇన్షా అల్లాహ్, మీకు ఏదైనా ఓ విషయంపై మరింత బాగా అవగాహన కలగవచ్చు.

ఇన్షా అల్లాహ్! వచ్చే సంచికలో 'ఫిఖ్'లో మిగిలిన భాగాన్ని అందిస్తాము.

## ప్రకటన

**మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్షా అల్లాహ్ ఎవరినీ కోరము అల్లాహ్ నుండి తప్ప - శాంతిబాట టీమ్**

**మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.**

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 200/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్షా అల్లాహ్**

## కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

*మనిషి కోతినుండి పరిణామం చెందాడనే*

THEORY OF EVOLUTION

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

# రాతి యుగం ఓ చారిత్రక అబద్ధం

మానవులందరికీ పితామహుడు మరియు అల్లాహ్ యొక్క తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి గురించి, బాలబాలికలకు ప్రత్యేకం శీర్షికలో డిశంబర్'10 సంచికలో స్పష్టంగా వివరించాము. ఆయన కాలం నుండే వ్యవసాయం ప్రారంభమైంది. వారు వస్త్రాలు ధరించారు. 3వ ప్రవక్త ఇద్రీస్(అ)వారి ద్వారా టైలరింగ్ మరియు వ్రాయడం మొదలైంది. నూహ్(అ)వారు ఓడను నిర్మించారు. కాబట్టి మానవుడు ఈ భూమిపై అడుగు పెట్టినప్పటి నుండి సంస్కారంతో ఒక విధానం ప్రకారమే జీవనాన్ని ప్రారంభించడం జరిగింది.

మనిషి కోతి నుండి రూపాంతరం చెందాడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దగ్గర నుండి, ఆ అసత్యాన్ని నిజంగా చూపడానికి చరిత్రను దానికణుగుణంగా మార్చి వ్రాశారు. మన పాఠ్య పుస్తకాల ద్వారా చిన్నతనం నుండి అవే నేర్చుకుంటున్నాము. చిన్నతనం నుండే ఓ అసత్యం మన మనస్సులలో నాటుకు పోయేలా చేస్తున్నారు. ఇటువంటి సిద్ధాంతం ద్వారా మనం ఏ విధంగా మోసగించబడ్డామో స్పష్టంగా తెలుసు కోవడానికి అనువైన ఓ పుస్తకం **"A Historical Lie - The Stone Age"** దీనిని టర్కీ దేశానికి చెందిన హారున్ యహ్యా వ్రాశారు. శాంతిబాట ప్రారంభంలో ఈయన వ్యాసాలను కొన్నింటిని అందించాము. పాఠకుల నుండి విశేష ఆదరణ లభించింది. ఈ పుస్తకాన్ని పూర్తిగా గాని లేదా ముఖ్యవిషయాలను గాని యథాతథంగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

## 4 ఇప్పటి మన నాగరికతకు సంబంధించి ఏమి మిగిలి ఉంటాయి?

*ఈ శీర్షిక తొలి వ్యాసంలో వేల సంవత్సరాల క్రితం మానవులు తయారు చేసిన పనిముట్లు, వస్తువులు, అభరణాల గురించి ఫొటోలతో సహా వివరించాము. రాతియుగం అనేది లేదని అందరికీ అర్థం కావడానికి స్పష్టమైన ఆధారాలతో ఆ వ్యాసం అందించడం జరిగింది. రెండవ సంచికలో "ఈ భూమిపై మానవ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది" అనే విషయంపై ఓ అంచనా వేసి, కనీసం ఒక లక్ష సంవత్సరాల కంటే ఎక్కువేగాని తక్కువ కాదు అని చెప్పడం జరిగింది.*

వందల, వేల సంవత్సరాల తరువాత నేటి మన పెయింటింగ్స్, శిలా విగ్రహాలు మరియు భవంతులు ఏమవుతాయో ఊహించండి. అవి కనిపించవు. మన టెక్నాలజీకి ఆనవాలుగా ఏదో గుర్తు మిగిలి ఉండవచ్చు. మన తయారు చేసుకున్నవి వాతావరణ పరిస్థితులను బట్టి శిధిలావస్థకు చేరుకుంటాయి. ఇనుము తుప్పు పడుతుంది. కాంక్రీట్ క్షీణించడం మొదలవుతుంది.

వేల సంవత్సరాలు గడిచాయి అనుకుందాం! ఇన్ని సంవత్సరాలలో వర్షం ద్వారా ఎంతో నీరు, వేగంగా వీచే గాలులు, వరదలు, భూకంపాల తాకిడికి ఇవన్నీ ఎటువంటి స్థితికి లోనవుతాయో ఊహించండి. మిగిలేవి రాళ్ళలో చెక్కిన విగ్రహాలు, భవంతుల నిర్మాణాలకు ఉపయోగించిన రాళ్ళు మాత్రమే. ఇప్పటి మన కంప్యూటర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, ఎ.సి. మెషీన్లు సెల్ ఫోన్లు కనీసం ఆనవాలుగా కూడా మిగలవు.

వేల సంవత్సరాల తరువాత అప్పటి సైంటిస్టులు ఈ 2013 సంవత్సరంలో టెక్నాలజీ అనేది లేదని, నాగరికత అభివృద్ధి చెందలేదని, రాళ్ళు మాత్రమే ఉపయోగించేవారని భావిస్తారు. కాని వారు చెప్పింది తప్పు అని చెప్పడానికి మనం ఉండము కదా!

పదునైన మొన కలిగిన రాళ్ళను పనిముట్లుగా ఆనాటి కోతి వంటి మనిషి తయారు చేసుకున్నాడని చెబుతున్నారు. వాటిని పనిముట్లుగా కాకుండా అలంకరణ కోసం తయారు చేసుకున్నారేమో! ఆ రోజు వారు మనకంటే మంచి నాగరికతతో బ్రతికి ఉండవచ్చు కదా!

కేవలం మిగిలి ఉన్న వస్తువుల ద్వారాగాని, మనకు లభ్యమైన వాటిని బట్టే స్పష్టమైన నిర్ణయానికి ఎలా రాగలం?

"ఏమీ? **వారు భూమిలో సంచారం చేసి తమకు ముందు గతించిన వారి ముగింపు ఎలా జరిగిందో చూడలేదా? వారు, వీరికంటే ఎక్కువ బలం గలవారు. మరియు వీరికంటే ఎక్కువ గుర్తులను భూమిలో వదిలిపోయారు** : కాని అల్లాహ్ వారి పాపాలకు గానూ వారిని పట్టుకున్నాడు మరియు అప్పుడు వారిని అల్లాహ్ పట్టునుండి కాపాడేవాడు ఎవ్వడూ లేకపోయాడు." (ఖుర్ఆన్ 40:21)

**1.5 మిలియన్ సంవత్సరాలకు పూర్వపు పుర్రె**



**సంవత్సరంలో కనుగొనబడిన ముఖ్య సైంటిఫిక్ డిస్కవరీలను ప్రత్యేక సంచికగా అందించే డిస్కవర్ (Discover) అనే మేగజైన్ ఈ డిస్కవరీకి ప్రాధాన్యతనిచ్చింది. మిలియల్ సంవత్సరాల క్రితం రోగిని ప్రజలు శ్రద్ధగా చూసుకునేవారని, వారి క్షేమాన్ని కోరుకునేవారని తెలుస్తుందని, చరిత్రలో ఎన్నడూ మనిషి జంతువు వలే బ్రతకలేదని, ఎల్లప్పుడూ మనిషిలాగే బ్రతికాడని దానిలో రిపోర్ట్ చేయడం జరిగింది.**

2005 సంవత్సరంలో జార్జియాలో ఓ ఫాసిల్ (fossil) కనుగొన బడింది. పరిణామవాదుల దృష్టిలో మన పూర్వీకులు జంతువుల వలే జీవించారని, సాంఘిక జీవితం వారికి లేదని అశాస్త్రీయంగా ప్రకటిస్తారు. ఈ ఫాసిల్ పుర్రె ఓ వృద్ధుడిది. **David Lordkinpanidze** అనే శాస్త్రవేత్త పరిణామవాదుల ప్రకటనలు అవాస్తవమని చూపారు.


కనుగొనబడిన ఆ పుర్రెకు ఒక్కటే దంతం ఉంది. సైంటిస్ట్‌లు విశ్వసించిన దేమిటంటే, ఆ పుర్రెకు చెందిన వ్యక్తి దాదాపు దంతాలు పూర్తిగా లేకపోవడంతో పాటు ఇతర వ్యాధులు కూడా కలిగి ఉన్నాడని.

అంటే ముసలితనం వరకూ చేరుకున్నాడంటే ఎన్నో బలహీనతలు కలిగి ఉన్నప్పటికీ అతని గురించి శ్రద్ధ తీసుకోబడిందని అర్థమౌతుంది. అతడు రోగి అనేది స్పష్టం అని చెప్పారు. అంటే సమూహంలోని సభ్యులు అతనికి సహకరించారని **Lordkinpanidze** చెప్పారు. ఈ పుర్రె 1.5 మిలియన్ సంవత్సరాలకు పూర్వపు కాలానికి చెందినదిగా తెలుసుకున్నారు.

## 4 లక్షల సంవత్సరాల పురాతన ఈటె (బల్లెం)

1995 సంవత్సరంలో జర్మన్ పురావస్తు శాస్త్రవేత్త **Hartmut Thieme** చెక్క అవశేషాలను చాలా సంఖ్యలో **Schoningen** (జర్మనీ)లో కనుగొన్నారు.

ఇవి చాలా శ్రద్ధగా మంచి నైపుణ్యంతో తయారు చేయబడినవి. మరో విధంగా చెప్పాలంటే, ప్రపంచపు అతి పురాతనమైనవిగా తెలిసిన వేట పరికరాలు. ఈ డిస్కవరీ పరిణామవాదులకు పెద్ద షాక్ ఇచ్చిందని చెప్పాలి.



వారి దృష్టిలో క్రమబద్ధమైన వేట కేవలం 40వేల సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. **Schoningen** ఈటెల వయస్సును రోబిన్ డెన్నెల్ల్ చాలా ఖచ్చితంగా ప్రకటించారు. ఈయన **Scheffield** యూనివర్శిటీకి చెందిన పురావస్తు శాస్త్రవేత్త. ఆయన పరిశోధనా పత్రం **Nature** (నేచర్) మేగజైన్‌లో ప్రచురించబడింది. పరిణామవాదుల అపోహ ఏమిటంటే, అప్పటి మానవులకు అటువంటి వస్తువులు తయారు చేయగలిగే సామర్థ్యం లేదని.

అయితే ఈ ఈటెలు లెక్కలు గట్టగలిగే సామర్థ్యమున్న వారిచే ఒక ప్లాన్ ప్రకారం తయారు చేయబడ్డాయి.

30 సంవత్సరాల వయస్సుండే **Spruce** (దేవదారు) చెట్టు కాండం ఉపయోగించబడింది ప్రతీ ఈటె కొరకు. మరియు దాని మొన గట్టిగా ఉండే మొదలు భాగం నుండి తయారుచేయబడింది.

ప్రతీ ఈటె ఒకే రకమైన ప్రపోర్షన్‌లో నేటి ఆధునిక విధానంలోనే డిజైన్ చేయబడింది.

ఈ సమాచారంపై రోబిన్ డెన్నెల్ల్ ఇలా వ్యాఖ్యానించారు -

"ఎంతో సమయాన్ని మరియు నైపుణ్యాన్ని ఉపయోగించినట్లు ఇవి రిప్రెజెంట్ చేస్తున్నాయి - సరియైన వృక్షాన్ని ఎంచుకోవడంలో, డిజైన్‌ను నిర్ణయం చేసుకోవడంలో మరియు ఆకారానికి సంబంధించి తుది దశలలో."

తరువాత పరిణామవాదుల భావనలను ఖండించారు.

వాటి తయారీలో ఎంతో ప్లానింగ్, సోఫిస్టికేటెడ్ డిజైన్ మరియు కర్రను చెక్కడంలో ఓపిక, ఇవన్నీ నేటి ఆధునిక మానవుని లక్షణాలే!

ఈ ఈటెలను కనుగొన్న వ్యక్తి, ఆ కాలంలో సోపిస్టికేటెడ్ ఈటెలను వాడటాన్ని బట్టి తొలి మానవుని ప్రవర్తన మరియు నాగరికతకు సంబంధించి ప్రతిపాదించిన సిద్ధాంతాలను మార్చి వ్రాయాలని అన్నారు.

కాబట్టి మానవజాతి చరిత్రకు సంబంధించి డార్వినిస్ట్ వానలు వాస్తవాలను ప్రతిబింబించడం లేదు. మానవజాతి ఎన్నడూ పరిణామానికి లోను కాలేదు. ప్రతీ కాలంలో అభివృద్ధి చెందిన నాగరికతతో పాటు, అభివృద్ధికి నోచుకోని నాగరికతను కూడా చూడవచ్చు.

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ రాబోవు సంచికలో ...)**

# మస్జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు 5

**ఇమామ్ బాధ్యతలు** *(క్రిందటి సంచిక తరువాయి)*

ఇమామ్ బాధ్యతల గురించి ఈ శీర్షికలో ఓ వ్యాసాన్ని క్రిందటి సంచికలో ప్రారంభించడం జరిగింది. ఇమామ్ అంటే ధార్మిక నాయకుడు. కేవలం జమాత్‌కి సలాత్‌లో నాయకత్వం వహించడం మాత్రమే కాదు. ఇంకా ఉన్నత అర్థాన్ని చెప్పాలంటే ఒక ప్రాంతానికి అధికారి కూడా.

కాని వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జీతమిచ్చి ఏర్పాటు చేసుకునే ఓ ఉద్యోగస్థుడిలా ఇమామ్‌ను పరిగణిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల అతని పని కేవలం మస్‌జిద్‌లో నమాజ్‌లు చేయించడం వరకేనని హెచ్చరించేవారు కూడా ఉన్నారు. ఈ కారణంగా ఇమామ్‌లు కూడా ఒక మస్‌జిద్‌కి ఇమామత్ చేయడాన్ని కేవలం ఓ ఉద్యోగం గానే భావిస్తున్నారు.

ఉమర్(రజి)వారు ఖలీఫాగా ముస్లిమ్ సామ్రాజ్యాన్ని పరిపాలించారు. మస్‌జిద్‌లో శుక్రవారం 'ఖుత్బా' ఇచ్చేవారు. అతి చిన్న విషయంలో కూడా ఆయన నుండి ప్రజలు వివరణ అడిగేవారు. కుటుంబ ఖర్చుల కోసం కొంత జీతంగా ఆయన తీసుకున్నప్పటికీ, ఖిలాఫత్ అనేది ఉద్యోగం కాదు. అది బాధ్యత. ఉద్యోగానికి పనివేళలు ఉంటాయి. కాని ఈ బాధ్యతకు పనివేళలంటూ ఉండవు. ఉమర్(రజి)వారు రాత్రుళ్ళు గస్తీ తిరిగేవారు.

**మస్‌జిద్ ఇమామ్ గారిది కూడా బాధ్యతే!** అయితే ఈయన పరిధి ఓ చిన్న ప్రాంతం వరకే పరిమితమై ఉంటుంది.

ఉమర్(రజి)వారు తీసుకునే జీతం కేవలం తిండికి, శరీరాన్ని కప్పుకునే వస్త్రానికయ్యే ఖర్చుకే సరిపోతుంది. అయినప్పటికీ ఆయన ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ప్రకారంగా ఏదైనా ఆదేశిస్తే ధనవంతుడైనా లేక పేదవాడైనా సరే దానిని పాటించవలసిందే.

కాబట్టి ఇమామ్‌గారికి అధికారం ఇవ్వాలి. తనపై ఉన్న ధార్మిక బాధ్యతను సక్రమంగా నిర్వహించే అవకాశాన్ని ఆయనకు మనం కల్పించాలి. ఈ బాధ్యతను ఆయన మోసేది కేవలం అల్లాహ్ కోసమే గాని కేవలం జీతం పుచ్చుకుంటున్నందుకు మాత్రమే కాదు. ఇమామ్‌గారు అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లకు వ్యతిరేకంగా వెళితే అప్పుడు ఆయనను నిలదీసి అడగాలి. దానికి ఆయన స్పష్టంగా వివరణ ఇవ్వాలి.

ప్రతీ ఒక్కరూ ఒకరి కొకరు కాపరి. ప్రతీ ముస్లిమ్ తన తోటి ముస్లిమ్ కోసం అడగబడతాడు. ఒకరి గురించి మరొకరు పట్టించుకోవాలి.

## 1. హరామ్ మరియు హలాల్

ఇమామ్‌గా నియమించ బడిన తరువాత ఆ మస్‌జిద్‌కి వచ్చే ముస్లిమ్ కుటుంబాల పట్ల ఒక అవగాహన కలిగి ఉండాలి. వారిలో ఉద్యోగస్తులు, వ్యాపారస్థులు, కూలిపనులు చేసుకునేవారు, రైతులు మొదలైన వారుంటారు. వారు తమ జీవనోపాధి కోసం చేసే ఈ పనులు ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లకు అనుగుణంగా ఉన్నాయో లేదో ముందుగా ధృవీకరించు కోవాలి.

మనం ఇస్లామీయ పరిపాలనలో జీవించడం లేదు. మనం ఏ చట్ట పరిధిలో పాలించ బడుతున్నామో, ఆ చట్టప్రకారం అనుమతించ బడిన కొన్నింటిలో మనకు నిషేధించబడినవి కూడా ఉంటాయి. ఉదాహరణకు మన దేశ చట్టం ప్రకారం, వడ్డీ చెల్లించవచ్చు, వడ్డీ తీసుకోవచ్చు, వడ్డీ లావాదేవీలు వ్రాయవచ్చు. అదంతా చట్టబద్ధమే. కాబట్టి ఆ పనులు చేసేవారు శిక్షార్హులు కారు. కాని మనకు వడ్డీ నిషేధం. అయితే వడ్డీ మనం తీసుకోము అని చెబితే అది చట్టాన్ని వ్యతిరేకించినట్లు కాదు.

మద్యపానం మనదేశ చట్టప్రకారం తప్పుకాదు. మద్యపానానికి దూరంగా ఉండమని, అది శారీరక, మానసిక ఆరోగ్యాలు పాడు చేస్తుందని మనం ప్రచారం చేయవచ్చు. అది కూడా చట్టవ్యతిరేకం కాదు.

వడ్డీ, మద్యపానం వంటి కొన్ని నిషేధాల కోసం కొంచెమైనా మన వారికి తెలుసు. స్పష్టంగా తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. వందల సంవత్సరాల క్రితమే గ్రంథస్థం అయిన ఆ విషయాలు సగటు ముస్లిమ్‌కి తెలియకపోవడం విచారకరం. తెలుసుకోవాలనే ఆసక్తి ప్రజలకు లేదని వదిలేయకుండా, తెలిపాలనే బాధ్యత మనపై ఉందని ఇమామ్‌లు అర్థం చేసుకోవాలి.

"నేనేమైనా వడ్డీ అడిగానా? గవర్నమెంట్ బ్యాంకు వారే ఇస్తుంటే తప్పు ఎలా అవుతుంది? నేనేమీ బ్యాంకు వారిని బాధపెట్టి దౌర్జన్యంగా తీసుకోలేదు కదా!" అనేవారు కూడా ఉన్నారు. వారికి అర్థమయ్యేలా బోధించాలి. అందరికీ ఒకే విధంగా బోధిస్తే అర్థం కాకపోవచ్చు.

ఎవరో వచ్చి అభిమానంతో ఇస్తున్నామని చెప్పి, ఏది ఇస్తే అది వారు త్రాగుతారా? త్రాగరు. అది త్రాగితే ప్రమాదం జరుగుతుందో లేక మేలు జరుగుతుందో తెలియకుండా వారు త్రాగరు. కాబట్టి ఎవరో ఇచ్చే వడ్డీని తీసుకుంటే ఆ తరువాత వారు ఏమి కోల్పోతారో వారికి అర్థమయ్యేలా బోధించాలి.

అలీ(రజి) చెప్పారు, "**మీరు ప్రజల యొక్క మానసిక సామర్థ్యాన్ని బట్టి బోధించాలి.** మీరు ఇష్టపడతారా వారు అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడిని తిరస్కరించడానికి?" (సహీహ్ బుఖారీ, కితాబుల్ ఇల్మ్, అధ్యా. 49) అబూ అత్-తుఫైల్ (రజి) అలీ(రజి) చెప్పినదానినే ఉల్లేఖించారు **(సహీహ్ బుఖారీ, 127,సంపుటి 1)**

వారి స్థాయిలో బోధించకపోతే వారు తిరస్కరించే అవకాశం ఉంది.

ముస్లిమ్ రైతులలో ఎంతమందికి తమ పంటపై జకాత్ ఇవ్వాలని తెలుసు? అది కూడా పంట చేతికి రాగానే చెల్లించాలని ఎందరికి తెలుసు? భూమిని ఎవరికైనా కౌలుకు ఇవ్వాలంటే, ఏ ప్రాతిపదికన ఇవ్వాలో, ముహమ్మద్(స) ఈ విషయంలో ఏయే వాటి నుండి మనల్ని నిరోధించారో ముందుగా రైతులకు తెలియాలి. అలాగే వ్యాపారాలు కూడా.

మన సమాజంలో ఉండే ప్రతీ వ్యక్తికి తాను చేసే పని హలాల్ (ధర్మ సమ్మతమా)? లేక హరామ్ (నిషేధించబడినదా)? అనే విషయం స్పష్టంగా తెలియాలి. స్పష్టంగా తెలిసేలా వారికి బోధించాలి.

హరామ్ మరియు హలాల్ విషయంపై స్పష్టమైన అవగాహన వచ్చేలా చేయడం తొలి ప్రాధాన్యతగా భావించాలి. వీటికోసం హదీస్ గ్రంథాలన్నీ రెగ్యులర్‌గా అధ్యయనం చేస్తూ ఉండాలి.

'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్'' అని చెప్పేసాము మరియు షిర్క్ చేయడం లేదు కాబట్టి కొన్నాళ్ళు నరకంలో ఉండినా, తరువాత స్వర్గంలో వేసేస్తారు అని నమ్మబలికే వారున్నారు.

నిషేధించబడిన దానికి దూరం కాకపోవడం అల్లాహ్ ఆదేశాన్ని తిరస్కరించడమేనని, అది కుఫ్ర్ అవుతుందని వారికి అర్థమయ్యేలా చేయాలి.

మస్జిద్‌ల కోసమని చందాలకై ఎందరో వస్తుంటారు. విరాళాలు సేకరించుకుని వెళ్ళిపోతుంటారు. కాని ఇచ్చేవారిని ఆ సొమ్ము హలాల్ అవునో కాదో అడగడం లేదు. అల్లాహ్ గృహాన్ని హలాల్ సొమ్ముతోనే నిర్మించాలి. ఇస్లామ్‌కి పూర్వం అరబ్బులు 'కాబా' మస్జిద్ పునర్నిర్మాణం గావించినప్పుడు, వారి దగ్గర ఉన్న హలాల్ సంపాదననే వాడారు. అయితే ఆ సొమ్ము సరిపోక పోవడంతో ఒక గోడను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారు. వారి హలాల్ సొమ్ము అయిపోయిందిగాని, హరామ్ సొమ్ము ఉంది. కాని దానిని ఉపయోగించ లేదు.

ముష్రిక్‌లే హరామ్ సొమ్మును ఉపయోగించనప్పుడు, ముస్లిములు హరామ్ సొమ్మును ఎలా ఉపయోగించ గలరు?

ఆ గోడను పూర్తిచేయడానికి మక్కా అరబ్బులు ఇతర ప్రాంతాలకి వెళ్ళి చందాలు వసూలు చేయలేదు.

ముహమ్మద్(స)వారు తన అనుచరులతో కలిసి నిర్మించిన తొలి మస్జిద్ కేవలం ఖర్జూరపు ఆకులతో, బోదెలతోనే నిర్మించబడింది.

ఇటువంటి విషయాలు బోధించి, చందాల కోసం వచ్చేవారిని సంస్కరించాలి. చాలా చోట్ల హరామ్ సంపాదన అని స్పష్టంగా తెలిసినా కూడా, ఆ సొమ్మును మస్జిద్‌లకు ఉపయోగిస్తున్నారు.

ఇమామ్‌లు ఈ విషయాలను చాలా సీరియస్‌గా తీసుకోవాలి.

హరామ్ మరియు హలాల్ మధ్య తేడా తెలుసుకోకుండా జీవితాలు గడిపే సమాజం అల్లాహ్ అనుగ్రహాలకు దూరం అయిపోదా?

## 2. ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ను నేర్పించడం :

నమాజ్ విధానాలు మరియు ఆ సలాత్‌లో చదవడానికి కొన్ని చిన్న సూరహ్‌లు మరియు కొన్ని దు'ఆలు నేర్పించి సరిపోతుంది అని అనుకుంటున్నారు. ప్రారంభంలో ఇది తప్పనిసరి. అయితే అతి ముఖ్యమైనది ఖుర్‌ఆన్‌ను నేర్పించడం. అరబీ చదవడం, అర్థం చేసుకుంటూ చదవడం నేర్పాలి.

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి పరిపాలనలో గవర్నర్లకు కొన్ని విధులు ఉండేవి. వాటిలో రెండింటిని ఇక్కడ క్లుప్తంగా తెలియజేస్తున్నాము.

- **సలాత్ స్థాపించడం** : గవర్నర్‌కి చాలా బాధ్యతలుంటాయి. అయినా సరే ఆయన జమాత్ చేత సలాత్ చేయించాలి. అంటే ఆయనే ఇమామ్. అతని పరిపాలనా విషయాలలోనే కాకుండా ధార్మిక నాయకునిగా, జ్ఞానిగా మరియు ధర్మబోధకుడిగా ఉండాలి. శుక్రవారం ఖుత్బా ఇవ్వాలి.
- **ప్రజలను విద్యావంతులను చేయడం** : ప్రజలకు వారి ధార్మిక బాధ్యతలను నేర్పించాలి. గవర్నర్లు మస్జిద్‌లలో కూర్చుని ప్రజలకు ఖుర్‌ఆన్ మరియు ఇస్లామ్‌ను బోధించేవారు.

ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో మస్జిద్‌లు విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లాయి. స్థలాభావం వలన ఒక ఉదాహరణను మాత్రమే ఇక్కడ అందిస్తున్నాము. అబూ మూసా(రజి)వారు బస్రాకు గవర్నర్‌గా చాలాకాలం పనిచేసారు. గవర్నర్‌గా ఆయనకు ఎన్నో బాధ్యతలుండేవి. అయినప్పటికీ తన సమయంలో ఎక్కువ భాగం ప్రజలకు ధర్మం గురించి బోధించడానికి ఉపయోగించేవారు.

**ఆయన మస్జిద్‌లో రోజూ తరగతులు (క్లాసెస్) నిర్వహించేవారు. మరియు ఆయన ఎల్లప్పుడూ ఏ చిన్న అవకాశం లభించినా ఇతరులకు జ్ఞానాన్ని అందించేవారు.**

మస్జిద్‌లో ఉదయం ఫజ్ర్ సలాత్ పూర్తి చేశాక, ఆయన జమాత్‌కి అభిముఖంగా తిరిగి వారికి ఖుర్‌ఆన్ నేర్పించేవారు మరియు వారి ఖుర్‌ఆన్ పఠనాన్ని వినేవారు. ఏదైనా పొరపాటు దొర్లితే, మధ్యలో ఆపి వారి పఠనాన్ని సరిదిద్దేవారు. ఒక్కొక్కరికి విడివిడిగా చెప్పేవారు.

ఆయన ఖుర్‌ఆన్ పఠనం చాలా బావుండేది. అబూ మూసా(రజి)తో ఉన్నప్పుడు ఉమర్(రజి)వారు కూడా ఆయనను ఖుర్‌ఆన్‌లోని కొంత భాగం పఠించమని అడిగేవారు.

ఆయన ఎక్కడకు వెళ్ళినా ఖుర్‌ఆన్ నేర్పేవారు. ఆయన స్వరం ప్రజలను ఆకర్షించేది. ఆయన చుట్టూ ప్రజలు గుమిగూడేవారు. విద్యార్థులు బాగా ఎక్కువైనప్పుడు, వారు గ్రూపులుగా కూర్చుని ఉంటే, ఒక గ్రూపు నుండి మరొక గ్రూపుకు వెళుతూ ఆయన ఖుర్‌ఆన్ పఠించడం మరియు వారి పఠనాన్ని విని సరిదిద్దడం చేసేవారు.

ఒకసారి అబూ మూసా(రజి)వారు అనస్ బిన్ మాలిక్(రజి)వారిని

ఉమర్(రజి)వారి దగ్గరకు పంపారు. అనస్(రజి)వారు మదీనా చేరగానే ఉమర్(రజి)వారు అడిగారు ''(అబూ మూసా) **అల్-అష్'అరీ ఏం చేస్తున్నారు మీరు ఆయన దగ్గరనుండి వచ్చేటప్పుడు?**''

**"నేను ఆయన దగ్గర నుండి వచ్చేటప్పుడు, ఆయన ప్రజలకు ఖుర్'ఆన్ నేర్పుతున్నారు"** అని అనస్(రజి)వారు సమాధానమిచ్చారు.

''అయితే ఆయన తెలివైనవారు మరియు జ్ఞాని'' అన్నారు ఉమర్(రజి)

''కాని నేను ఏదైతే ఆయన గురించి చెప్పానో దానిని ఆయనకు చెప్పవద్దు.''

యుద్ధరంగానికి వెళ్ళేటప్పుడు కూడా ధర్మాన్ని బోధించడం వదలలేదు అబూ మూసా(రజి)వారు.

ఆయన ద్వారా 303 లేదా 309 మంది ఖుర్'ఆన్‌ను కంఠస్థం చేయడం జరిగింది. సున్నత్‌ను ప్రజలకు నేర్పేవారు మరియు ప్రవక్త(స)వారి నుండి ప్రత్యక్షంగా విన్నవాటిని మరియు ప్రముఖ సహాబీల నుండి విన్నవాటిని ఉల్లేఖించారు.

ఆయన జ్ఞానాన్ని నేర్చుకునేవారు మరియు బోధించేవారు.

ఆయన ఎప్పుడు మదీనా వెళ్ళినా ఉమర్(రజి)వారి సమావేశాలలో ఎక్కువ సమయం గడిపేవారు. అబూబక్ర్ బిన్ అబూ మూసా వారి ఓ ఉల్లేఖనం ప్రకారం,

ఇషా సలాత్ తరువాత ఒకసారి అబూ మూసా(రజి)వారు ఉమర్(రజి)వారి దగ్గరకు వెళ్ళారు. ఉమర్(రజి)వారు ఆయనను అడిగారు, **"మీరెందుకు వచ్చారు?"**

**"నేను మీతో మాట్లాడటానికి వచ్చాను"** చెప్పారు అబూ మూసా(రజి)

**"ఈ సమయంలోనా?"** అడిగారు ఉమర్(రజి)వారు ఆశ్చర్యపోతూ

**"మనం ఫిఖ్ గురించి చర్చిద్దాం"** అన్నారు అబూ మూసా(రజి).

అంటే జ్ఞానాన్ని నేర్చుకోవడానికి మరియు చర్చించడానికి రోజులోని ప్రతీ గంట సరియైనదే. వారిద్దరూ కొంత సేపు కూర్చున్నారు. తహజ్జుద్ నమాజ్‌కి వేళ అయిందని గ్రహించి అబూ మూసా(అ) అన్నారు,

**"సలాత్, ఓ అమీరుల్ మోమినీన్!"**

**"మనం ప్రార్థన మధ్యలోనే ఉన్నాము"** అన్నారు ఉమర్(రజి).

అంటే ఇస్లామీయ జ్ఞానాన్ని అన్వేషించడం, నేర్చుకోవడం కూడా ప్రార్థన వంటిదే.

అబూ మూసా(రజి)వారు జ్ఞానాన్ని అన్వేషించడం, నేర్చుకోవడమే కాకుండా, ఆయన నేర్చుకున్నదానిని ఇతరులకు అందించడానికి కూడా కృషి చేసేవారు. జుమ్మా ప్రసంగంలో కూడా ప్రజలను ఇలా చేయమని ప్రోత్సహించేవారు.

''అల్లాహ్ ఒకరికి జ్ఞానాన్ని నేర్పితే, అతడు దానిని నేర్పాలి (ఇతరులకు). కాని అతనిని తనకు జ్ఞానం లేని విషయానికి సంబంధించి మాట్లాడనివ్వకండి. లేకపోతే, అతడు (చెడు) ప్రభావం చూపే వారిలోని వాడవుతాడు మరియు అతడు ధర్మం నుండి వెళ్ళిపోతాడు.''

ఇమామ్ మస్జిద్‌లో ధర్మం గురించి నేర్పడమే కాకుండా, తాను కూడా గ్రంథాలు అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇమామ్‌కి జ్ఞానం ఎంత ఎక్కువయితే సమాజానికి అంత మేలు అవుతుంది.

## 3. పేదల సంక్షేమం :

పేదవారికి మరియు అప్పులపాలైన వారికి మరియు అవసరాలలో ఉన్నవారికి సహాయం సరియైన విధంగా అందేలా చూసే బాధ్యత కూడా ఇమామ్‌గారే చూసుకోవాలి. కాబట్టి తన పరిధిలో ఉండే ఏరియాలో వీరి గురించి వాకబు చేసి ఓ జాబితా తయారుచేసుకోవాలి.

సేకరించబడిన జకాత్ నుండి పేదలకు అందేలా చూడాలి. అక్కడి పేదవారు జకాత్ చెల్లించే స్థాయికి చేరేవరకూ అక్కడే జకాత్ పంపిణీ అయ్యేటట్లు చూడాలి. జకాత్‌లో అత్యధిక భాగం పేద ప్రజలకు అందడం లేదు.

జకాత్ కోసం ఎక్కడెక్కడి నుండో వస్తున్నారు. తమ చుట్టూ ఉండే పేదవారిని వదిలి, కాశ్మీర్ నుండో, కన్యాకుమారి నుండో, ఏదో వంకతో వచ్చేవారికి జకాత్ ఇవ్వడం సున్నత్ కాదు.

కమీషన్ల కోసమే మస్జిద్‌లు నిర్మించేవారున్నారు. డబ్బు కోసమే బిల్ పుస్తకాలు పట్టుకుని వచ్చే వారున్నారు. **కాబట్టి ఇమామ్‌గారు వీరిపట్ల వివేకంతో వ్యవహరించ వలసి ఉంది.** తన ఏరియాలో సాంఘిక సంక్షేమం సరియైన విధంగా అమలు అయ్యేలా చూడాలి.

## 4. ముస్లిముల మధ్య ఐక్యత కోసం కృషి

ముస్లిముల మధ్య అభిప్రాయ బేధాలు వచ్చినప్పుడు ఖుర్'ఆన్ మరియు ప్రామాణిక హదీస్‌లతో సమస్యను పరిష్కరించి, ముస్లిములు ఐక్యంగా ఉండేలా కృషి చేయాలి. **ముస్లిముల ఐక్యతను పాడు చేయడానికి ఎన్నో విద్రోహశక్తులు పనిచేస్తున్నాయి.** మస్జిద్‌లో వేరే జమాత్‌ల గురించి వెక్కిరింపు మాటలుగాని, రెచ్చగొట్టే వ్యాఖ్యలుగాని ఎవరైనా చేస్తే వారిని హెచ్చరించి అటువంటి వాటికి మస్జిద్‌లో అవకాశం లేకుండా చేయాలి.

**బహుదైవారాధకుల చేత మరియు గ్రంథ ప్రజల చేత కలిమా చదివించడానికి ఆసక్తి చూపుతూ, కలిమా చదివినవారే అయినప్పటికీ ఇతర జమాత్‌లకు చెందిన ముస్లిములపై విరోధం పెంచుకోవడం ఎక్కడి సాంప్రదాయం? ముస్లిముల మధ్య ఐక్యతకై ఇమామ్‌లు తీవ్రంగా కృషి చేయాలి. కొన్ని చోట్ల కంచే చేను మేసింది అన్నట్లు, ఇమామ్‌లే రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. అటువంటి పరిస్థితిలో ప్రజలే ఇమామ్‌ను నియంత్రించాలి.**

(వ్యాసం చివరి భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)

# పాఠకుల అభిప్రాయాలు

### కొత్తగా చేరిన పాఠకులకు ...

శాంతిబాటలో అందించే విషయాలు ఒక సీరియల్‌గా ఒక క్రమంలో అందిస్తున్నాము. మీరు ఫలానా దానికి వ్యతిరేకమా? అంటూ మాకు సందేహాలు పంపే ముందు, మా ప్రారంభ సంచిక ఆగస్టు, 2009 నుండి ప్రచురించబడిన సంచికలు అన్నీ చదవండి. అప్పటికీ సందేహం ఉంటే లెటర్లో తెలపండి. ఫోన్‌లో వద్దు.

మీరు డబ్బు పంపితే మొదటి నుండి ప్రచురించబడిన పుస్తకాలను పంపగలము. లేదా ఇంటర్‌నెట్ సదుపాయం ఉంటే, మా వెబ్‌సైట్ www.saanthibaata.net లో వాటిని చదువుకోవచ్చు.

కేవలం శాంతిబాటలో మేము ప్రచురించిన విషయాలపైనే మీ సందేహాలను గాని అభిప్రాయాలను గాని పంపండి.

**శాంతిబాట దావాకు ఎలా వ్యతిరేకం అవుతుంది?** ఎందుకంటే ఇది ప్రతీ ముస్లిమ్‌పై ఉన్న బాధ్యత. దాయీలుగా పిలవబడేవారి వల్లనే దావా జరుగుతుంది అనుకోవడం ఎండమావిలో నీరు ఉంటుందని బావించడం ఒక్కటే. ఎందరో ఇస్లామ్ ధర్మం కోసం తమకు తెలిసిన జ్ఞానాన్ని ఇతరులకు చెబుతున్నారు. వీరు వేదికలపై కనిపించరు. నిశ్శబ్దంగా అల్లాహ్ కోసం చేస్తున్నారు.

మదరసాలు అత్యున్నత స్థాయిలో అంతర్జాతీయ విద్యాలయాలను మించి అభివృద్ధి కావాలనేది శాంతిబాట టీమ్ కోరిక. ఇది జరగడానికి మదరసాలకు ఎక్కడ నుండో ప్రత్యేకంగా ఫండ్స్ రానవసరం లేదు. ముస్లిముల నుండి సేకరిస్తున్న విరాళాల నుండి కొంత సొమ్ము నిజాయితీగా ఖర్చు పెడితే చాలు.

### అనుమతి కోసం ...

శాంతిబాట మొదటి పేజీలో ప్రకటన ఇచ్చిన తరువాత నుండి, శాంతిబాటలో ప్రచురించబడిన వ్యాసాలను పుస్తకాలుగా ప్రచురించు కోవడానికి మరియు వెబ్‌సైట్లలో వారు కోరుకున్న విధంగా అప్‌లోడ్ చేసుకోవడానికి అనుమతి అడుగుతున్నారు.

**ఈ అనుమతి మేము ఎవరికీ ఇవ్వడం లేదు.** ముస్లిమ్ సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కొన్ని కారణాల దృష్ట్యా మేము ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. శాంతిబాటలోని ప్రతీ శీర్షిక ఇన్షా అల్లాహ్ పుస్తక రూపంలో విడుదల అవుతుంది. ఆ పనులు జరుగుతున్నాయి.

డబ్బుకోసంగాని, కీర్తి కోసంగాని శాంతిబాట టీమ్ పనిచేయడం లేదని మా పాఠకులకు ఎవరూ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

త్వరలో మా పబ్లికేషన్స్ ద్వారా తక్కువ వెలకే వివిధ పుస్తకాలను ఇన్షా అల్లాహ్ అందిస్తాము. డైరెక్ట్‌గా మా వెబ్‌సైట్లకు లింక్ పెట్టుకోవచ్చు. కాని శాంతిబాట కంటెంట్ మార్చి తమ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసుకోవడానికి మేము అనుమతించము. అంతేకాకుండా, శాంతిబాటకు ఏ జమాత్ యొక్క ఐడెంటిటీని తగిలించడానికి వీల్లేదు.

**దయచేసి మీ సందేహాలు మరియు అభిప్రాయాల కొరకు ఫోన్ చేయవద్దు. లేఖ వ్రాయండి. మీ ఫోన్ కాల్ ఆన్సర్ చేయబడదు.**

**ఇతర ఎంక్వయిరీలు సోమవారం నుండి శనివారం వరకూ మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకూ మాత్రమే. ఈ కాల వ్యవధిలోనే ఫోన్ కాల్స్ ఆన్సర్ చేయబడతాయి.**

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయాలని మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు.శాంతిబాటలో అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో అందిస్తున్నాము కేవలం అల్లాహ్‌పై నున్న భరోసాతో మాత్రమే.**

మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Publishing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

# తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక




అల్లాహ్ అనుగ్రహంతో
కేవలం సత్యాన్నే అందిస్తూ
4వ సంవత్సరం
విజయవంతంగా
నడపబడుతుంది.
అల్-హమ్‌దులిల్లాహ్!




సర్వమానవాళి సంతోషంగా
జీవించడానికి అల్లాహ్ చూపిన మార్గాన్ని
సులభమైన తెలుగులో అందరికీ
అందించాలనేది మా సంకల్పం

విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే వారి కోసం ప్రచురించబడిన వెంటనే పత్రికను
వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న ఏకైక తెలుగు ఇస్లామీయ మాసపత్రిక




అల్లాహ్‌ను మరియు ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిచే
ఆదరించ బడుతూ, ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందించే పత్రిక





***For Free Download of Our Magazine and Books visit***
***www.saanthibaata.net***
***www.saanthibaata.com***
(only for personal use)




ధర్మం పేరుతో పేదప్రజలకు అందవలసిన
సొమ్మును దోచుకుంటున్న అవినీతి విద్వాంసుల
మరియు ప్రచారకుల గుట్టు బయట పెట్టిన పత్రిక

శాంతిబాట
ప్రారంభానికి
ముందు
ప్రచురించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




శాంతిబాట
పాఠకులకు
తొలి సంవత్సరం
ఉచితంగా
అందించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




సత్యాన్ని ప్రేమించేవారికి
మా మనవి :
మీ బంధువులను, స్నేహితులను
చందాదారులుగా చేర్చి సత్యాన్ని
వ్యాపింపజేయమని కోరుతున్నాము.

**SAANTHIBAATA MONTHLY April, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

సృష్టికర్తయైన అల్లాహ్ పంపిన ప్రవక్త మరియు సందేశహరుడైన

# ముహమ్మద్(స)వారి బోధనల సారాంశం

ఏ ధర్మానికి చెందిన పొరుగువాడైనా సరే, ఆ పొరుగువానిని ప్రేమించడం మాత్రమే కాకుండా, అతడి అవసరాలను కూడా తెలుసుకోవాలి. అతడు ఆకలితో ఉంటే, అతనితో పాటు ఆహారాన్ని పంచుకోవాలి. అతడు పస్తులుండగా మనం కడుపు నిండా తింటే మనం విశ్వాసులం కాము.

కూలివాని చెమట బొట్టు ఆరకముందే అతని కూలి అతనికి ఇచ్చివెయ్యాలి.

బహుమతులుగాని మరేదైనా పంచవలసి వస్తే మన ఇంటికి ఏ పొరుగువాని గుమ్మం దగ్గరగా ఉందో వారికి ముందు ఇవ్వాలి, వారు ముస్లిములు కాకపోయినా సరే.

పొరుగువాని ప్రశాంతతకు భంగం కలిగించేవాడు విశ్వాసి కాడు.

భార్యను బాగా చూసుకునే వాడే ఉత్తముడు.

తల్లిదండ్రులను ప్రేమించాలి. వారికి సేవ చేయాలి. వారి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారు వృద్ధాప్యంలో ఉంటే, 'ఉఫ్' అని అసహనం కూడా వ్యక్తం చేయకూడదు.

పిల్లలను ప్రేమించాలి. వారు ఆడపిల్లలైనా మగపిల్లలైనా సరే వారిని విద్యావంతులుగా చేయాలి. ఉత్తమ లక్షణాలు వారికి అలవడేలా వారికి శిక్షణ నివ్వాలి.

వ్యభిచారానికి, మద్యపానానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

స్త్రీలను గౌరవించాలి.

పరమత సహనం కలిగి ఉండాలి.

కుమార్తెలను బాగా చూసుకునే విశ్వాసులకు స్వర్గ శుభవార్తనిచ్చారు. కుమార్తెలను కలిగి ఉండడం విశ్వాసులకెంతో అదృష్టం.

మానవులంతా సమానమే. వారి రంగు, రూపు, జాతి, స్థితి మొదలైన వాటివలన వారికి ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా) కలిగి, మంచిగా ఆచరించేవారే అందరికంటే అధికులు.

తన స్వహస్తాలతో కష్టపడి తినేతిండి ఉత్తమమైన ఆహారం. శక్తిని బట్టి కష్టపడి పనిచేసి సంపాదించాలి.

ఆధునిక సైన్స్‌కు పునాదులు వేయించి, సైన్స్‌లో వివిధ రంగాలకు పితామహులను తయారుచేసిన ఇస్లామ్ సర్వమానవులు ఆచరించదగిన ధర్మం. ఎవరో కొందరు ముస్లిములను చూసి ఇస్లామ్‌ను నిందించడం అనాగరికం మరియు హేయమైన పని. కత్తితో ఇస్లామ్ వ్యాపించలేదు. మానవత్వంతో, ఉత్తమ సంస్కారంతోనే వ్యాపించింది.

Visit
www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్